ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-1-2026 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 359 పేజీలు: 10+4 వెల: 6.50



అజిత్ అంత్యక్రియలకు మంత్రి లోకేష్ హాజరు 2లో

ఖర్గే, రాహుల్‌తో శశిథరూర్ భేటీ 5లో


# వడివడిగా రోడ్ల విస్తరణ


గురువారం జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి శాఖపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

## రూ.1.40 లక్షల కోట్ల జాతీయ రహదార్ల ప్రాజెక్టులు 2029కి పూర్తి

## 2027కు బెంగళూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్

## రవాణా వ్యయం తగ్గించేలా రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు: సిఎం చంద్రబాబు

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో ప్రస్తుతం చేపట్టిన రూ.1.40 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు 2029 నాటికి పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల సంస్థ, కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారుల నెట్వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారులు, రోడ్ డెన్సిటీ పెంపు, ప్రస్తుతం ఏపీలో చేపట్టిన ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతి, కొత్త రహదారుల నిర్మాణం తదితర అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. సరుకు రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం ఓడరేవులను ఈ జాతీయ రహదారులతో అనుసంధానించాలని సూచనలు జారీ చేశారు. ఈ పోర్టులకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా సరుకు రవాణా చేసేలా హింటర్ ల్యాండ్‌ను కనెక్టు చేసేలా రోడ్లు నిర్మించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టులను పూర్తి చేసే విషయంలో దేశంలోనే ఏపీ బెంచ్ మార్క్ గా ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4లేన్లుగా, 6 లేన్లుగా మార్చేందుకు ప్రణాళికలు చేపట్టాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రూ.42,194 కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణం పురోగతిలో >>2



## ఎపిలో తగ్గుతున్న ద్రవ్యోల్బణం

### కేంద్ర ఆర్థిక సర్వేలో పేర్కొన్న మంత్రి సీతారామన్

### రెండు తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన ధాన్యం దిగుబడి

**విజయవాడ,జనవరి 29, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ద్రవ్యోల్బణం గుర్తించ తగిన స్థాయిలో తగ్గుతుంది. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాన్ని వెల్లడించారు.,ఆంధ్రప్రదేశ్‌లో 7.57 నుంచి 1.39 శాతానికి దిగివచ్చినట్లు తెలిపారు.. తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం జాతీయ సగటు 1.72 శాతం కంటే తక్కువ నమోదైనట్లు ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ, ఏపీలో ధాన్యం దిగుబడి తక్కువగా నమోదైనట్లు కేంద్రం పేర్కొంది. అకాల వర్షాలే ఇందుకు కారణమని చెప్పింది. కొత్త నగరాల విస్తరణలో అమరావతి గురించి ఆర్థిక సర్వేలో కేంద్రం ప్రస్తావించింది. లోక్‌సభలో ఆర్థికసర్వే ప్రవేశపెట్టిన అనంతరం సభను ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదా వేశారు. 2026- 27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ 2026 2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవుతుందని సర్వే అంచనా వేసింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 202526 ఆర్థికసర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక సర్వేలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధి ప్రస్తావించారు. తెలుగు రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం ఏటా తగ్గుతూ వస్తోందని పేర్కొంది. 2022- 23 నుంచి 2025- 26 వరకు ద్రవ్యోల్బణం భారీగా తగ్గినట్లు కేంద్రం పేర్కొంది. ముఖ్యం గా తెలంగాణలో ద్రవ్యోల్బణం 8.61 నుంచి 0.20 శాతానికి పడిపోయినట్లు పేర్కొంది.

# కొండెక్కిన వెండి

## ఒకే రోజు రూ.21వేలు పైగా పెరుగుదల

## మరో రూ.12వేలు పెరిగిన బంగారం

**ముంబయి, జనవరి 29:** బంగారం, వెండి ధరలు ర్యాలీ మరింత వేగంగా దూసుకుపోతున్నాయి. గురువారం, బంగారం వెండి ధరలు ఊహించని రీతిలో పెరిగాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో వెండి తొలిసారిగా కిలోకు 4 లక్షల రూపాయలు దాటింది. బంగారం సైతం 10 గ్రాములకు 1.8 లక్షల రూపాయలకు చేరింది. దీనికి ప్రధాన కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న భయాలు, రాజకీయ ఒత్తిడుల కారణంగా ధరలు కొండెక్కుతున్నాయి. ఎంసిఎక్స్ లో ఫిబ్రవరి 5, 2026కి ముగిసేబంగారం కాంట్రాక్టు ధర 6శాతంపెరిగింది. 10 గ్రాములకు గానూ 1,75,869 రూపాయలకు చేరింది. మార్చ్ 5, 2026కి ముగిసే వెండి ధర5శాతం పెరిగి 4,00,780 రూపాయలకు వచ్చింది. ప్రధాన కారణం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచకూడదని నిర్ణయించడమని నిపుణులు చెబుతున్నారు. రాజకీయ పరిణామాలు కూడా ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై హెచ్చరికలు చేశారు. న్యూక్లియర్ చర్చలు నిలిచిపోయాయని, సమయం ముగుస్తోంది అని చెప్పారు. గల్ఫ్ ప్రాంతంలో భారీ సైనిక నియామకాలు చేస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండి రికార్డ్ స్థాయిలకు చేరాయి. స్పాట్ బంగారం ఒక్కరోజులో 3 పెరిగి 5,591.61 ఒకౌన్స్‌కి చేరింది. వెండి ఒక్కసారిగా 119.34 ఒకౌన్స్‌కి చేరి, తర్వాత 118.061 వద్ద స్థిరపడింది. మార్కెట్ విశ్లేషకుల వివరాల ప్రకారం వెండి బంగారం కంటే తక్కువకు లభిస్తుంది. దీంతో కొందరు పెట్టుబడిదారులు ట్రెండ్‌ను అనుసరించి వెండిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఈ అంశంపై మరికొన్ని రోజులలో బంగారం, వెండి




ధరల్లో మార్పులు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. డాలర్ ఇండెక్స్, అమెరికా ఉద్యోగ గణాంకాలు,రాజకీయ ఉద్రిక్తతలతో ఇది ప్రభావితమవుతుంది.దేశీయంగా బంగారం రూ.1,61,600- 1,64,000 మద్దతు వద్ద నిలుస్తుందన్న అంచనాలున్నాయి. వెండిధరల్లో కూడా రూ. 3,64,800-3,74,000 మద్దతురావచ్చని అంచనా. ఒక్కరోజులోనే 24 క్యారెట్ల బంగారంధరలు కొన్నిగంటలకే రూ.12వేలు పెరిగింది. కిలో వెండి కూడా ఏకంగా రూ.21 వేలు పెరిగినట్లు అంచనా. ఫ్యూచర్స్‌లోకూడా ఇదే తీరు కొనసాగింది. గ్లోబల్‌స్పాట్‌మార్కెట్లలోకూడా బంగారం వెండిధరలు పెరుగుతున్నాయి.


గురువారం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

## ఏప్రిల్ 1నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్

### రాష్ట్ర చేనేత మంత్రి సవిత

**సచివాలయం,జనవరి 29,ప్రభాతవార్త:** నేతన్నలకు ఎన్నికల్లో ఇచ్చిన మరో కీలక హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పిందని ఏప్రిల్ 1వ తేది నుండి ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నామని రాష్ట్ర చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.ఏప్రిల్ 1వ తేది నుండి మగ్గాలకు 200యూనిట్లు, మర మగ్గాలకు 500యూనిట్లు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు.ఈ పథకం అమల్లో భాగంగా ఏడాదికి రూ.85 కోట్ల మేర ప్రభుత్వ ఖజనాపై భారం పడనున్నట్లు తెలిపారు.తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని సుప్రీంకోర్టు సిట్ తేల్చిందని,ఆ తప్పులను కప్పి పుచ్చుకోవడానికి జగన్ బ్యాచ్ బుకాయిస్తుందని మం డిపడ్డారు. అమరావతిలోని >>2

# కేన్సర్ నియంత్రణకు పటిష్ట కార్యాచరణ

### 'పద్మభూషణ్' నోరి దత్తాత్రేయుడుతో కలిసి ఎపి కేన్సర్ అట్లాస్ విడుదల చేసిన సిఎం చంద్రబాబు

**విజయవాడ జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వివిధ రకాల క్యాన్సర్లను నియంత్రించేలా కార్యాచరణ చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశంలో కేన్సర్ వ్యాధిని నోటిఫై చేసిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించిందని అన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు, ఏపీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడితో కలిసి కాన్సర్ స్క్రీనింగ్ అట్లాస్ ను సీఎం విడుదల చేశారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి రూపొందించిన ఈ అట్లాస్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలిదశలో 2.9కోట్ల మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి నమోదు చేసిన వివరాలతో ఈ అట్లాస్‌ను రూపొందించారు. విజన్ స్టేట్మెంట్ ద్వారా 2030 నాటికి అడ్వాన్స్ క్యాన్సర్ ట్రీట్మెంట్, మిషన్ స్టేట్మెంట్ >>2


నోరికి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం చంద్రబాబు



# మేడారం.. మహాజనసంద్రం

### గద్దెపైకి చేరిన సమ్మక్క

### అమ్మవార్లను దర్శించిన కేంద్రమంత్రులు జోయల్ ఓరం, కిషన్ రెడ్డి, పలువురు తెలంగాణ మంత్రులు

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాతవార్త:** దక్షిణ భారత కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారంలో ఇప్పటికే గద్దెపై సారలమ్మ, గోవిందరాజులు,పగిడిద్దరాజు కొలువుదీరగా గురువారం అర్ధరాత్రి వరాల తల్లి సమ్మక్క ఆగమనం జరిగింది. చిలుకలగుట్ట నుంచి కుంకుమ భరణి రూపంలో ఉన్న అమ్మవారిని గద్దెపై తీసుకొచ్చి సిద్ధబోయిన వంశీయులు,చందా వంశీయులు ప్రతిష్టించారు.సమ్మక్క రాకతో మేడారం జాతరలో పరిపూర్ణమైన కీలక ఘట్టం పూర్తయింది.భారీ బందోబస్తు మధ్య గద్దెల ప్రాంగణానికి పూజారులు ప్రయాణించారు. రోడ్డుకు ఇరువైపులా లక్షలాది మంది భక్తజనసందోహం.. ఇసుకేస్తే రాలనంత జనంతో.. ఈ ఘట్టం చూడటానికి రెండు కళ్ళు సరిపోవు.

**మాఘ శుద్ధ పౌర్ణమి వేళ గద్దెపై కొలువుతీరిన సమ్మక్క తల్లి:** రూపమే లేని వనదేవతల కుంభ మేళాలో గురువారం సమ్మక్క తల్లి గద్దెపై ప్రతిష్టతో మేడారంలో మహోన్నత ఘట్టానికి వేదుకగా నిలిచింది.కోరిన వరాలు ఇచ్చే వరాల తల్లిసమ్మక్క రాక సందర్భంగా మేడారంలోని ఆమె గుడిని శుద్ధి చేశారు.మామిడి తోరణాలు కట్టారు. ఆవరణ మొత్తం ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో నృత్యాలు చేస్తూ రంగు రంగుల ముగ్గులు పెట్టారు.సమ్మక్క రాక సందర్భంగా ముందుగా వనం (వెదురు కర్రలను) గద్దె పై ప్రతిష్టించారు. జాతరలో వనం ( వెదురు) కు విశిష్టత ఉంది.వనం అంటే ఆదివాసీ భాషలో అడవి అని అర్థం ఈ వనం నుండి తల్లులు గద్దెల పైకి వస్తారు కాబట్టి ముందుగా ఏపుగా ఎరిగిన వెదురు కర్రలను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మక్క గద్దె వద్దకు తీసుకు వచ్చి ప్రతి ష్టించారు. కాకతీయ రాజులను ఎదిరించి నిలిచిన ధీశాలి. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా >>2



# చెవిరెడ్డికి బెయిల్ మంజూరు

### లిక్కర్ కుంభకోణం కేసు

**విజయవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కరు స్కామ్ కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి బెయిల్ మంజూరు అయ్యింది. చెవిరెడ్డితో పాటు సజ్జల శ్రీధర్ >>2



### పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

### నదులు, జలాశయాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

# 8 ప్రాంతాల్లో హౌస్‌బోట్లు

**విజయవాడ,జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో టూరిజం శాఖ పర్యాటకుల కోసం రాష్ట్రంలో 8 ప్రాంతాల్లో త్వరలో హౌస్ బోట్లు అందుబాటులోకి రానున్నాయి. పలు ప్రైవేట్ ఆపరేటర్లు ప్రధాన నదులు, జలాశయాల్లో వీటిని నిర్వహించేందుకు ముందుకొచ్చారు. గతంలో పలుచోట్ల రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హౌస్ బోట్లు ప్రారంభించినా నిర్వహణపరంగా ఇబ్బందులు తలెత్తాయి. వీటిలో కొన్ని బోట్లు మూలకు చేరాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రైవేట్ ఆపరేటర్ల ఆధ్వర్యంలో వీటి నిర్వహణకు ప్రభుత్వం అనుమతులిస్తోంది. రాష్ట్రంలో 8 చోట్ల సింగిల్, డబుల్ బెడ్‌రూం హౌస్ బోట్ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతించింది. సూర్యలంక, భవానీ ద్వీపం, రాజమహేంద్రవరంలోని >>2



గంజాయి సేవిస్తూ యాడికిలో నడి రోడ్డుపై హంగామా

### కేసు నమోదు చేసిన పోలీసులు

### ఎమ్మెల్యే గుమ్మనూరు పై అధిష్ఠానం గుర్రు

# ఎమ్మెల్యే స్టిక్కర్‌తో రౌడీషీటర్ హల్ చల్

**అనంతపురం,జనవరి 29,ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్టిక్కర్ తో ఉన్న కారులో ఓ రౌడీ షీటర్ హల్చల్ చేయడం, పోలీసులతో గొడవ పెట్టుకోవడం వివాదాస్పదంగా మారింది. గురువారం జరిగిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తెలుగుదేశం అధిష్టాన వర్గం సీరియస్ అయింది. వివరాలకు వెళ్తే యాడికి మండలంలో నడి రోడ్డుపై గంజాయి సేవిస్తూ ఓ రౌడీ షీటర్ హంగామా సృష్టించారూ. అతని దురుసు ప్రవర్తనను అడ్డుకోబోయిన ఓ కానిస్టేబుల్ పై సైతం బెదిరింపులకు దిగాడు.దీంతో పోలీసు బృందం రంగ ప్రవేశం చేసి రౌడీ షీటర్ ను అదుపులోకి తీసుకొని అతని వద్ద >>2



గురువారం మేడారంలో సమ్మక్క సారలమ్మను దర్శించిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, ఓరం తదితరులు

# మేడారం.. మహాజనసంద్రం

>> పోరాటం సాగించిన అడవి బిడ్డ శౌర్యపరాక్రమాలకు నిలువెత్తు రూపం అయిన ఆ తల్లి సమ్మక్క ప్రతిరూపంగా భావించే కుంకుమభరిణెను చిలకలగుట్ట నుండి అధికార లాంచనాలతో, గిరిజన సంప్రదాయాలతో గద్దె మీదకు తీసుకువచ్చారు. కాకతీయ రాజులతో పోరాడి వీరమరణం పొందినప్పటికీ తన వాళ్లను ఆశీర్వదించేందుకు రెండేళ్లకోమారు జనబాహుళ్యంలోకి వచ్చే సమ్మక్క తన బిడ్డలను చల్లగా దీవించి శుభ ఘడియ ఇదే.. సమ్మక్క ఆగమనం సందర్భంగా తల్లి గౌరవార్థం జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ గాలిలో మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. ఆదివాసీలు ప్రత్యేక పూజలు, ఆటల పాటలతో స్వాగతం పలికారు అమ్మవారికి మంత్రులు, ఉన్నతాధికారులు కూడా స్వాగతం పలికారు. ఆదివాసీ పూజారులు కొమ్ము బూరలు ఊదుతూ, డోలు వాయిద్యాలతో గద్దెపై ప్రతిష్టించారు. సమక్క తల్లి గద్దెపైకి చేరడంతో భక్తుల సంఖ్య ఒక్కసారిగా భారీగా పెరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే మేడారం మహాజాతరకు ఇప్పటికే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వన దేవతల దర్శనానికి వచ్చిన భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్నారు. ఇప్పటికే గద్దెల దగ్గర భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. మేడారం పరిసర ప్రాంతాలు గూడారాలతో నిండుకున్నాయి. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున రావడంతో కిలోమీటర్ల కొద్ది వాహనాలు బారులు తీరాయి.

**పున్నమి నాడు నిండు జాబిలిగా సమ్మక్క తల్లి దర్శనం:** అడవి బిడ్డల అపురూపమైన జాతర .. కొండా కోనా పరవశించే జాతర ... మేడారం మహా జాతర. సారలమ్మ గద్దెలపై కొలువుతీరటంతో ఊపందుకున్న జాతరలో చిలకలగుట్ట నుండి డోలు, కొమ్ము వాయిద్యాల చప్పుళ్ళతో , అధికార యంత్రాంగ హడావిడితో , గాలిలోకి కాల్పులు జరిపి ఆ తల్లికి స్వాగతం పలుకగా సమ్మక్క కుంకుమ భరిణె రూపంలో గద్దెలపై కొలువు తీరింది.

**పతాక స్థాయికి చేరుకున్న మేడారం మహా జాతర:** సమ్మక్క తల్లి ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరుకుంది. ఆ తల్లి ఆగమనం చూసేందుకు మేడారంలో భక్తజనకోటి ఆత్రుతగా ఎదురు చూశారు. సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గిరిజన పూజారులు ఆదివాసీ ఆచార సంప్రదాయాల ప్రకారం గద్దెపైకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. సమ్మక్క కోరి కొలిచిన వారి కొంగు బంగారం ఆ తల్లి అధికార లాంచనాలతో, గిరిజన సంప్రదాయాలతో గద్దె మీదకు సమ్మక్క

**వన దేవతలు నామస్మరణతో ప్రతిధ్వనిస్తున్న వనాలు:** శతాబ్దాలుగా తనను నమ్మిన భక్తులకు వరాలిచ్చే తల్లిగా భాసిల్లుతున్న సమ్మక్క ఆశీర్వాదం కోసం భక్తులు బారులు తీరారు. తల్లీ బిడ్డలు ఒకచోట చేరి కనికరించే శుభ ఘడియ కోసం నిరీక్షి ంచిన వారికి సమ్మక్క గద్దెపైకి వచ్చిన ఆ మధుర క్షణాలను మనసులో పదిలపరుచుకున్నారు. వనదేవతల నామస్మరణతో కొండలు, గుట్టలు, వాగులు వంకలు ప్రతిధ్వనించాయి. సమ్మక్క పూజారులు చందా బాబురావు, సిద్ధబోయిన మునిందర్, మహేశ్, లక్ష్మణ్‌రావు, కొక్కెర కృష్ణయ్య ఆధ్వర్యంలో వడ్డెలు నేడు ఉదయం వేకువజామునే మేడారంలోని సమ్మక్క ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. అందరూ కలిసి సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి కంకవనాన్ని డప్పు చప్పుళ్లతో తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. గద్దెను శుభ్రం చేసి ముగ్గులు వేస్తారు. ఆ తర్వాత వారు చిలకలగుట్టకు వెళ్తారు.

**గాల్లోకి కాల్పులు జరిపి తల్లికి అధికారుల స్వాగతం:** సమ్మక్క రాక సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సైతం అంతా చిలకలగుట్ట వద్దనే వేచి ఉన్నారు. చిలకలగుట్ట నుంచి సమ్మక్క పూజారులు కుంకుమ భరిణెను తీసుకొని కిందకు వస్తున్న సమయంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ తుపాకీ శబ్దాలే సమ్మక్క ఆగమనానికి సంకేతం. ఇక ఆ క్షణం నుంచి ప్రతి ఘడియా అద్భుతంగా తోచింది. దారికి ఇరువైపులా రంగు రంగుల ముగ్గులు వేసి తల్లికి స్వాగతం పలికారు. నిండు పున్నమి వేళ జాబిలమ్మగా సమ్మక్క దర్శనం ఇస్తుంది. ఆ మరుక్షణం నుంచి మొక్కుల చెల్లింపులు ప్రారంభమవుతాయి. తల్లి మనసారా ఇచ్చే ఆశీర్వాదాల కోసం భక్త జనం పోటెత్తుతుంది. వన దేవతలకి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జువల్ ఓరం, టీపిసిసి మహేష్ కుమార్ గౌడ్, సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులుజాటోత్ హుస్సేన్ నాయక్, మంత్రి సీతక్క , మంత్రి కొండా సురేఖ, నిరుపమ సుకర్ష, డిజిపి విక్రమ్ సింగ్ మన్, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఇతర శాఖల ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఎదురుకోళ్లు , శివసత్తుల చిందులు, పూనకాలతో మేడారంలో ఆ తల్లిని ఆహ్వానిస్తూ ఆవాహనం చేసుకున్న మనోహరదృశ్యాలు ఎప్పటికీ మదిలో పదిలమే.

# వడివడిగా రోడ్ల విస్తరణ

>> ఉన్నాయని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాజధాని అమరావతిని అనుసంధానించే బెంగుళూరుకడప విజయవాడ ఎకనామిక్ కారిడార్ పనులు 2027 కల్లా పూర్తి కావాలని సూచించారు. ఖరగ్‌పూర్ అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్‌వే కూడా త్వరలోనే డీపీఆర్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి అయితే ప్రజలకు తక్షణం ప్రయోజనం కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన వివిధ రోడ్డు ప్రాజెక్టులకు కూడా అనుమతులు తీసుకుని వేగంగా పనులు చేపట్టాలని సూచించారు. కేంద్రానికి ఇవ్వాల్సిన ప్రతిపాదనల్ని కూడా తక్షణమే సమర్పించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని నాగ్ పూర్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం, రాయపూర్ అమరావతి, మూలపేట పోర్టు జగదల్ పూర్, రాయపూర్‌లను కూడా అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని సీఎం నిర్దేశించారు. **రాష్ట్రంలో రహదారి నెట్వర్క్ విస్తరణ:** ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రహదారి నెట్వర్క్ ను మరింత విస్తరించేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి రహదారులు భవనాల శాఖను ఆదేశించారు. రూ.2500 కోట్లతో 6,054 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టామని అధికారులు తెలిపారు. ఆధునిక టెక్నాలజీ ద్వారా రహదారుల నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు. డేనిష్ ఫైబర్, వేస్ట్ ప్లాస్టిక్ బిటుమిన్, తిరుపతి ఐఐటీ రూపొందించిన నానో కాంక్రీట్ టెక్నాలజీ ద్వారా ప్రయోగాత్మకంగా రోడ్లను వేస్తున్నామని తెలిపారు. 45 వేల కిలోమీటర్ల రాష్ట్ర, జిల్లా రహదారుల్లో ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. రహదారుల నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవాలని సూచించారు. రామ్స్ టెక్నాలజీ ద్వారా రోడ్ల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పీపీపీ కింద 709 కిలోమీటర్ల మేర 12 రహదారులను కూడా చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పటిష్టంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ (విబీతి)కు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 1నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్

>> రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మగ్గం కల్గిన 93వేల కుటుంబాలు, మర మగ్గాలు వాడుతున్న 10,534కుటుంబాలు మొత్తం 1,03,534కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకంతో లబ్ది కలుగనుందన్నారు.

**నేతన్నలకు ఆర్థిక భరోసా:** చేనేత రంగాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని, ఆర్థిక భరోసా కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే 50ఏళ్ళు నిండిన నేతన్నలకు రూ.4వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. ఇలా రాష్ట్రంలో 87,280మందికి నేతన్నలకు పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. రూ.3వేల నుండి రూ.4వేలకు పెన్షన్లు పెంచడం వల్ల నేతన్నకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12వేలు ఆర్థిక లబ్ది కలుగుతోందన్నారు.

**నేతన్నలకు గౌరవప్రదమైన జీవనమే లక్ష్యం :** నేతన్నలకు 365రోజులు పాటు ఉపాధి కల్పనలో భాగంగా కీలక ఒప్పందాలు చేసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. కోఆప్టెక్స్, టాటా తనేరియా, బిర్లా ఆధ్యం సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఆప్కోలో రెడీమేడ్ దుస్తుల అమ్మకాలతో నేతన్నలకు ఉపాధి పెరిగిందన్నారు. జాతీయ స్థాయిలో ప్రకటించిన ఓడి ఓపి అవార్డుల్లో రాష్ట్రానికి 9అవార్డు లోస్తే, వాటిలో 4చేనేత ఉత్పత్తులకే వచ్చాయన్నారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు గాను జాతీయ స్థాయిలో ఒక బంగారు పతకం లభించిందన్నారు. నేతన్నలకు గౌరవప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్సీసి సోడియా పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే స్టిక్కర్‌తో రౌడీషీటర్ హల్ చల్

>>నుండి గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గుంతకల్ నియోజకవర్గం గుత్తి పట్టణానికి చెందిన అజయ్ కొంతకాలంగా గంజాయి విక్రహిస్తూ యువతను మత్తుకు బానిసలుగా చేస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. అతని పై గుత్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీట్, పీడీ యాక్ట్ కూడా ఉన్నట్లు సమాచారం. గతంలో గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బొలెరో జీప్ కి పోలీస్ స్టికర్ వేసుకుని అర్ధరాత్రి లారీ డ్రైవర్స్ ను కొట్టి డబ్బులు వసూలు చేస్తూ పట్టుబడి జైలుకి కూడా వెళ్లాడని తెలియ వచ్చింది.

ఈ నేపథ్యంలో పోలీసులు వివిధ రూపాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకొని కారులో వెళ్తూ హంగామా సృష్టించిన సంఘటన వివాదం కావడంతో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఒక వీడియో రిలీజ్ చేస్తూ తన వివరణ తెలియజేశారు. గుత్తికి చెందిన అజయ్ కు తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. యాడికి లో గంజాయి సేవిస్తూ హంగామ సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అయితే తనకు సంబంధించిన స్టిక్కర్ ను కారుకు అతికించుకొని ఇలా ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం సహించబోనన్నారు. అక్టోబర్ 2025 నాటికి కాలం చెల్లిన స్టిక్కర్ ను కలర్ జిరాక్స్ చేయించుకుని కారుకు అతికించికున్నట్లు తెలిసిందన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే ఇలాంటి వ్యక్తులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వ్యక్తిపై విచారణ జరిపి అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కాగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై గత కొంతకాలంగా పలు వివాదాలు, ఆరోపణలు రావడంతో అధిష్టానం ఆయనపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా రైల్వే టెండర్ల విషయం లో సొంత పార్టీ ఎంపీ అయిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తో గొడవ, భూ వివాదాలు, పలు ఆరోపణల నేపథ్యంలో టిడిపి అధిష్టానం వాటిపై ఆరాతీస్తున్నట్లు సమాచారం.



గురువారం బారామతిలో అజిత్ పవార్ భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి నారా లోకేష్

# అజిత్ పవార్ అంత్యక్రియలకు లోకేష్

## హాజరైన మంత్రి అనగాని, ఎంపిలు కృష్ణదేవరాయలు, మాగుంట

**విజయవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భౌతికకాయాన్ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సందర్శించి నివాళులు అర్పించారు. బారామతిలో నిర్వహించిన అజిత్ పవార్ అంత్యక్రియల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. దివంగత అజిత్ పవార్ కు నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనేత లావు కృష్ణదేవరాయలు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉన్నారు. అజిత్ పవార్ అం త్య క్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. అంత్యక్రియలకు కేంద్రమంత్రులు అమిత్‌షా, నితిన్ గడ్కరీ హాజరయ్యారు. మహారాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు, ఇతర పార్టీలకు చెందిన కీలక నేతలు కూడా హాజరయ్యారు.

## ప్రభుత్వ లాంఛనాలతో అజిత్ అంత్యక్రియలు

**బారామతి, జనవరి 29:** విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయిన మహారాష్ట్ర డిప్యూటి సిఎం అజిత్ పవార్ అంత్యక్రియలు గురువారం ప్రభుత్వ లాంఛనాలతో ముగిసాయి. ఎన్సీపి సీనియర్ నాయకుడికి విద్యాప్రతిష్టాన్ మైదానంలో పెద్దకుమారుడు పార్థ్‌పవార్ అజిత్ చితికి నిప్పంటించి అంత్యక్రియలు ముగించారు. అంతకుముందు సాయుధ పోలీసులు మూడు పర్యాయాలు గాలిలోకి కాల్పులుజరిపి గౌరవ వందనం చేసారు. మధ్యాహ్నం 12 గంటలకు వేలాదిమంది కార్యకర్తలు, సీనియర్ నాయకులు పలు పార్టీల నాయకులు మంత్రులు హాజరు అయ్యారు. అజిత్‌దాదా అమర్‌రహే అంటూ మైదానంలో అభిమానుల నినాదాలు మిన్నంటాయి. ఎకచ్‌వాదాఅజిత్ దాదా అంటూ డిప్యూటి సీఎంకు తుది వీడ్కోలు పలికారు. అంతకుముందు ఉదయం నుంచి కాటేవాడిలోని అజిత్‌నివాసంలో సందర్శకుల కోసం ఆయన భౌతికకాయాన్ని ఉంచారు. రాష్ట్రం నలుమూలలనుంచి ఇతర రాష్ట్రాలనుంచి పలువురు నాయకులు అభిమానులు తమ నాయకుడిని కడసారి చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. మాజీ సీఎం ఉద్ధవ్‌థాకరే, ఎంఎన్ఎస్ చీఫ్ రాజథాకరేలు కుటుంబ సభ్యులను పరామర్శించి భార్య సునేత్రపవార్‌ను ఓదార్చారు. ఎన్సీపీ వృద్ధనేత శరద్‌పవార్‌తోపాటు కేంద్రహోంమంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిస్, డిప్యూటి సిఎం ఏక్‌నాథ్ షిండే, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ, గోవా సీఎం ప్రమోద్‌సావంత్ తదితరులు ఉన్నారు. పరిపాలనపై ఎంతో పట్టు ఉన్న నాయకుడుగాను, నిర్మొహమాటంగా మాట్లాడే నేతగాను ఆయనకు ఎంతో పేరుంది. విద్యాప్రతిష్టాన్‌లో ఉవ్వెత్తున ఎగిసి పడిన అంత్యక్రియల జ్వాలల్లో అజిత్ ప్రస్థానం ముగిసిపోగా మరోవైపు పార్టీ భవిష్యత్తు ప్రణాళికపై చర్చలు ఊపందుకోవడం గమనార్హం.

# చెవిరెడ్డికి బెయిల్ మంజూరు

>> రెడ్డి, వెంకటేష్ నాయుడులకు ఎపి హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఇదే కేసులో ఏ1 రాజ్ కేసిరెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. చెవిరెడ్డి లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా విజయవాడ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయన తరచు అస్వస్థతకు గురవుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఛర్మ సంబంధమైన సమస్యలతో పాటు ఆయన అనేక అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఆయన ఈ పరిస్థితుల దృష్ట్యా తనకు బెయిల్ ఇవ్వాలని విజయవాడ ఏసీబీ కోర్టులో పలు పర్యాయాలు బెయిల్ పిటిషన్ దాఖలు చేసారు. అయితే కోర్టు బెయిల్ పిటిషన్లను తిరస్కరించింది. న్యాయస్థానం ఆదేశాలను అనుసరించి ఆయనకు పోలీసులు మంగళగిరి ఎయిమ్స్ చికిత్స ఇప్పిస్తున్నారు. తాజాగా ఏపీ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఇక చెవిరెడ్డితో పాటు సజ్జల శ్రీధర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడులకు కూడా బెయిల్ ఇచ్చింది. పాస్ పోర్టులను కోర్టుకు అప్పగించాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని, విచారణకు సహకరించాలని వీరికి హైకోర్టు షరతులు విధించింది.

# కేన్సర్ నియంత్రణకు పటిష్ట కార్యాచరణ

>> ద్వారా ముందస్తు స్క్రీనింగ్ టెస్టులతో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను తగ్గించేలా అట్లాస్ ద్వారా కార్యాచరణ చేపట్టనున్నారు. హెల్త్ ఎడ్యుకేషన్, క్యాన్సర్ పట్ల ప్రజల్లో అవగాహన, ప్రివెన్షన్, స్క్రీనింగ్, ఎర్లీ డిటెక్షన్ వంటివి క్యాన్సర్ కేర్ స్ట్రాటజీలో వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ పురుషులు, మహిళల నుంచి నమోదు చేసిన సమాచారం ఆధారంగా చికిత్సలు, సర్జికల్, రేడియేషన్, మెడికల్ ట్రీట్మెంట్ వారీగా అట్లాస్ లో వివరాలు పొందుపరిచారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఏ ప్రాంతంలో ఎంతమంది, ఏ రకమైన క్యాన్సర్ రోగులు ఉన్నారో గుర్తించేందుకు, స్థానికంగా చికిత్సలు అందించేందుకు వీలుగా సమాచారం తెలిసేలా ఈ అట్లాస్ కు రూపకల్పన చేశారు. ప్రస్తుతం ఏపీలో 32,657 మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారని... ఐసీఎంఆర్, ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 2030 నాటికి 20 శాతం కేసులు పెరుగుదల ఉంటుందని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు వివరించారు. దేశంలోనే తొలి సారిగా ఏపీలో క్యాన్సర్ అట్లాస్ రూపకల్పన జరిగిందని స్పష్టం చేశారు. రోగులను మ్యాపింగ్ చేసి 23 బోధనాసుపత్రులు, జిల్లా ఆస్పత్రుల ద్వారా రోగులకు డే కేర్ కీమోథెరపీ, పాలియేటివ్ కేర్ చికిత్స అందించే అవకాశం ఉందని అన్నారు. మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్ పీవీ వ్యాక్సినేషన్ అందించేందుకు వివిధ సంస్థలు, ఎన్ఆర్ఐల నుంచి కూడా సహకారం తీసుకోవాలని ముఖ్య మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహన పెరిగిందని ముందస్తు పరీక్షలు చేయించుకు నేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారని అన్నారు.

## వారం - వర్జ్యం

30-01-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శ్రావణ కార్తె
ద్వాదశి ఉ.11.10
ఆరుద్ర రా.3.27
వర్జ్యం : మ.2.31-4.00
దు.ఉ.8.57-9.43, 2) మ.12.45-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కోర్టు కేసులు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు దరికి చేరుతాయి.

**వృషభం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ధనలాభం.

**మిథునం:** నూతన ఒప్పందాలు చేసుకుంటారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తుకొనుగోలు.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకుంటారు. చర్చా గోష్టులలో పాల్గొంటారు.

**సింహం:** బ్యూటీ పార్లర్‌లు నడిపే వారికి అనుకూలంగా ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి.

**కన్య :** పనులలో ఆటంకాలు ఎదురైనా, అభివృద్ధి కూడా అంతర్లీనంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**తుల :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యవసాయాలలో స్వల్ప మార్పులు ఉంటాయి.

**వృశ్చికం:** పారిశ్రామిక, రాజకీయ రంగాల లోని వారికి కొంత వరకు అనుకూల కాలం. కాంట్రాక్టులు దక్కుతాయి.

**ధనుస్సు:** ముద్రణ, ప్రచురణ రంగాల్లోని వారికి అనుకూలంగా వుంటుంది. చేతి వృత్తి పని వారికి అనుకూలం.

**మకరం:** అధికారులతో, సహోద్యోగులతో స్నేహభావంతో మెలుగుతారు. ఓర్పును కలిగి వుంటారు.

**కుంభం:** గతంలో మీరు చేసిన కృషి ఇప్పుడు అక్కరకు వస్తుంది. విలాసవంతమైన వస్తువులు కొనుగోలు.

**మీనం:** గ్రూపు రాజకీయాలను తగినంత దూరంగా ఉండటం శ్రేయస్కరం. శుభవార్తలు వింటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎపిపై రుణభారం రూ.4.33 లక్షల కోట్లు

## ఈ మొత్తం 2064 వరకు కట్టాల్సిందేనని ఆర్‌బీఐ నివేదిక



**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** రిజర్వ్ బ్యాంక్ వివిధ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై తాజాగా వెలువరించిన నివేదిక ఈ అంశాన్ని విశ్లేషించింది. దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాలు రిజర్వ్ బ్యాంక్ నుంచి ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో సెక్యూరిటీల వేలంలో తీసుకున్న రుణాలు తీరాలంటే 2064వ సంవత్సరం రావాల్సిందే అంటున్నారు సంబంధిత నిపుణులు. అంటే, ఈ అప్పు తీరేందుకు మరో 38 ఏళ్లు పడుతుందన్నమాట. కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతి రాష్ట్రానికి రుణాలు తీసుకునేందుకు అనుమతులిస్తుంది. ఆ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువను లెక్కించి, అందులో 3శాతం వరకు రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు తీసుకునేందుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి ఇస్తూ ఉంటుంది. ఈ అనుమతులు రెండు విడతలుగా అంటే ముందు అర్ధ సంవత్సరానికి, తర్వాత రెండు త్రైమాసికాలకు వేర్వేరుగా లభిస్తాయి. ఇందుకు అనుగుణంగా ఆర్‌బీఐ సెక్యూరిటీల వేలం వేసి, ఆయా ప్రభుత్వాలకు రుణాలు సమకూరుస్తుంది. రాష్ట్ర విభజనకు ముందు నుంచీ వివిధ ప్రభుత్వాలు సెక్యూరిటీల వేలం రూపంలో చేసిన అప్పులు, విభజన సమయంలో ఏపీకీ వాటాగా సంక్రమించాయి. ఆ తర్వాతి ప్రభుత్వాలు కూడా ఏటా రుణాలు తీసుకుంటూనే, మరోవైపు పాత అప్పులకు అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తున్నాయి. ఒక్క సెక్యూరిటీల రూపంలోనే ఏపీపై 2025 మార్చి 31 వరకు ఉన్న భారం రూ.4,33,443 కోట్లుగా ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ఈ అప్పు తీరాలంటే 2064 వరకు ఏటా కొంతమొత్తం చొప్పున చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొంది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి రుణాలు తీర్చాలంటే రూ.93,982 కోట్లు అవసరం. ఈ ఒక్క అప్పు తీర్చాలంటేనే రాష్ట్ర బడ్జెట్‌పై ఏటా సుమారు రూ.20 వేల కోట్ల భారం పడుతుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందుకు రూ.20,050 కోట్లు కేటాయించారు. వచ్చే ఏడాది రూ.18,109 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. 2028-29, 2029- 30 ఆర్థిక సంవత్సరాల్లోనూ ఏటా రూ.20 వేల కోట్లకు మించి కేటాయించాల్సి ఉంటుంది. మొత్తం అప్పులో ఏడాది లోపు తీర్చగలిగేది 4.6 , ఐదేళ్ల లోపు కట్టగలిగేది 17.1 , 510 ఏళ్ల గడువులో చెల్లించేది 27 . 1020 ఏళ్ల వ్యవధిలో తీర్చాల్సిన అప్పు 47.8 శాతంగా ఉన్నట్లు ఆర్‌బీఐ విశ్లేషించింది.

ఇది కేవలం సెక్యూరిటీల వేలం ద్వారా సేకరించిన అప్పులకు సంబంధించింది మాత్రమే. ప్రావిడెంట్ ఫండ్, నాబార్డ్, ఇతర బాండ్లు, విద్యుత్ సంస్థల బకాయిలు, కార్పొరేషన్ల రుణాలు వంటివి కూడా భారంగా పరిణమిస్తున్నాయి. బడ్జెట్‌లో సింహభాగం సెక్యూరిటీ వేలం ద్వారా తీసుకున్న అప్పులు, వాటికి వడ్డీలు, ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకే సరిపోతుంది. వీటికితోడు గత ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతభత్యాలు, ఆర్థిక ప్రయోజనాలు సహా గుత్తేదార్ల బిల్లులు భారీగా బకాయిలు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత లెక్కల ప్రకారం 2040 నుంచి 2064 మధ్య దాదాపు రూ.లక్ష కోట్ల సెక్యూరిటీ రుణాల భారం మోయాల్సి ఉంటుంది. ఆ 24 ఏళ్లలో రూ.99,293 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ప్రస్తుతం ఈ భారం.. మొత్తం అప్పులో 4.5 గా ఉంది. 2030 వరకూ దాదాపు ఇదే లెక్కన అప్పులు కడుతూ పోవాల్సిందే. ఆ తర్వాత అది ఏటా 5.5 శాతానికి పెరిగే అవకాశం ఉంది.

# ఫిబ్రవరి1న విజయవాడలో రాష్ట్ర రెవెన్యూ జెఎసి సమావేశం

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్త :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న వీఆర్‌ఏ, వీఆర్వో, సర్వేర్లు, రెవిన్యూశాఖ ఉద్యోగులందరూ ఫిబ్రవరి1వ తేదీన విజయవాడ గాంధీనగర్ ఫిల్మ్ చాంబర్లో ఉదయం 10గంటలకు జరిగే సమావేశంలో పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం. రాష్ట్ర అధ్యక్షులు. భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రస్తుతం రెవిన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమే అజెండాగా రాష్ట్ర రెవిన్యూజేఏసీ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ రాష్ట్ర జేఏసీ లో ప్రతి రెవిన్యూ ఉద్యోగి సభ్యులుగా వుంటారని, జేఏసీలో నాయకులుగా పనిచేయడానికి, వీఆర్‌ఏల. విఆర్వోలు నుండి, అటెండర్లు నుండి, జూనియర్ అసిస్టెం ట్లు, సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తాహసిల్దార్లు, తాహసిల్దార్లు భాగస్వాములు కావాలన్నారు.

# మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళుతున్నామా?

## యూజిసి 'సమానత్వ' నిబంధనపై సుప్రీంకోర్టు స్టే

**న్యూఢిల్లీ, జనవరి 29:** కుల వివక్షను రూపుమాపి, ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై గురువారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయని, వీటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కేంద్రం, యుజిసికి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారి చేసింది. తదుపరి నోటీసులు ఇచ్చేంతవరకు నిబంధనలపై స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. స్వాతంత్ర్య వచ్చిన ఇచ్చి దశాబ్దాల తర్వాత కులవివక్ష లేని సమాజం కోసం మనం ఏం సాధించాం? ఈ విషయంలో మనం మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళుతున్నామా? అనే భావన కలుగుతోంది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు ఇలా దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తమ సంప్రదాయాలకు అనుగుణంగానే వ్యవహరిస్తారు. అలాంటి వారిని ర్యాగింగ్ పేరుతో కొందరు అవహేళన చేస్తుండడం అత్యంత బాధాకరం. వాటిని అరికట్టేందుకు ప్రత్యేక హాస్టళ్లు ఉండాలని మాట్లాడుతున్నారు. కానీ, ప్రస్తుతం సమాజంలో కులాంతర వివాహాలే జరుగుతున్నాయి. హాస్టళ్లలోను అందరూ కలిసే ఉంటున్నారు. అలాగే, ఐక్యభారత విధానం మన విద్యాసంస్థల్లో స్పష్టంగా ప్రతిబింబించాలి. విద్యాసంస్థల్లో స్వేచ్ఛాయుత, సమానత్వ, సమ్మిళిత వాతావరణాన్ని మేం కోరుకుంటున్నాం అని విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రతి ఉన్న విద్యాసంస్థల్లోనూ సమానత్వ కమిటీల ఏర్పాటును యుజిసి ఇటీవల తప్పనిసరి చేసింది. ఆయా కమిటీల్లో ఒబిసి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ప్రాతినిథ్యం కల్పించాలని స్పష్టం చేసింది. రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు యుజిసి నిబంధనలు - 2012 స్థానంలో కొత్త నిబంధనలను ఈ నెల 13 నుంచి అమలులోకి తెచ్చింది. అయితే, కొత్త నిబంధనలలోని కులవివక్ష నిర్వచనాన్ని ఒబిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

# 8 ప్రాంతాల్లో హౌస్‌బోట్లు

>> సరస్వతీ ఘాట్, పుష్కర ఘాట్, వైఎస్సార్ కడప జిల్లా గండికోట, అనకాపల్లి జిల్లా కొండకాకర్ల సరస్సు, విశాఖపట్నం జిల్లా గంభీరం, అల్లూరి జిల్లా తాజంగి జలాశయాలు వీటిలో ఉన్నాయి. బోట్ల నిర్వహణకు వివిధ ప్రైవేట్ సంస్థలు ఎనిమిది చోట్లా కలిపి రూ.10 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. విజయవాడలో కృష్ణా నది మధ్యలోని భవానీ ద్వీపంలో హౌస్ బోట్లను సీఎం చంద్రబాబు ఇటీవల ప్రారంభించారు. టికెట్ బుకింగ్ ఇంకా ప్రారంభించాల్సి ఉంది. ద్వీపంలో రెండు హౌస్ బోట్లు, మరో రొమాంటిక్ ఫ్లోట్, డైన్ బోటు సిద్ధం చేశారు. తాజంగి, కొండకాకర్ల సరస్సు, గంభీరం జలాశయంలో బోట్ల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలు కలెక్టర్ల ద్వారా పర్యావరణ, జలవనరుల పరిశీలనకు వెళ్లాయి. త్వరలో అనుమతులు రానున్నాయి. స్వర్ణాల చెరువు (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), గార్గేయపురం (కర్నూలు) ఎదుర్లంక (డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ)లోనూ బోట్ల నిర్వహణకు తాత్కాలిక అనుమతులివ్వనున్నారు. ఒక్కో బోటులో ఆరుగురికి సరిపడా సదుపాయాలు కల్పిస్తున్నారు. వీటిలో రాత్రులు బస చేయవచ్చు. నది ఒడ్డున జెట్టీ వద్ద వీటిని నిలిపి ఉంచుతారు. బోట్ల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జెట్టీల ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయిస్తున్నారు. విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. బోట్లలో ప్రయాణించే పర్యాటకుల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. బోట్లు నడిపే ప్రతిచోటా కంట్రోల్ రూం విధిగా ఉండాలని ప్రభుత్వం పర్యాటకశాఖను ఆదేశించింది. రెవెన్యూ, పోలీస్, జలవనరులశాఖ ఉద్యోగులు కంట్రోల్ రూంలో ఉంటారు. బోట్లలో భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారా, లేదా? బోట్లు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారో లేదో పరిశీలిస్తారు. నదులు, జలాశయాల్లో వరద ఉద్ధృతి ఉంటే బోట్ల నిర్వహణను నిలిపివేస్తారు.

# చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాల్సిందే

## - రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాల్సిందేనని ఏపీ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్‌ఫ్రీ ఏపీ కరిక్యులమ్ అమలుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.. సచివాలయంలో విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో డ్రగ్స్, గంజాయి నియంత్రణ, సోషల్ మీడియా నియంత్రణపై మంత్రివర్గ ఉపసంఘం సభ్యులతో విడివిడిగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల పట్ల 70శాతం మంది ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, మిగిలిన 30 శాతంపై కూడా దృష్టి పెట్టాలని అధికారులను లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్జీవోల ఆధ్వర్యంలో డీ అడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నిర్ణీత వయసుకు లోబడిన మైనర్లను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. చిన్నారులపై సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేషియా, ఫ్రాన్స్ లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ను పరిగణలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని అన్నారు. మలేషియాలో మై డిజిటల్ ఐడీ, పాస్ పోర్టు వివరాలతో ఈకేవైసీ అనుసంధానం ద్వారా 16 సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకొచ్చారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్న విషయమై మంత్రుల బృంద సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఎంత వయోపరిమితి విధించాలనే విషయమై వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలించాల్సిందిగా మంత్రుల బృందం అధికారులకు సూచించింది. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హెబిచ్యువల్ అఫెండర్స్ ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. దీనిపై చర్చించేందుకు సోషల్ మీడియా ప్లాట్ ఫాం కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే జీవోఎం సమావేశానికి రప్పించాలని సూచించారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి అడ్జుడికేటింగ్ ఆఫీసర్ నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్రప్రభుత్వ అధీనంలోని సహయోగ్ పోర్టల్ ద్వారా కొన్ని కేసుల విషయంలో చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈగల్ యాప్ ను లీప్ యాప్ కు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ (ఎలైట్ యాంటీనార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ ఫోర్స్ మెంట్) ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు మంత్రులకు వివరించారు. ఎన్ కార్డ్ ప్రణాళికతో పూర్తిగా అనుసంధానం చేసినట్లు తెలిపారు.



## ఫిబ్రవరి 17నుండి జూబ్లీహిల్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతిదేవస్థానంకు అనుబంధంగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 17నుండి 25వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఫిబ్రవరి 10న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8గంటలనుండి 9గంటలవరకు ,రాత్రి 7నుండి 8గంటల వరకు స్వామివారి వాహనసేవలు ఉంటాయి. శ్రీవేంకటేశ్వరునికి జరిపించే తొమ్మిదిరోజుల ఉత్సవాల్లో ఒక్కోరోజు ఒక్కోవాహనసేవకు ఎంతో విశిష్టత ఉంటుంది. ఈ వాహనాలపై పలు రకాల అలంకారాల్లో కొలువుదీరే స్వామివారు తనచెంతకు వచ్చిన భక్తులను కటాక్షించి వారి కష్టాలను తొలగిస్తాడనేది భక్తుల విశ్వాసం. **-'17నుండి బ్రహ్మోత్సవాలు':** తేదీఉదయం రాత్రిఫిబ్రవరి 17 మంగళవారం ధ్వజారోహణం ఎద్దశేషవాహనం18బుధవారం చిన్నశేషవాహనంహంస వాహనం 19 గురు వారం సింహవాహనం ముత్యపు పందిరి వాహనం20శుక్రవారం కల్పవృక్షవాహనం సర్వభూ పాలవాహనం 21 శనివారం మోహనీ అవతారం గరుడ వాహనం22 ఆదివారం హనుమంత వాహనం గజ వాహనం 23 సోమవారం సూర్యప్రభవాహనం చంద్రప్రభ వాహనం 24 మంగళవారం రథోత్సవం అశ్వవాహనం 25 బుధవారం చక్రస్నానం ధ్వజావరోహణం కాగా ఫిబ్రవరి 26వతేదీ సాయంత్రం 3గంటలకు పుష్పయాగ మహోత్సవం జరుగుతుంది.

# నేటినుంచి గుంటూరు, కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన..

## - పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం

**విజయవాడ, జనవరి 29, ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంటూరు, కుప్పంలో పర్యటించనున్నారు. శుక్రవారం గుంటూరులో పర్యటించిన అనంతరం మూడు రోజుల కుప్పం పర్యటనకు సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. గుంటూరు, కుప్పంలో చేపట్టే మూడు రోజుల పర్యటనలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. నార్త్ అమెరికాలో స్థిరపడిన గుంటూరు మెడికల్ కాలేజ్ పూర్వ విద్యార్థులు గుంటూరు మెడికల్ కాలేజీ అల్యూమిని ఆఫ్ నార్త్ అమెరికా - జింకానా పేరుతో ఏర్పాటు చేసుకున్న సంస్థ ద్వారా రూ. 100 కోట్ల విరాళాన్ని భవన నిర్మాణం కోసం అందచేశారు. 2018లో ఈ భవనానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇప్పుడు ఆయనే ఈ మాతా శిశు కేంద్ర భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ మాతా శిశు కేంద్రంలో అవసరమైన మెడికల్ ఎక్విప్మెంట్, ఫర్నిచర్ సహా ఇతర సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 27 కోట్లను కేటాయించింది. ఈ కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు నేరుగా తన సొంత నియోజకవర్గమైన కుప్పం వెళ్లనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం సాయంత్రం వరకు కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా సుమారు రూ. 690 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. శుక్రవారం మధ్యాహ్నం 02:35 గంటలకు కుప్పం చేరుకోనున్న ముఖ్యమంత్రి... తన తొలి రోజు పర్యటనలో భాగంగా రూ. 3 కోట్లతో నిర్మించిన అగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రారంభించనున్నారు. అనంతరం రూ. 10 కోట్లతో నిర్మించనున్న ఖిలెర్నర్స్ అకామిడేషన్‌ఖి ఫెసిలిటి సెంటర్... రూ. 2 కోట్లతో చేపట్టే ఒబెరాయ్ విజిటర్స్ సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కుప్పంలోని స్వర్ణ నవదిశ సెంటర్‌లో లైబ్రరీ, కోవర్కింగ్ స్పేస్, ఆదిత్య బిర్లా మల్టీస్కిల్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. ఏటా 350 మంది యువతకు ఉపాధి శిక్షణ ఇచ్చేలా ఈ సెంటర్ తీర్చిదిద్దారు. దీంతో పాటు... పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా కాంగుంది హెరిటేజ్ విలేజ్, బౌల్డరింగ్ పార్క్, పున్నమి రిసార్ట్‌లను ప్రారంభించనున్నారు. దీంట్లో భాగంగా కుప్పంలో రూ. 4 కోట్ల విలువైన సీఎస్ఆర్ నిధుల పర్యాటకాభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయ నున్నారు. ఇక రెండో రోజు పర్యటనలో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి సీఎం వరుస సమావేశాలు, కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా బెగ్గులపల్లె పంచాయితీలో వివిధ వర్గాలకు సామాజిక భద్రత పెన్షన్లను స్వయంగా సీఎం పంపిణీ చేయనున్నారు. ఆ తర్వాత 5,555 ఈసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

# మహా పాపం - నిజం పేరుతో తిరుపతిలో టిడిపి నేతల ర్యాలీ

**తిరుపతి,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకం , భారీ కుంభకోణంపై సిట్ నిర్ధారణతో మహా పాపం నిజం.. అది నెయ్యి కాదు! పామాయిల్ కెమికల్ కలిపిన ద్రవం" అనే నినాదంతో గురువారం తిరుపతిలో టిడిపి నేతలు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం తిరుపతిలోని పంచముఖ ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుండి గాంధీరోడ్డు మీదుగా నాలుగుకాళ్ళ మండపం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యుడు, టిడిపి తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సి.దివాకర్ రెడ్డి తిరుపతి పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ .."నెయ్యి సరఫరా చేసిన కంపెనీల ఎంపికలో నిబంధనలు ఉల్లంఘించారని, తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేసే క్రమంలో నాణ్యతను విస్మరించారని గుర్తించారన్నారు. కోట్లాది మంది భక్తుల ఆరాధ్యదైవం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జరిగిన అపచారంపై సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రసాదం తయారీలో వాడే వస్తువుల విషయంలో ఆగమ శాస్త్రం చెప్పిన నియమాలను పాటించకపోవడం వల్లే ఇలాంటి అపచారాలు జరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో (20192024) లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యి అసలు నెయ్యి కాదని, అది జంతువుల కొవ్వు ,రసాయనాలతో కలిపిన "సింథటిక్ ద్రవం" అని సిట్ దర్యాప్తులో నిర్ధారణ అయ్యిం దన్నారు. సుమారు 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యిని తిరుమల లడ్డూ తయారీకి ఉపయోగించినట్లు సిట్ తేల్చిందన్నారు. ఈ కల్తీ నెయ్యితో దాదాపు 20 కోట్ల లడ్డూ ప్రసాదాలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేసినట్లు గుర్తించారన్నారు. ఈ కల్తీ నెయ్యి సరఫరా ద్వారా వైకాపా పెద్దలు దాదాపు 251 కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. అంతకుముందు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వ హించిన తెదేపా నాయకులు, ర్యాలీగా బయలు దేరి నాలుగు కాళ్ళ మండపం వద్దకు చేరుకొని, మానవ హారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, జోన్ 4 మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ,రాష్ట్ర కార్యదర్శి దంపూరు భాస్కర్ యాదవ్, గంగమ్మ గుడి ఛైర్మన్ నైనారు మహేశ్‌యాదవ్, కార్పొరేటర్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మానవహారంగా నిరసన వ్యక్తం చేశారు.




## కత్తిపూడి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

### వ్యక్తి సజీవ దహనం

**శంఖవరం జనవరి 29 ప్రభాతవార్త** మండలంలోని కత్తిపూడి జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు సజీవ దహనం కాగా.. మరోకి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి కాకినాడ జిల్లా అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం నుంచి మూలపేటకు ఆక్వా మేతతో వెళుతున్న ఓ కంటైనర్ రావికంపాడు జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా కోల్కతా నుంచి చెన్నై కాటన్ వేస్ట్ బండిల్స్ లోడుతో వస్తున్న మరో కంటైనర్ ఢీకొంది. రెండు కంటైనర్లు కావడం కావడంతో ఢీకొన్న వెంటనే మంటలు చెలరేగి రెండు కంటైనర్ల ముందు భాగాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో కాటన్ లారీ డ్రైవర్ కమల్ షేక్(43) సజీవ దహనమయ్యాడు. మరోకి గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## సమాచార శాఖ ఉద్యోగులకు ఉత్తమ సేవకు ప్రతిభ పురస్కారం



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న సమాచార శాఖ ఉద్యోగిని గంగా భవాని

**ప్రశంసా పత్రాలు అందుకున్న డీఐపీఆర్వో కార్యాలయం అధికారులు, సిబ్బంది**

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి :** ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా నిలిచే సమాచార పౌర సంబంధాల శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అందించిన ఉత్తమ సేవలకుగాను జిల్లా కలెక్టర్ నుండి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. డీపీఆర్వో రమణమూర్తి గురువారం తెలిపిన సమాచారాన్ని అనుస77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలలో సమాచార పౌర సంబంధాధికారి కేవీ. రమణారావు, అదనపు పీఆర్వో కె. రవి, ఏవీ సూపర్వైజర్ వివి. ప్రసాద్, అసిస్టెంట్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ధనుంజయరాజు, టైపిస్ట్ కె. గంగా భవాని లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ ‌ ‌శ, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ ల నుండి ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఉత్తమ సేవ పురస్కారాలందుకున్న వారికి సమాచార శాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## తిరుపతి సంగీత కళాశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి

### - ప్రధాని మోడీ సమక్షంలో వందేమాతరంగీతంకు ఎంపిక

**తిరుపతి,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ జాతీయస్థాయి కార్యక్రమంలో తిరుపతి ఎస్వీసంగీతనృత్యకళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారు. గాత్రం విభాగంలో డాక్టర్ పి.శైలజ శిష్యురాళ్ళు మూడవసంవత్సరం బిపిఎ ,విశారధ విద్యార్థులు మ్యూజికాలజీ విభాగంకు చెందిన డాక్టర్ ఎం.సురేంద్ర రచించి స్వరపరిచిన జానపదగేయాన్ని సెట్విన్ తరపున పాడారు. జాతీయస్థాయిలో మన్ననలు అందుకుని రాష్ట్రస్థాయిలో బహుమతి పొందారు. ప్రధాని మోదీ వద్ద వందేమాతరం గేయం పాడటానికి ఈ బృందం నుండి కె.చంద్రలేఖ అర్హత సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దుబాల తెలిపారు.



# తిరుమల సమాచారం

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా శుభాలు

### - స్వామివారి సేవలో ఇండోనేషియా రాజు జోకోవిడోడో



**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** ఇండోనేషియా రాజు జోకోవిడోడో కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో ఆనందం కలిగిందని విశ్వాసం వ్యక్తం చేశారు. స్వామివారిసేవలో పాల్గోనడం జన్మధన్యమైందన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఇండోనేషియా రాజు జోకోవిడోడో ఆలయంలోనికి చేరుకున్నారు. సాంప్రదాయంగా దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులందరిపై ఉండాలి: ప్రముఖులు



**తిరుమల,జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. గురువారం ఉదయం గూగుల్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తోట,ప్రభుత్వ విఫ్ గణబాబు,ఢిల్లీ ఎన్‌ఫోర్స్ మెంట్ అదనపు డైరెక్టర్ బి.నవీన్‌కుమార్, సినీనటుడు క్రాంతి, బిగ్‌బాస్ కంటెస్టెంట్ అమర్‌దీప్, తేజ,మహేశ్‌విట్ట, హైదరాబాద్ అంబర్‌పేట శంకరన్న కుటుంబంతో కలసి ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీవారి ఆలయం చెంత కొత్త దంపతులు అపచార పనులు!

### - ఫోటోషూట్ పేరుతో నిబంధనలు ఉల్లంఘన

**తిరుమల, జనవరి 29ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఓ నూతన జంట అత్యుత్సాహంతో ఏకంగా దేవుని ఆలయం ముందు అపచారపనులు చేశారు. ఆలయం ముందు గురువారం ఉదయం ఆ జంట ఫోటోషూట్ పేరుతో ముద్దులు పెట్టుకుంటూ...ఒకరినొకరు మనుషులు తగులుతూ కొత్త జంట చేసిన నీచపుపనులను భక్తులు తప్పుపడతున్నారు. ఫోటోషూట్ పేరుతో చేసిన ఈ అపచారంపై టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. తిరుమల ఆలయ పవిత్రతను, పుణ్యక్షేత్రం విలువలను కాపాడేలా టిటిడి తిరుమలలో కఠిన నిబంధనలు అమలుచేస్తోంది. ఆలయం ముందు రాజకీయ వ్యాఖ్యలు చేయకుండా కఠినచర్యలు తీసుకుంది. అదేగాక తిరుమలలో గోవింద నామం తప్ప మరెలాంటి పదం వినిపించరాదని ప్రభుత్వం ఆదేశించింది. డ్రోన్‌లు ఎగురవేయడం, ఫోటోషూట్‌లు వంటివి సహజంగా చేసేస్తున్నారు. అలాంటిది గురువారం ఉదయం ఆలయం ముందు కొత్తజంట నుదుటిపై ముద్దులు పెట్టుకుంటూ గొల్లమండపం నుండి అఖిలాండం వరకు ఫోటోషూట్ చేయడం వివాదంగా మారింది. ఈ వీడియోపై నెటిజన్లు, భక్తులు మండిపడుతున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. తిరుమల ఆద్యాత్మిక ప్రాంతమని, పర్యాటకప్రాంతం కాదని, దేవదేవుని చెంత భక్తితో పవిత్రంగా ఉండాలని భక్తులు చెబుతున్నారు. ఆలయం నిబంధనలకు విరుద్ధంగా సాంప్రదాయాలను ఉల్లంఘించి చేసిన ఈ వికృత చేష్టలపై తిరుమల పోలీసులు సీరియస్ అయ్యారు.

## ఎపి సచివాలయం సిబ్బందిపై ఒడిశా పోలీస్ జులుం

### - రేషన్ కార్డుల సర్వే బృందాన్ని అడ్డుకున్న పోలీసులు

**సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా), జనవరి 29 ప్రభాతవార్త :** వివాదాస్పద కోటియా గ్రూప్ గ్రామమైన గంజాయి భద్ర ఆంధ్ర సచివాలయ సిబ్బందిపై గురువారం ఉదయం ఒడిశా పోలీసులు దౌర్జన్యం చేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కొటియా గ్రామాల్లో ఒకటైన ఎగువసెంబిలో విధులలో భాగంగా సచివాలయ సిబ్బంది అక్కడ ఉన్న గిరిజనుల రేషన్ కార్డులు సర్వే నిమిత్తం వెళ్లారు. దీంతో ఒడిశా పోలీసులు అక్కడికి చేరుకుని వారిపై దౌర్జన్యానికి తెగబడ్డారు. ఈ మేరకు అక్కడ ఉన్న గిరిజనులు ఒడిశా పోలీసులపై తిరగబడి నిలదీయగా వెనక్కి తగ్గి వెళ్లిపోయారని సమాచారం. అలాగే ఆంధ్ర అధికారులు, ఉద్యోగులుపై ఒడిశా అధికారులు, పోలీసులు చేస్తున్న దౌర్జన్యాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని ఈ సందర్భంగా అక్కడ గిరిజనులు కోరారు.



## భక్తుల నిరీక్షణ లేకుండా.. మూడోఅన్నప్రసాద భవనం ప్రతిపాదనలు కార్యరూపందాల్చేదెప్పుడో?

### - వెంగమాంబ భవనంలో నిరీక్షణ లేకుండా ప్రత్యామ్నాయం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** "అన్నం పరబ్రహ్మస్వరూపం"గా భావిస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా,శుచిగా తిరుమల తిరుపతి దేవస్థానంఅన్నప్రసాదాలు అందిస్తోంది. రోజువారీగా 1.60లక్షలమంది నుండి 2లక్షలమందివరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తుండటం విశేషం. భక్తుల రద్దీ తో ఇప్పుడు తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలోనేగాక పిఎసి 4,5లో అన్నప్రసాదాలు భక్తులకు వడ్డిస్తున్నారు. ఇప్పటికీ వెంగమాంబ భవనంలో మధ్యాహ్నం వేళ భక్తులు నిరీక్షణ సమయం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా మూడో అన్నప్రసాద భవనం కోసం టిటిడి అధికారులు వెదుకులాట ప్రారంభించారు. ఈ భవనాన్ని భక్తులకు సౌకర్యంగా, రద్దీవుండే ప్రాంతంలో ఏర్పాటుచేయాలని ఆలోచన చేస్తున్నారు. అన్నప్రసాదంలో అదనంగా మసాలవడ అందిస్తుండటం, అన్నప్రసాదాల నాణ్యత వందశాతం మెరుగుపడటంతో ధనవంతులైన భక్తుల నుండి సామాన్యభక్తుల వరకు అన్నప్రసాదాలను దేవుని ప్రసాదంగా భావించి స్వీకరిస్తున్నారు. ఏకధాటిగా ఇటీవల రథసప్తమి పర్వదినాన 9లక్షలమందికి భక్తులుపైగా 14రకాల అన్నప్రసాదాలు స్వీకరించడం రికార్డునమోదైంది. మరీ రోజురోజుకూ రద్దీ పెరుగుతున్న వేళ మరో అన్నప్రసాద భవనం ఏర్పాటుపై భక్తులకు సౌలభ్యంగా ప్రాంతాన్ని ఎంపికచేయాలని టిటిడి అధికారులు ఆలోచన చేస్తున్నారు. తిరుమలలో నిరంతరాయంగా ఉదయం 8.30గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నాణ్యమైన అన్నంతోబాటు సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి, తాళింపు(కర్రీ)ని,మసాలవడ రుచికరంగా వడ్డిస్తున్న విషయం తెలిసిందే. రోజువారీగా తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకుంటున్నా 80వేలమంది భక్తులు దర్శించుకుంటున్నారు.

## వైద్య,ఆరోగ్యశాఖకు ఎన్‌హెచ్‌ఎం ద్వారా రూ.12,843 కోట్ల భారీ నిధులు విడుదల

**విజయవాడ.జనవరి 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం ) ద్వారా రూ.12,843 కోట్ల భారీ నిధులను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను చివరి విడత బడ్జెట్ కింద ఈ నిధులను కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ వీరపాండియన్ గురువారం జిల్లా అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విడుదలైన నిధులను నిర్ణీత గడువులోగా అంటే వచ్చే నెల (ఫిబ్రవరి) 20వ తేదీ నాటికి ఖర్చు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఖర్చు చేసిన వివరాలను వెంటనే నివేదికల రూపంలో సమర్పించాలని కోరారు.

ఈ విడత నిధుల్లో కొన్ని జిల్లాలకు ప్రాధాన్యత క్రమంలో భారీగా కేటాయింపులు జరిగాయి. గుంటూరు జిల్లాకు రాష్ట్రంలోనే అత్యధికంగా రూ. 2,061 కోట్లు కేటాయించారు. నెల్లూరు జిల్లాకు రూ.8.60 కోట్లు విడుదలయ్యాయి. కృష్ణా జిల్లాకు రూ. 6.21 కోట్లు కేటాయించారు. మిగిలిన జిల్లాలకు వాటి అవసరాలను బట్టి గరిష్టంగా రూ. 5.20 కోట్ల నుండి కనిష్టంగా రూ. 2 కోట్ల వరకు నిధులను పంపినట్లు కమిషనర్ తెలిపారు. ఈ నిధులను ఎలా ఖర్చు చేయాలనే దానిపై కమిషనర్ వీరపాండియన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్‌హెచ్‌ఎం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి పైసా ఖర్చు చేయాలని సూచించారు. నిధుల వినియోగంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, పారదర్శకత పాటించాలని హెచ్చరించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (శిబీది) బలోపేతం, మందుల కొనుగోలు, కుటుంబ సంక్షేమ పథకాల అమలుకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఈ నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరం ముగింపులో ఉన్నందున, ఈ నిధులను సకాలంలో ఖర్చు చేయడం ద్వారా వచ్చే ఏడాదికి మరిన్ని నిధులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

## ఎపిపిఎస్సీ గ్రూప్2 ఎంపిక జాబితా విడుదల - రెండేళ్ల నిరీక్షణకు తెర

### 905 పోస్టుల్లో 891కి అభ్యర్థుల ఎంపిక - హైకోర్టు ఆదేశాలతో 2 పోస్టులు పెండింగ్‌లో - 12 పోస్టులకు రిజర్వేషన్ అభ్యర్థులు నిల్

**విజయవాడ.జనవరి29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ గ్రూప్2 అభ్యర్థుల రెండేళ్ల నిరీక్షణ ముగిసింది. అర్ధరాత్రి గ్రూప్2 తుది ఎంపిక జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ఆనందానికి అవధుల్లేవు. 2023వ సంవత్సరంలో 905 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. నాటి నుంచి ఎంపిక జాబితా విడుదలకు దాదాపు 25 నెలలకు పైగా సమయం పట్టింది. కోర్టు కేసులతో ఎంపిక ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. రిజర్వేషన్ రోస్టర్‌కు సంబంధించి కొంతకాలం, స్పోర్ట్స్ కోటాపై హైకోర్టులో కేసుల కారణంగా మరికొంత కాలం ఈ నోటిఫికేషన్ లో జాప్యం జరిగింది. క్రీడా కోటా సర్టిఫికెట్ల పరిశీలనకు శాప్ మరింత ఎక్కువ సమయం తీసుకుంది. పరీక్షలు పూర్తయినప్పటి నుంచి ఫలితాల కోసం అభ్యర్థులు ఏపీపీఎస్సీ కార్యాలయం చుట్టూ ఎంతగానో తిరగాల్సి వచ్చింది. 905 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాగా, దానిలో 891 పోస్టులకు మాత్రమే అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ ప్రకటించింది. గతంలో క్రీడా కోటాకు రెండు పోస్టులను రిజర్వు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినందున ఎక్సైజ్ ఎస్సై, లా ఏఎస్ఓ పోస్టులను ఏపీపీఎస్సీ పక్కన పెట్టింది. హైకోర్టు తీర్పును అనుసరించి ఏపీపీఎస్సీ ప్రకటించిన 891 పోస్టుల్లో హారిజంటల్ రిజర్వేషన్ కారణంగా 25 పోస్టుల్లో మార్పులు జరిగే అవకాశం ఉంది. మిగతా 866 పోస్టుల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు. ఏడు దివ్యాంగ, మరో 5 ఇతర రిజర్వేషన్లకు అభ్యర్థులు లేనందున 12 పోస్టులకు ఏపీపీఎస్సీ ఎంపిక జాబితాను ప్రకటించలేదు. 2023వ సంవత్సరం డిసెంబరు 7న నోటిఫికేషన్ వెలువడగా, 2024వ సంవత్సరం ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. 2025 ఫిబ్రవరి 23న మెయిన్స్ పరీక్షలు జరిగాయి. 2025వ సంవత్సరం ఏప్రిల్ 4న దీని ఫలితాలు వెల్లడించారు. ఇప్పుడు తుది ఎంపిక జాబితా విడులైంది. ఏపీపీఎస్సీ గ్రూపు 2 ఎంపిక జాబితాను అర్ధరాత్రి విడుదల చేసింది.

వార్త

మనుషులందరూ వృద్ధులుగా మారతారు.
కానీ మంచివారుగా మారటం అరుదు.

-స్వీడెన్ బర్గ్

# మృత్యుపాశాలుగా మూఢనమ్మకాలు

అన్ని తెలిసిన వారు అమావాస్యనాడు చనిపోతే ఏమీ తెలియనివారు ఏకాదశి రోజు చనిపోయినట్లుగా ఉంది. ఒకపక్క సాంకేతిక పరిజ్ఞానంతో ఎంతో అభివృద్ధి చెందుతున్నా మరొక పక్క సైన్స్ విజ్ఞానం రోజురోజుకు పురోగాభివృద్ధివైపు పరుగు లీడుతున్నా, మరొకపక్క మూఢనమ్మకాలు సమాజాన్ని అతలాకుతలం చేస్తుండడం అత్యంత దురదృష్టకరం. అందులోనూ ఏమీ తెలియని అమాయకులు మూఢనమ్మకాలలో మునిగిపోతున్నారంటే కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. కానీ అంతోఇంతో చదువుకున్నవారు లోకజ్ఞానం ఉన్నవారు పట్టణాలకు, నగరాలకు చేరువలో నివాసాలు ఉంటున్నవారు సైతం ఈ మూఢనమ్మకాలతో బజారు పాలవుతున్నారు. ఒకరుకాదు ఇద్దరు కాదు దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నాయి. ఎన్నోయేళ్లుగా కూడబెట్టుకున్న బంగారం, డబ్బులే కాదు, చివరకు ప్రాణాలుకూడా పోగొట్టుకుంటున్నారు. ఎంతోమంది తమ కుటుంబ సభ్యులను తమ కళ్లముందే భూత వైద్యుల, మంత్రాల పేరుతో పెట్టే చిత్రహింసలనుచూస్తూ మనస్సును చంపుకొని ఏదో ఆశతో ఎదురుచూసి చివరకు కళ్లముందే ప్రాణాలు వదిలిన తర్వాత కానీ వారికి అసలు విషయం బోధపడడం లేదు. కానీ అప్పటికే జరగాల్సింది జరిగిపోతున్నది. ఆ మధ్య నెల్లూరు జిల్లాలోఇరవైరెండేళ్ల యువకుడు మతిస్థిమితం కోల్పోవడంతో దెయ్యం పట్టిందని ప్రచారం చేశారు. దానికి సలహా ఎవరు ఇచ్చారో ఏమోకానీ స్వామిజీ వద్దకు తీసుకువెళ్లారు. దెయ్యం పట్టిన మాట వాస్తవమేనని దాన్ని పూర్తిగా వదిలిస్తామని నమ్మబలికి పసుపు, కుంకుమ వంటివి అన్నీ చల్లి చుట్టుపక్కల వారిని పిలిచి అందరు చూస్తుండగానే నోట్లో గుడ్డలు కుక్కి చిత్రహింసలు పెట్టారు. కొంతసేపటికి ఆ యువకుడిలో చలనం లేకుండాపోయింది. దీంతో దెయ్యం పోయిందంటూ ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు. ఆ తర్వాత కొందరు గ్రామపెద్దలు వచ్చి యువకుడు చనిపోయాడని చెప్తేకానీ వారికి అసలు విషయం తెలియదు. భూతవైద్యం పేరుతో నిండుప్రాణం గాలిలో కలిసిపోయింది. అలా ఎన్నో ప్రాణాలు ఈ మూఢనమ్మకాలకు బలైపోతున్నాయి. ఆ మధ్య రాయలసీమలో ఒక జిల్లాలో నరబలి ఇచ్చిన సంఘటన కూడా వెలుగులోకి వచ్చింది. తమ వ్యతిరేకులను మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెట్టేందుకు కొందరు చేతబడి,బాణామతి,చిల్లంగి అంటూ అనేక పేర్లతో క్షుద్రపూజలు చేస్తూ భయపెడుతున్నారు. గ్రామాల్లో విషజ్వరాలు వ్యాపించినప్పుడు ఇలాంటి క్షుద్ర పూజలు, జంతుబలులు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిసార్లు కొందరు చేతబడులు చేయడంవల్లనే తమ కుటుంబాలకు, గ్రామాలకు నష్టం జరుగుతున్నదని అపోహతో ఆరోపణలు చేసి దాడులకు పాల్పడి ప్రాణాలు తీసిన సంఘటనలు కూడా కోకొల్లలు. కొన్నిసార్లు క్షుద్ర పూజలు చేశారనే అనుమానంతో వారి కుటుంబాలను సజీవంగా దగ్ధం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొందరు బంగారం భూమిలో ఉందంటూ క్షుద్రపూజలు చేసి నరబలులు ఇస్తేనిధులు దక్కించుకోవచ్చునన్న భ్రమతోఅన్నెం పున్నెం ఎరుగని చిన్న పిల్లలను బలిచ్చిన సంఘటనలు హైదరాబాద్ నగరపరిసరాల్లో గతంలో జరిగాయి.ఉభయ రాష్ట్రాలతోపాటు, బీహార్,చత్తీస్‌ఘడ్, జార్ఖండ్,హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర తదితర పదిహేను రాష్ట్రాల్లో క్షుద్రపూజలు దశాబ్దాల తరబడి వేళ్లూనుకుపోయాయి. దేశవ్యాప్తంగా వీటి కారణంగా గతదశాబ్దకాలంలో రెండువేల మందికిపైగా హత్యలకు గురైనట్లు సమాచారం.అధిక శాతం మహిళలే బలైపోతున్నారని జాతీయ గణాంకాల శాఖ రికార్డులు వెల్లడిస్తున్నాయి. జార్ఖండ్‌లో చేతబడులు చేశారన్న అనుమానంతో 2013లోనే దాదాపుఅరవైమందికిపైగా చంపారు. ఇక మహారాష్ట్రలోని విదర్భప్రాంతంలో పదకొండు మంది చిన్నారులను బలిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని ఒక స్వామిజీ ఇచ్చిన సలహా మేరకు ఒక జంట అత్యంత కిరాతకంగా మారి అభంశుభం తెలియని ఐదుగురు పసికందులను పొట్టనపెట్టుకున్నారు. ఆతర్వాత పోలీసు దృష్టికి వెళ్లడంతో వారికి సంకెళ్లు వేయడంతో అవి ఆగిపోయాయి.దేశవ్యాప్తంగా వెలుగుచూడనిపోలీసుల దృష్టికి రాని కేసులెన్నోఉన్నాయి. జరగాల్సిన నష్టం జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు వేసే సవాలక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పలేక,కోర్టుల చుట్టూ తిరగలేక కొత్త ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో పోలీసుస్టేషన్ మెట్లెక్కడానికి భయపడుతున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా కొన్నిసందర్భాల్లో ప్రత్యర్థులను మట్టుపెట్టడానికి బాణామతి లాంటి క్షుద్రపూజలు చేశారనిముద్రవేసి చంపుతున్న సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. 2022లోనే దేశవ్యాప్తంగా ఎనభై ఐదుకుపైగా బాణామతి హత్యలు జరిగాయి. గత దశాబ్దకాలంలో పదకొండువందల ఎనభైనాలుగు మంది ప్రాణాలు కోల్పోయారు. ఇలా ప్రతి సంవత్సరం వెయ్యా రెండువేల మందో హతులవుతున్నట్లు సమాచారం. బాణామతి, చేతబడి వంటి మూఢనమ్మకాలతో జరిగే దాడులను నిలువరించాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి 2021లో తీర్మానాన్ని ఆమోదించింది. ఇకదాడుల గురించిప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మంత్రగాళ్లు, మంత్రగత్తెలంటూ విచక్షణారహితంగా కొట్టి హింసిస్తున్నసంఘటనలు కోకొల్లలు. బీహార్‌లో 1999లోనే బాణామతి కార్యకలాపాల నిరోధక చట్టం వచ్చినా ఆశించిన ఫలితాలు చేకూరడంలేదు.ప్రభుత్వమేకాదు సమాజం, మేధావులు అందరూ ఈ సమస్యపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నాలు జరగాలి.

నీవు జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యం నూతన మార్గాలు అన్వేషించాలి.



రాబర్ట్ ఆంథోని

బుద్ధిహీనులూ, మృతులూ మాత్రమే తమ అభిప్రాయాలను మార్చుకోకుండా ఉంటారు.



లోవెల్

# నేటి బాలలే రేపటి బానిసలా!

**ప్రభుత్వ పాఠశాలలో డ్రాప్‌అవుట్ పెరిగి ప్రభుత్వ పాఠశాలలు మూతపడటానికి, నిరక్షరాస్యత పెరగటానికి, విషతుల్యమైన మనసు కలిగిన కొద్దిమంది ఉపాధ్యాయులు పాఠశాలలో బోధనసరిగా చేయకపోవడం వల్ల, నాణ్యమైన విద్య అందక దేశానికి నైపుణ్యంగల మానవవనరులు అందటం లేదు. దీనంతటికీ ప్రధాన కారణం మానవత విలువలు, రాజ్యాంగ విలువలను అర్థం చేసుకోలేని కొందరు దుర్మార్గపు ఆలోచనపరులైన ఉపాధ్యాయుల వలననే గ్రహించి తులసివనంలో గంజాయి మొక్కలైనా ఈ కీచక ఉపాధ్యాయులను పీకి పారేస్తే పాఠశాల విద్యావ్యవస్థకు తద్వారా యావత్భారత దేశానికి మంచి రోజులువస్తాయి.**

డా.బోరుగడ్డ సుబ్బయ్య

భారతదేశ భవిష్యత్తు నేటిబాలలపై ఆధారపడి ఉన్నదని, నేటిబాలలే రేపటిపౌరులు అంటూ నినాదించి స్వాతంత్ర్యనాంతరం భారతదేశపునర్నిర్మాణానికి స్వాతంత్ర్య సమరయోధులు నాందిపలికారు. అదే క్రమంలో 1947 తరువాత దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలు, సమానగౌరవం, సమానవిలువ ఉండేవిధంగా భారతదేశ ప్రజలు భారత రాజ్యాంగాన్ని రచించుకుని దేశనిర్మాణానికి అంకురార్పణచేశారు. కొద్దిమేర అభివృద్ధి సాధించగలిగాము. కానీ, గత కొన్ని సంవత్సరాలుగా పరిస్థితులను పరిశీలిస్తే దేశనిర్మాణం కాస్త విభజన విధ్వంసం కూల్చివేతలవైపుకు మనుషుల మధ్య ద్వేషం పెరుగుతున్నట్లు ఉంది.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడజిల్లా పిఠాపురం మండలం జడ్పీ పాఠశాలలో 01డిసెంబర్ 2025న ముగ్గురు ఉపాధ్యాయులు అదే పాఠశాలలో చదువుతున్న బాలలను వారి కులాలపేరుతో నీచంగా అవమానకరంగా వేధించటం, ఎస్సీలు, ఎస్టీలు ఏమీ చేయలేరు అంటూ నిరంతరం అవహేళన చేస్తూ విద్యపై ఆసక్తి తగ్గేవిధంగా నిరుత్సాహపరుస్తూ ఆడపిల్లలను చెడ్డపేరుతో వంకరగా పిలుస్తున్నారని ఆ పసిహృదయాలు తల్లడిల్లిపోయి మీడియా ముందుకు వచ్చి చెప్పేవరకు ఆ విషయాలు బయటకురాలేదు అంటే అమాయక పసిపిల్లలను కీచక ఉపాధ్యాయులు ఎప్పటి నుండో మానసికంగా, శారీరకంగా ఏడిపిస్తున్నారని అర్థమవుతుంది. దీనిపై జిల్లా కలెక్టర్ మండల విద్యాధికారిచే విచారించి నిజనిర్ధారణ అయిన తర్వాత కులవివక్ష చూపిన ఉపాధ్యాయులను సాధారణ బదిలీ చేసి వదిలివేశారు. మరల ఆ పసిహృదయాలు అడుగుతున్నాయి. ఈ విలువలులేని (కీచక) ఉపాధ్యాయులు ఎక్కడకువెళ్లారో అక్కడ కూడా ఎస్సి విద్యార్థులను అవహేళన చేస్తూ అవమానిస్తూ కులవివక్షను చూపుతారుకదా అప్పుడు బదిలీ అనేది ఏరకంగా శిక్షఅవుతుంది అని ప్రశ్నిస్తున్నారు. కుల వివక్షకు అంతంలేదు అన్నట్లుగా ఆప్రశ్నలకు కూడా సమాధానం లేదు.అదే నియోజకవర్గంలో ఏప్రిల్ 2025న మల్లాం గ్రామంలో కులంపేరుతో కొన్ని కుటుంబాలను గ్రామ బహిష్కరించినప్పుడు నిందితులను శిక్షించినట్లయితే ఇది జరిగి ఉండకపోయేది అంటే తప్పు చేసిన వాడిని చట్టప్రకారం శిక్షించకపోతే నిందితులను మరల తప్పుచేయమని ప్రభుత్వాలే ప్రోత్సహిస్తున్నాయని అర్థం చేసుకోవాల్సివస్తుంది. ఈవిషయాలు ప్రజలు అర్థం చేసుకున్న రోజు ప్రజలే తిరుగుబాటు చేసి శిక్షిస్తారు.ఆంధ్రప్రదేశ్లోని శ్రీకాకుళం జిల్లాలో పొందూరులోని ఒక విద్యాలయంలో మహిళాప్రిన్సిపల్ ఒకషెడ్యూల్డ్ తెగకు చెందిన విద్యార్థినిని, వాళ్ళఅమ్మను కులంపేరుతో పదేపదే తిట్టుతూ అవమానపరుస్తూ,కించపరుస్తూ, ఉంటే ఫిర్యాదు చేయటానికి వీలులేదు అని సమగ్రశిక్ష ఏపీసి సైతం బెదిరించటం దేనికి సంకేతం. అదేవిధంగా శ్రీకాకుళం జిల్లాలోని మెలియపుట్టి మండలం బందపల్లి బాలికలట్రైబల్ ఆశ్రమం పాఠశాలలోని ఉపాధ్యాయునిగా ఉన్న ఉపాధ్యాయునిరాలు కుర్చీలో కాళ్లుచాపుకొని మొబైల్ మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థులచే బలవంతంగా కాళ్లకు మసాజ్ చేయించుకుంటుంది. ఆ ఉపాధ్యాయురాలు ఆ విద్యార్థినీలను ఎలాచూస్తుంది అని ఆలోచిస్తే తన ఇంట్లోపని చేసే పనివారివలె లేదా బానిసలవలె వీరిని ఆమెభావించి వీరిచేత ఆవిధంగాచేస్తుంది.తర్వాత ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీతంపేటవారు విచారణ జరిపి సస్పెండ్ చేశారు. ఇదే విధంగా మనరాష్ట్రంలో గుంటూరు జిల్లాకు చెందిన ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న బాలికలచే ప్రిన్సిపల్ క్వాటర్స్‌లో ఉండేఉపాధ్యాయులకు నీళ్ల బకెట్లను బలవంతంగా మోయించటం ఈమధ్యకాలంలో పేపర్లో చూసాం. అమలాపురం దగ్గర ఐ.పోలవరం మండలంలోని ఆరో తరగతి చదివే బాలికకు చాక్లెట్లుఇస్తూ మాయమాటలు చెప్పి ఉపాధ్యాయుడు అత్యాచారానికి పాల్పడ్డఉదాంతం,



అదే విధంగా కాకినాడ జిల్లా తుని గురుకుల పాఠశాలలోని విద్యార్థిని తాతనులంటూ తీసుకువెళ్లి బాలికపై అత్యాచారం చేయటం,తిరుపతి సంస్కృతి విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడు విద్యార్థినిపై అత్యాచారం చేయటం, సత్యసాయి జిల్లాలో 15 సంవత్సరాల ఎస్సీ బాలికను రెండు సంవత్సరాలుగా 17 మంది అత్యాచారం చేసిన సంఘటన, మొబైల్ దొంగతనం చేసిందని ఆరోపణలు 17సంవత్సరాల ఆదివాసీ బాలికను బట్టలిప్పి దారుణంగా దాడిచేసి వేడికర్రతో కాల్చిన సంఘటనలు ఇవన్నీ కూడా ఆంధ్రప్రదేశ్లోనేజరిగాయి.ఉత్తర ప్రదేశ్, హర్యానా,మధ్యప్రదేశ్ పాఠశాలల్లోని బాలబాలికలపై జరిగిన దాడులు ఎన్నో చూస్తూనే ఉన్నాం. హర్యానాలో మంచినీళ్ల కుండలో నీళ్లతాగాడని ఒకఎస్సీ బాలుడును ఉపాధ్యాయుడు కొట్టిచంపాడు. మధ్యప్రదేశ్లో బాగా చదివే ఒక ఆదివాసీ బాలిక మొదటి బెంచీలో కూర్చున్నదని కొట్టటం, పిల్లలకు ఫలహారాన్ని నేలపై న్యూస్పేపర్లో పెట్టడం. ఈ విధంగా భారతదేశవ్యాప్తంగా బాలబాలి కలను కులంపేరుతో చిత్రహింసలకు గురిచేయటం అమాన వీయం. ఇది దేశానికే ప్రమాదం.దేశంలోకానీ, రాష్ట్రంలోకానీ ఒక ఉపాధ్యాయుడు అవ్వాలంటే ఇంటర్ లేదాడిగ్రీపూర్తి చేసి విద్యాబోధనలో డిప్లమోలేదా బ్యాచిలర్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ పూర్తిచేసి టీచర్ అర్హతపరీక్ష క్వాలిఫై అయిన తర్వాత డీఎస్సీ రాసిన వారిలో ముందువరుసలో ఉన్నవారిని ఎంపిక చేస్తారు. ఉపాధ్యాయుడు సమాజానికి మూలస్తంభం వంటి వారు. చాలా హేతుబద్ధతతో, శాస్త్రీయంగా కులాలకు,మతాలకు, ప్రాంతాలకు, లింగ,భాషభేదాలను అధిగమించి మనుషులందరూ సమానమే అనే మానవత్వాన్ని బోధిస్తూ మానవత్వంగల సమసమాజాన్ని నిర్మిస్తారు. కానీపైన పేర్కొన్న సంఘటనలో ఉన్నదోషులందరూ ఉపాధ్యాయులేననిగ్రహిస్తే సమాజం ఎటుపోతుందనని మనం అర్థంచేసుకోవాలి. సామాజిక సమస్యలపై స్పందించే ఉపాధ్యాయసంఘాలు, విద్యార్థి సంఘాలు, మహిళాసంఘాలు, ప్రజాసంఘాలు సభ్యసమాజం బాధితుల కులాలను బట్టి స్పందించటం కూడా ఇటువంటి నీచులను వెనకేసుకుని రావటమే అవుతుంది. అభంశుభం తెలియని అమాయక పసిపిల్లలపట్ల క్రూరమృగాల వలెప్రవర్తిస్తున్న వీరివలన భారతదేశానికి ఏమీలాభంలేదు సరికదా, స్వాతంత్ర్యపూర్వపు రోజులను గుర్తుచేస్తున్నాయి. ఇది మనిషిమనసులో ఉన్నవిషతుల్యమైన ఆలోచనలు మనిషిని మనిషిగా చూడలేని మనస్తత్వం ఉన్న అశాస్త్రీయమైన మూఢనమ్మకాల సిద్ధాంతాలను నమ్మడంవల్ల మానసికరోగులుగా ప్రవర్తిస్తారు.వీటిని ప్రభుత్వాలు వెంటనే నిషేధించాలి. మనుషులందరూ సమానమే అనే సోదరభావాన్ని ప్రచారం చేయాలి.సాటి మనిషిని మనిషిగా చూడలేనివాడు మానసిక రోగి అవుతాడు, వాడు మనిషిగా అప్పుడే చనిపోయినట్లు వాడు ఉండవలసినది పిచ్చి ఆసుపత్రిలో అంతేకానీ పాఠశాలల్లో ఉండే అర్హతలేదు. ప్రభుత్వపాఠశాలలో ఎవరైతే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారో వారిపిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి.లేకపోతే ప్రభుత్వపాఠశాలల్లో చదివే నిరుపేద తక్కువ కులాల పిల్లలు బాగా చదువుకుని ప్రైవేటు పాఠశాలలో చదివే ఉపాధ్యాయుల పిల్లలకు పోటీ వస్తారేమోనన్నా సంకుచిత భావంతో ఈపిల్లల పట్లనీచంగానూ, హేయంగానూ వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతుంది. అదే విధంగా ఈనిరుపేద కులాల పిల్లలు తరతరాలుగా వాళ్ల తల్లిదండ్రులవలె భూస్వాములకు, పెత్తందారులకు బానిసలుగా తయారు చేయాలనే ఉద్దేశంతో ఒక కుట్రపూరితమైన పథకం ప్రకారం చేస్తున్నారేమో అనేవిధంగా భావించాల్సి వస్తుంది. బాలబాలికలపట్ల కుల, మత,ప్రాంత,భాష, లింగ భేదాలతో వివక్షచూపుతూ మానసికంగా శారీరకంగా హింసిస్తున్నారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగించి చట్టప్రకారం శిక్షించి వారి ఆస్తులను ప్రభుత్వం వారు జప్తుచేసుకుని రాష్ట్రంలో కులనిర్మూలన ప్రాజెక్ట్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో కులనిర్మూలన వైపుకు సమానత్వంవైపుకు బాటలువేయాలి. ఈ రోజుప్రభుత్వ పాఠశాలలో డ్రాప్‌అవుట్ పెరిగి ప్రభుత్వ పాఠశాలలు మూతపడటానికి, నిరక్షరాస్యత పెరగటానికి, విషతుల్యమైన మనసు కలిగిన కొద్దిమంది ఉపాధ్యాయులు పాఠశాలలో బోధనసరిగాచేయకపోవడంవల్ల, నాణ్యమైన విద్య అందక దేశానికి నైపుణ్యంగల మానవవనరులు అందటంలేదు. దీనంతటికీ ప్రధాన కారణం మానవత విలువలు, రాజ్యాంగ విలువలను అర్థంచేసుకోలేని కొందరు దుర్మార్గపు ఆలోచన పరులైన ఉపాధ్యాయుల వలననే గ్రహించి తులసివనంలో గంజాయి మొక్కలైనా ఈ కీచక ఉపాధ్యాయులను పీకి పారేస్తే పాఠశాల విద్యావ్యవస్థకు తద్వారా యావత్భారత దేశానికి మంచి రోజులువస్తాయి. ●

# కోకో గింజలకూ ధరల విధానం అవసరం

కె. శ్రీనివాస్

రాష్ట్రంలో 75 వేల ఎకరాలలో కోకో సాగు ఉన్నది. ప్రధానంగా కొబ్బరి, ఆయిల్ పామ్‌అంతర పంటగా రైతులు కోకో సాగు చేస్తున్నారు. కొబ్బరి తోటలకు తెగుళ్లు ఆశించడం, ఈసంవత్సరం మినహా గత అనేక సంవత్సరాలుగా కొబ్బరికి ధరలేకపోవడం ప్రధానంగా కొబ్బరి రైతులు సంక్షోభం ఎదుర్కోవడంవలన రైతులకు కోకోపంట మీదనే ఆధారపడ్డారు. కోకో అంతరపంట కాస్త ప్రధాన పంటగామారింది. ప్రపంచంలో 20 దేశాలలో కోకో పంట సాగు ఉంటే 20వ దేశంగా భారతదేశం ఉంది. మనదేశంలో కూడా కేరళ, కర్ణాటక,తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోనే కోకో పంట సాగు ఉంది. చాలాకాలంగా కోకో గింజలు ధరలుతక్కువగా ఉండటం వలన గతం కంటే కేరళలో సాగు విస్తీర్ణం తగ్గించుకుని సుగంధ ద్రవ్యాల పంటల వైపు రైతులు మరలారు. మన రాష్ట్రంలో మాత్రం కోకో పంట విస్తీర్ణం రోజు రోజుకి పెరుగుతోంది. మనదేశ అవసరాలకు కావలసిన కోకో గింజలు 20శాతం మాత్రమే దేశంలో ఉత్పత్తి జరుగుతున్నదని, 80శాతం కోకో గింజలు, కోకో పౌడర్, బట్టర్, ఇతర ఉత్పత్తులను దిగుమతులు చేసుకుంటున్నాము. కోకో దిగుమతులపై దిగుమతి సుంకాలు నామమాత్రంగా ఉండడం వలన విదేశీ కోకో ఉత్పత్తులను దిగుమతులు చేసుకుని దేశీయంగా రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ధరలను చెల్లించడంలేదు. ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కోకో రైతులకునష్టం కలిగిస్తున్నాయి. భారత్ యూరోప్ యూనియన్ మధ్య జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో భాగంగా చాక్లెట్ ఉత్పత్తులపై సుంకాలు పూర్తిగా ఎత్తివేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. కోకో ఉత్పత్తులపై నామమాత్రపు దిగుమతి సుంకాలు ఉండడం వలన కంపెనీలు విదేశీ కోకో ఉత్పత్తులను చేసుకొని దేశీయంగా రైతులను నష్టపరుస్తున్నాయి. కోకో దిగుమతులపై దిగుమతి సుంకాల పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి పోయి జీరో శాతం దిగుమతి సుంకాలకు ఒప్పందాలు చేసుకోవడం వలన కోకో రైతులు మరింతగా నష్టపోయే పరిస్థితి దాపురిస్తుంది. విదేశీ కోకో ఉత్పత్తుల దిగుమతులను నిలుపుదల చేయాల్సి ఉంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు పామాయిల్ పై దిగుమతి సుంకాలు ఎత్తి వేయడంతో దేశీయంగా పామాయిల్ రైతులు నష్టపోయారు. ఎన్నికల అనంతరం దిగుమతి సుంకాలు పెంచడంతో ఆయిల్ పామ్ గెలల ధర పెరగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రైతులు ఎంతో కష్టపడి కోకో గింజలు ఉత్పత్తి చేస్తుంటే వాటి కొనుగోలుకు, మార్కెటింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను గాలికి వదిలేయడం అన్యాయం. 30 ఏళ్లకు పైగా నుండి రాష్ట్రంలో కోకో పంట సాగు అవుతుంటే ఇంతవరకు కోకో గింజలకు ధర నిర్ణయం పాలసీ లేకపోవడం మరీ దారుణం. రాష్ట్రంలో పామాయిల్ రైతులు ఆయిల్ పామ్ గెలలకు ధర నిర్ణయ సూత్రాన్ని సాధించుకున్నారు. ఆయిల్ పామ్ గెలలకు క్రషింగ్ ద్వారా వచ్చే ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ (ఓఇఆర్) ఆధారంగా అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా రూపొందించిన ఫార్ములా ప్రకారం ప్రతినెల ధర నిర్ణయం జరుగుతుంది. అదేవిధంగా కోకో గింజలకు కూడా అంతర్జాతీయ మార్కెట్ ధరను అనుసంధానిస్తూ ఫార్ములా రూపొందించాలని కోకో రైతాంగం కోరుతున్నారు. అందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపడతామని గత సంవత్సరం హామీ ఇచ్చారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం కోకోగింజల ధరల పాలసీ ప్రకటించలేదు. మరలా కంపెనీల ఇష్టారాజ్యంగా మారింది. కోకో గింజలకు కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా మోసం చేసిన ఫలితంగా గత ఏడాది రూ.500 కోట్లకు పైగా రాష్ట్ర కోకో రైతులు నష్టపోయారు. 2025 ఫిబ్రవరి నుండి మే వరకు నాలుగు నెలల పాటు సుదీర్ఘ పోరాటాన్ని రాష్ట్రంలో కోకో రైతులు సాగించారు.ఫలితంగా రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకొని రూ.50ప్రోత్సాహం అందించి కిలో కోకోగింజలకు రూ.500 ధర కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కోకోరైతులకు ప్రోత్సాహం పేరుతో రూ.15 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రకటించింది. అయితే రైతుల నష్టపోయింది రూ.500 కోట్లు పైనే.ఈ సంవత్సరం జనవరి నుండి కోకో గింజల సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుతం కిలో కోకో గింజలను కంపెనీలు రూ.350లకు కొనుగోలు ప్రారంభించి రైతుల ఆందోళనలతో రూ.400 లకు పెంచి కొనుగోలు చేస్తున్నారు.రాష్ట్రంలో కోకో విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర కోకో పరిశోధనా ఏర్పాటు అత్యవసరం. ●

# రాజకీయ అవినీతికి అంతం లేదా?



ఎం. నారాయణ స్వామి

మానహాని కన్నా మరణించడమే మేలనుకునే రోజులు చూశాం! పరువు పోయాక ప్రాణాలతో బతికుండటంకన్నానుయ్యో, గొయ్యో చూసుకుంటే పోలేదా అని అసహ్యించుకొన్న కాలం ఎరుగుదు! కానీ ఇవాళ అవినీతి పైన చాకిరేవు పెట్టటానికి సిగ్గు పడని దౌర్భాగ్యం దాపురించింది. చెడు అంటే భరించలేని రోతతో నేడు స్పందించడం మానేశాం. మరింకా అధ్యయనాలు చేయాలా? ఇంతకన్నా నిర్లజ్జ ఎక్కడుంటుంది? మరి ఇంత బహిరంగ చర్చలతో పాపం ప్రక్షాళనమైపోతుందా?బహిరంగ చర్చ అనగానే ఏది మంచి, ఏది చెడు, ఏది నీతి, ఏది అవినీతి, ఏది అక్రమార్జన, ఏది సక్రమార్జన అంటూ ప్రశ్నోపనిషత్తు వల్లే వేయడమేగా. అవినీతికి ఎందుకు పాల్పడాల్సి వచ్చింది? నీతికి తిలోదకాలు ఎందుకు వదలాల్సి వచ్చింది? అంటూ సాగదీయడం ఫాలో అవుతుంది. విలువలు విలుప్తం కావడానికిదారితీసిన పరిస్థితులపై చర్చ, సదరు పరిస్థితులు ఉత్పన్నమైన కారణాలపై సంవాదం. అందుకు సమాజమా, వ్యక్తులా?ఎవరు బాధ్యులని తర్జన, భర్జనలు. దీనికి ముగింపు ఉండదు. అవినీతి అనండీ, అక్రమార్జన అనండి, పెరగనిచ్చినన్నాళ్లు పెరగనిచ్చాం!. మొక్కయి ఎదిగి వస్తుండగానే నిర్దాక్షిణ్యంగా పంచాల్సిన కర్తవ్యం మర్చిపోయింది సమాజం. మొక్కయి వంగనిది మానైవంగుతుందా? వంగలేదు. రాజకీయాలు పుచ్చిపోయాయి. 'అవినీతి వృక్షానికి తల్లివేరు రాజకీయం' అంటారు ప్రముఖులు. ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంచుకున్నాం. ప్రజాస్వామ్యానికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎన్నికలు. ఎంత ఖర్చు పెట్టి అయినా గెలవటమే ఎన్నికల ధ్యేయం. ఖర్చు పెట్టడానికి డబ్బెక్కడనుండి వస్తుంది? అనంతకోటి మార్గాలున్న సంగతి అందరికీ తెలిసిందే. వెనక్కి తిరిగి చూడకుండా డబ్బు వెద జల్లుతూ పోవాలంటే ఏ రంగాన్ని వదలకుండా ఎడాపెడా పిండి దండుకోవాలి. కబ్జాలు, కుంభకోణాలు, లంచాలు, అధికార దుర్వినియోగం, అధికార పరమపద సోపానం స్వాయత్తం చేసుకోవటానికి ఎన్ని నిచ్చెనలుంటే అన్నిటి మీదుగా ఎగబాకాలి. ప్రాజెక్టులు తగలబడిపోయినా సరే టెండర్ల దశలోనే చిచ్చు రాజేయాలి!కాంట్రాక్టర్లతో కరచాలనాలు చేయాలి. రాజకీయాలు, అధికారులు, కాంట్రాక్టర్లు ముప్పేట గొలుసుగా పెనవడాలి. కమిషన్లు అందినంత బొక్కాలి. ఊళ్లకు ఊళ్లు పంచుకోవటానికి దొరల



వేషం కట్టిన దొంగలు సంఘటితమవ్వాలి. సంక్షేమం పేరిట ప్రవహించే నిధుల్నీ స్వాహా చేయాలి. కాగితం మీదలెక్కలు బొక్కలు కానరావు, లక్షలు, కోట్లు ఖర్చవుతున్నాయి. లక్ష్యాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే, కాకుల లెక్కలకు కొదవలేదు! పైవాళ్లంతా అంటే మంత్రులు, రాజకీయనాయకులు మూడక్షరాల హోదా, బిరుదులు తగిలించుకొన్న బ్యూరోక్రాట్లు తెగబడి తినేస్తోంటే పదికి పరక్కీ కక్కుర్తిపడేమూడో, నాలుగో తరగతి సిబ్బందంటే అందరికీ ఎందుకింత అక్కసు అని ఎన్జీవో సంఘాల నాయకులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. తాము పీక్కుతింటున్నవాళ్లు తమకనా బక్కవాళ్లే అన్న సంగతి వారికి జ్ఞాపకం రాదు. 'ఉద్యోగులపై చిన్న ఆరోపణ వచ్చినా సరే తక్షణమే సస్పెండ్ చేయడమో, మరొకరమైన చర్య తీసుకొంటున్నారు. అదే గనుక మంత్రులపై అభియోగాలు వస్తే ఏ విధమైన చర్యలు ఉండటం లేదు. అన్నిశాఖలలో నియామకాలు, ప్రమోషన్లు, బదిలీలలో మంత్రులు తలదూర్చి అవినీతికి పాల్పడుతున్నారు. వారికి సంబంధించిన వారికి మేలు చేసి లక్షలు మింగేస్తున్నారు. నీతినిజాయితీ అధికారులు, సిబ్బందికి మొండిచెయ్యి చూపిస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. తెలుగు రాష్ట్రాలలోని నీటిపారుదల శాఖకు సంబంధించిన కీలకపదవుల్లో ఉన్న వారికి ఆ శాఖకు సంబంధించిన కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారులు టెండర్లు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ల దగ్గర నుండి కోట్లాది రూపాయలను వసూలు చేసి ముట్ట చెప్తున్న ఆరోపణలు వస్తున్నా దర్యాప్తులు లేవు, చర్యలు లేవు. బహిరంగంగా జరుగుతున్న ఈ అవినీతి తతంగం గురించి తెలిసి కూడా ఆయా మంత్రులపైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటే జవాబు లేదు, దొరకదు! అదేవిధంగా పోలీసు శాఖ మంత్రులే కాకుండా, సంబంధిత మంత్రులు, నియోజక వర్గం శాసనసభ్యులకు తెలియకుండా పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహించే సబ్ ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ డివిజన్ డిఎస్పీల బదిలీలను జిల్లా, రేంజి రాష్ట్ర ఉన్నతాధికారులు చేయలేకపోతున్నారు.కొందరు ప్రజాప్రతినిధులు శాసనసభ్యులకు లక్షల రూపాయలను ముట్ట చెప్పిన సబ్ ఇన్స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, డిఎస్పీలకు వారు కోరుకున్న చోటుకు బదిలీ చేయించుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. లేదంటే దబిడి. ఇక రెవిన్యూతో పాటు ఇతర శాఖలపై మంత్రుల పెత్తనాలతో పాటు అవినీతి తారాస్థాయికి చేరుకుంటున్నా శిక్షించే నాథుడే లేదు. ప్రస్తుతం ఉన్న చట్టాల కు మరింత పదును పెట్టి నీతి నిజాయితీ వీటన్నిటిని మించిన సమర్థత కలిగిన అధికారులను నియమించి, ముఖ్యంగా అవినీతి నిరోధక శాఖలో మితిమీరిపోతున్న రాజకీయ జోక్యానికి ఫుల్స్టాఫ్ పెట్టకపోతే. పాలకుల మాటలు, చట్టాలు అన్నీ నిరర్థకమే. ●

# ప్రజావాక్కు



### ఆపద్ధర్మ ఒప్పందం అయినా ఉభయతారకం

**భారత్**,యూరోపియన్ యూనియన్ నడుమ కుదిరిన స్వేచ్ఛా వాణిజ్యఒప్పందం అన్ని విధాలా ఘనం ఉభయతారకం. మనప్రధాని వర్ణించినట్టుఇది అన్ని ఒప్పందాలకు తల్లిలాంటిదే. అంతకుమించి ఇరువురకు అత్యవసరమైనది. రెండు దశాబ్దాలుగా పడిఉన్న ప్రతిపాదన నేడు కార్యరూపం దాల్చడంలో ఇరువైపులా జరిగిన కృషి అభినందనీయం. అమెరికామిత్ర,శత్రు బేధం చూపించకుండా అందరినీ తన సుంకాల పెంపు తర్జన చూపించిన నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యం కుదుపుకి లోనైంది. అందుకు భారత్ గానీ యూరోప్ గానీ మినహాయింపు కాదు. ఈ స్థితిలో మూలపడి ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలకు బూజు దులిపి క్రియాశీలకం చెయ్యడం అవసరంగా మారింది. నేడు తుది రూపుతోఖరారైంది. 27దేశాల యూరోప్ సమాఖ్య భారత్ ఎగుమతులకు మంచి మార్కెట్‌నిచూపెడుతోంది. అలాగే మనదేశానికిఅవసరమైనవస్తుసేవల్నిచవకగా అందిస్తుంది.

- డా.డి.వి.జి.శంకర రావు, పార్వతీపురం

### టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

మనదేశంలో దాదాపు 30 రకాల పర్యాటక రంగాలున్నాయి. అందులో ఒకటివిమాన రంగం. పూర్వం బేగంపేట విమానాశ్రయంలో వచ్చేపోయే విమానాలను చూడటానికి పల్లెటూర్లనుండి పనిమీద బంధువుల ఇంటికి హైద్రాబాద్ వచ్చినవారు టికెట్టుకొని పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మిద్దెమీద ప్రదేశానికి వెళ్ళి చూసేవారు. పర్యాటకులకు ఇటువంటి సదుపాయాన్నితక్కువ ధర అంటే 50రూపాయల లోపు ప్రవేశ రుసుమును నిర్ణయంచాలి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వెయ్యి కిలోమీటర్ల పొడవున్న సముద్ర తీరాన్ని టూరిజంపేరిట అభివృద్ధి చేస్తే ఆహ్లాదం ప్రజల ఆదాయం ప్రభుత్వానిది అవుతుంది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సమాజానికి కొత్త సవాలు

నేటి కాలంలో సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది.సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం,ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అయితే అదే సమయంలో దీని దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

### పదోన్నతులు, నియామకాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకం, పదోన్నతులు 30:70 నిష్పత్తి ప్రకారం అంటే ఒక 100 ఉపాధ్యాయ ఖాళీలను (లాంగ్వేజ్ నాన్ లాంగ్వేజ్ తో సంబంధం లేకుండా) 30 శాతం నియామకం, 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు.ఇది దీర్ఘకాలంగా కొనసాగుతున్న నిబంధన.కానీ ప్రస్తుత ప్రభుత్వం నాన్‌లాంగ్వేజ్,ఇంగ్లీష్ పదోన్నతులు, నియామకాలు మాత్రం70:30 నిష్పత్తిలో,తెలుగు, హిందీలలో మాత్రం 30:70నిష్పత్తిలో జరపాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. చాలామంది ఎస్జీటీ ఉపాధ్యాయులు సుదీర్ఘ కాలంగా పదోన్నతులులేకుండా పదోన్నతి అవకాశంకోసం ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతుల్లో ఎస్జిటీలకు 70 శాతంగానే జరపాలి. దాన్ని తగ్గించి 30 శాతం మాత్రమేపదోన్నతులుకల్పించాలని ప్రభుత్వం చూడటం సమంజసం కాదు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఉన్న పదోన్నత అవకాశాలు తగ్గించడం సరైన విధానం కాదు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### నిధుల కొరత

**వాతావరణ** మార్పులు గ్లోబల్ పాలనను పునర్నిర్వచిస్తున్న ఈ దశలో, కాప్30లో భారత్‌ప్రకటించిన వైఖరి ఒక ప్రతిస్పందన మాత్రమే కాదు,అది వాతావరణ న్యాయం, సమానత్వం, చారిత్రక బాధ్యతలపై ఆధారపడిన ఒక సుస్థిర దృక్కోణం. ప్యారిస్ ఒప్పందానికి పునాది అయిన సాధారణ కానీ విభిన్న బాధ్యతలు సూత్రం, సర్వదేశాలకు ఒకే రకం బాధ్యతలను పెట్టడం అసంబద్ధమని స్పష్టంగా చెబుతుంది. ఈ లక్ష్యసాధనలో నిధుల కొరత సమస్యను అన్ని దేశాలూ కలిసి పరిష్కరించాలి.

-సి.సాయిరుత్విక్, నల్గొండ

### నిబంధనలను పాటించాలి

వైద్యుల ప్రెస్క్రిప్షన్ చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమే కానీ, తెలంగాణలో అన్ని జిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు.ఒక్కొక్క మందుల షాప్‌లోఫార్మాసిస్ట్‌లేడు. పర్యవేక్షణ లేదు. నిబంధనల ప్రకారం ప్రతి మందుల దుకాణంలో అర్హతపొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగాఉండాలి.హెచ్1 రిజిస్టర్‌ను చాలా దుకాణాలు నిర్వహించడం లేదు.

-పి. జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్ ఆర్థికవృద్ధి 6.8 నుంచి 7.2%




## 'సవాళ్లు ఎదురైనా ఆగని వృద్ధివేగం'

## పార్లమెంటులో ఆర్థికమంత్రి సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే!

**న్యూఢిల్లీ,జనవరి 29:** భారత్ స్థూలదేశీయోత్పత్తి వృద్ధి ఈ ఆర్థిక సంవత్సరంలో 6.8 నుంచి 7.2శాతంవరకూ ఉంటుందని పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో పొందుపరిచారు. ఆర్థికవ్యవస్థ పటిష్టమైన వృద్ధితో ఉందని, ఓపక్క సవాళ్లు, సుంకాలు, ప్రపంచదేశాల్లో అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్ వృద్ధి వేగవంతంగా ఉందని సర్వేలో ఉటంకించారు. ద్రవ్యోల్బణం చరిత్రాత్మక కనిష్టస్థాయిలను నమోదుచేస్తోందని, విదేశీ జమలు కూడా పెరుగుతున్నాయని, ప్రైవేటు పెట్టుబడులు కూడా మార్గదర్శకంగా వస్తున్నట్లు సర్వేలో వెల్లడించారు. కుటుంబీకులు, సంస్థలు, బ్యాంకుల ఆస్తిఅప్పుల పట్టీలు పటిష్టంగా మారాయని, ప్రభుత్వ పెట్టుబడులు కూడా కార్యకలాపాలుప ఎంచేవిధంగా ఉన్నాయి. వినియోగం డిమాండ్ మరింత పెరుగుతోందని, ప్రైవేటు ఇన్వెస్టుమెంట్ దోరణులు మెరుగుపడు తున్నాయని ప్రస్తావించింది. మద్యకాలికంగాను, వార్షిక పద్దతిలోచూస్తే భారత్ ఆర్థికవృద్ధి ఏడుశాతంగా ఉంటుందని, దశలవారీగా వృద్ధి మరింత వేగవంతం అవుతుందని ప్రపంచ స్థాయిలో అనిశ్చితి పెరిగినా భారత్‌లో మాత్రం శక్తివంతంగా ఉందన్నారు. గడచిన కొన్నేళ్లుగా జరుగుతున్న సంస్కరణలు కార్పొరేట్, ఆర్థికరంగ బ్యాలెన్స్‌షీట్లను పెంచిందన్నారు. పన్ను యంత్రాంగంలో మరింతగా పారదర్శకత రావడం, లీకేజిలు అరికట్టడానికి దోహదం చేసిం దని తెలుస్తోంది. మధ్యకాలికంగాచూస్తే భారత్ ఆర్థికవృద్ధి ఏడుశాతంగా ఉంటుందని ఆర్థిక సర్వేలో ప్రస్తావించారు. ప్రపంచ వాణిజ్య వాతావరణానికి తోడు అమెరికా సుంకాల తంత్రం కూడా భారత్‌పై అంతగా పనిచేయలేదని తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం పూర్తవుతుందని సర్వేలో పొందుపరిచారు. దీనితో అన్ని అపోహలు తొలగి పోతాయని, ప్రపంచ వాణిజ్యరంగంలో భారత్ తిరుగులేనిస్థానంతో దూసుకుపోతుందన్నారు. ప్రస్తుతం అమెరికాతో జరకు గుతున్న సంప్రదింపులు మరింత వేగవంతం అయ్యాయని, ఎదురవుతున్న రిస్కులు పరిష్కరించుకోగలిగిన స్థాయిలోనే ఉన్నట్లు ఆర్థిక సర్వేలో ఉటంకించారు. ప్రభుత్వ విధివిధానాలతో అన్ని సవాళ్లను అధిగమించే స్థాయిలోమనదగ్గర బఫర్‌నిల్వ ఉంటుందనిప్రధాన ఆర్థికసలహాదారు వి అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. ద్వైపాక్షిక, బహుపాక్షిక వాణిజ్య ఒప్పందాలు, ఇండియా ఈయూ ట్రేడ్ డీల్ వంటివి భారత్‌ఆర్థికవృద్ధికి ఎంతో కీలకంగా మారతాయన్నారు. భారత్ ఎగుమతులకు అతి తక్కువ సుంకాలు ఇపుడుప్రపంచదేశాల్లో ఉంటాయని దీనివల్ల ఎగుమతి మార్కెట్లలో భారత్ వాటా మరింతపెరుగుతుందని చెప్పుకొచ్చారు. ఇక భారత్‌లోప్రతిభా నిపుణులకు కొదవలేదని, ప్రతిభావంతుల నైపుణ్యాలను వినియోగించుకోవడంతోపాటు భారత కార్పొరేట్‌రంగంలోను, ఐటి రంగంలో కృత్రిమమేధకు తగినంతగా ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ ఎఐ లీడర్‌గా భారత్ ఎదిగేస్థాయికి మనం వెళుతున్నట్లు ఆర్థికసర్వేలో వెల్లడించారు. ముందు సమన్వయం, ఆ తర్వాత సామర్ధ్యం పెంపు అన్న బాటలో వెళుతున్నదని, అయితే ప్రభుత్వ నిబంధనలు, చట్టాలను గౌరవిస్తూనే వ్యవస్థలు, సంస్థలు మార్కెట్లతో ఎఐని సమన్వయం చేసేందుకు ఉపకరిస్తుందన్నారు. ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌నిలిచిందని ఎఐ విప్లవంతో మరింతగా మార్పులు చోటుచేసుకుంటాయని, ఎఐ రంగంలో గ్లోబల్ లీడర్‌గా భారత్ ఎదుగుతుందన్నారు. ఎంపికచేసిన రంగాలు, చిన్న, ఓపెన్ వైట్ మోడళ్ల వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు కృషి జరుగుతోందన్నారు. బ్యాంకులు, వ్యవస్థలు, సంస్థలు, కుటుంబీకుల ఆదాయవనరులు సుసంపన్నంగా ఉన్నాయని, ప్రభుత్వ పెట్టుబడులు మరింతగా ప్రోత్సాహకరంగా ఉన్నాయని వివరించింది. ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ కూడా పెరుగుతూ వస్తోందని, బయటినుంచి వచ్చే సవాళ్లను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వ విధానాలున్నాయని, అందువల్లనే ఆర్థికవృద్ధి సత్వర వేగవంతం అవుతుందన్నారు.

రానున్న సంవత్సరంలో కన్స్యూమర్‌ప్రైస్ ఇండెక్స్ సిరీస్ ద్రవ్యోల్బణ అధ్యయనంపై ప్రభావం చూపిస్తాయని, ధరల మదింపునకు దోహదం చేస్తుందన్నారు.

## మితిమీరిన వినియోగంతో ధరలు పెరగనున్న యూరియా

## డిబిటితో రైతుల నష్టం భర్తీ :ఆర్థిక సర్వే

**న్యూఢిల్లీ,జనవరి 29:** వ్యవసాయరంగంలో విరివిగా వినియోగించే యూరియా ధరల్లో స్వల్పంగా పెరుగుదల కనిపిస్తుందని, దేశవ్యాప్తంగా రిటైల్ ధరల్లో కొంత వృద్ధి ఉంటుందని,అయితే ఆమొత్తం బ్యాంకు ఖాతాలకు ఎకరాకు స్పష్టమైన మొత్తం చొప్పున నేరుగా జమచేస్తారని ఆర్థిక సర్వేలో పొందుపరిచారు. ఈ వ్యవస్థ కారణంగానే ధరల్లో పెరుగుదల కనిపించినా డిబిటద్వారా నేరుగా రైతులకు జమచేయడం వల్ల ఎలాంటి నష్టం ఉండదని, తద్వారా రైతుల్లో కొనుగోలుశక్తికూడా పెరుగుతుందని అన్నారు. అలాగేనైట్రోజెన్ ఎరువుల ధరలు కూడా మార్పులున్నప్పటికీ రైతులకు అందుబాటులోనే ఉంటుందని సర్వేలో పొందుపరిచారు. భారత వ్యవసాయరంగంలో కొన్ని అధునాతన ఒకడలు వల్ల సవాళ్లనుంచి అధిగమించగలుగుతారన్నారు. ఉత్పాదకత, ఆదాయవనరుల పెంపుపై ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సరిపడా లేని మార్కెటింగ్; స్టోరేజి మౌలికవనరులు, నాణ్యతా పరమైన ఇన్‌పుట్‌లకు పరిమితంగానే లభించడం, పెట్టుబడులు తక్కువస్థాయిలో ఉండటం, ఉన్నత ప్రమాణాలతో సేవలు అందుబాటులోకి రావాలిసన అవసరాన్ని నొక్కిచెప్పారు. పౌష్టిక ఎరువులు ఇతర ఎరువులకంటే కారుచౌకధరలకు అందుబాటులోకిరావాలని, భూప్రమాణాలు, సారవంతంగా నేలలు మార్చుకునేందుకు నిర్దిష్టప్రమాణాలతో శాస్త్రీయ విదానంలోఎరువుల వినియోగంపై చైతన్యపరచాల్సిన అవసరం ఉందని అన్నారు.అయితే ఇందుకు ఎరువుల ధరలపై నిత్యం పర్యవేక్షణ కొనసాగాల్సి ఉంటుందని ఆర్థికసర్వేలో సూచించారు.



ఎరువుల కొనుగోలు వ్యయాన్ని రైతుల ఆదాయవనరులకు మద్దతిచ్చే రాబడులకు దూరంగా ఉంచాలని, వ్యవసాయ సంబంధిత వనరులపై కొరతను తీర్చాలని సర్వేలో సూచించారు. నైట్రోజెన్ వినియోగం ఇప్పటికే రైతుల్లో అవగాహణ పెరిగిందని, తక్కువ ధరలకు కొనుగోలుచేసినా పూర్తిసబ్సిడీ వారి ఖాతాలకు చేరుతుందన్న అవగాహణ రైతులకుండటం విశేషమన్నారు. భూపరీక్షలు, నానో యూరియా, ద్రవరూప ఎరువులు, సేంద్రీయ వ్యవసాయ నవరణలు వంటివి విస్తృతంగా అమలులోకి రావాలని సూచించింది. అలాగే డిజిటల్ వ్యవసాయ మౌలికవనరులు మరింతగా సంస్కరించుకోవాల్సి ఉంటుందన్నారు. కౌలు రైతులకోసం ప్రత్యేక వ్యవసాయ వ్యవస్థను సృష్టించాలని, అద్దెమార్కెట్లకోసం సమయ పాలిత సర్దుబాట్లను స్పష్టంచేయాల్సి ఉంటుందని ఈ కౌలువ్యవస్థ ప్రయోజనాలను అమలుకు ముందు విస్తృత స్థాయిలో సవరణలు అవసరమన్నారు. యూరియాను మితిమీరి వినియోగం కూడా అనర్ధదాయకమని, రిటైల్ యూరియా ధరలు దశాబ్దకాలంగా పెరగలేదని, 2026లో సుమారు రూ.1.91 లక్షలకోట్లుగా ఉంటుందని, బడ్జెట్ అంచనాల్లో రూ.1.67 లక్షలకోట్లుగా ఉందని వెల్లడించారు. ప్రస్తుత ఆరినతకసంవత్సరంలో యూరియా వినియోగం 40 మిలియన్ టన్నులుగా ఉందని, మరింతగా డిమాండ్ వచ్చిందని ఆర్థికసర్వేలో పొందుపరిచారు. వ్యవసాయ అనుబంధ సేవలు 2026లో 3.1శాతంపెరుగుతాయని అంచనా వేసారు. దీర్ఘకాలిక సగటు 4.5శాతంగా ఉంటుందని ఆర్థికసర్వేలో ప్రభుత్వం అంచనా వేసింది. జంతు సంపద, మత్స్యశాఖలపరంగా కూడా ఐదునుంచి 6శాతం వృద్ధి ఉంటుందని వనయవసాయ జివిఎ మరింతగా వృద్ధిలోకి వస్తుందని తెలిపారు. రబీ నాట్లు ముమ్మరంగా పెరిగాయని, వాణిజ్యం, వ్యవసాయ రంగానికి ఇటీవలికాలంలో అనేక మార్పులు వచ్చాయని, వ్యవసాయరంగానికిగాను 2.17శాతం వృద్ధి ఉంటుందన్నారు.

## ఫిబ్రవరి 27న ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పర్యటన

**- రక్షణ, సాంకేతికత, వ్యవసాయం, సైబర్ భద్రతపై చర్చలు**



**న్యూఢిల్లీ, జనవరి 29:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఇజ్రాయెల్‌ను సందర్శించాలని ఇప్పటికే ప్రధాని మోడిని ఆ దేశం ఆహ్వానం పంపింది. రక్షణ, సాంకేతికత, వ్యవసాయం, సైబర్ భద్రత, ఉగ్రవాద నిరోధక వంటి రంగాలలో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడం పర్యటన లక్ష్యం. మోడీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ నెల ప్రారంభంలో చర్చలు జరిపారు, రెండు వైపులా ఉగ్రవాదంపై సున్నా సహన వైఖరిని పునరుద్ఘాటించినప్పటికీ, 2 నెలల్లో రెండవది. గాజా శాంతి ప్రణాళిక అమలు, పురోగతి గురిం చి నెతన్యాహు భారత పక్షానికి వివరించారు, అయితే ఈ ప్రాంతంలో న్యాయమైన, శాశ్వత శాంతి కోసం భారతదేశం స్థిరమైన మద్దతును పునరుద్ఘాటించిన విషయం

## ఖర్గే, రాహుల్‌తో శశిథరూర్ భేటీ

**న్యూఢిల్లీ, జనవరి 29:** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ పార్టీ అగ్రనాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం జరుగుతున్న క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీలతో ఆయన భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లో దాదాపు 30 నిమిషాల పాటు వీరి మధ్య చర్చలు జరిగాయి. దీనికి ముందు



థరూర్‌ను రాహుల్‌తో భేటీ గురించి విలేకరులు ప్రశ్నించగా అది జరగాల్సినప్పుడు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తన సొంత పార్టీ నాయకుడిని కలవడంలో అంత ప్రాధాన్యం ఏముంటుంది అని వ్యాఖ్యానించారు. సమావేశం అనంతరం థరూర్ మాట్లాడుతూ మా మధ్య చాలా సానుకూలమైన చర్చలు జరిగాయి. అంతా బాగుంది. అందరం ఒకే అభిప్రాయంతో ముందుకుసాగుతున్నాం అని విలేకరులతో అన్నారు. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. దీనికి అనేక విషయాలపై ఆత్మీకంగా, సానుకూలంగా చర్చించినందుకు ఖర్గే, రాహుల్‌గాంధీలకు ధన్యవాదాలు. దేశ ప్రజలకు సేవ చేసేందుకు ఒకే అభిప్రాయంతో ముందుకుసాగుతున్నాం అని రాసుకొచ్చారు. గతేడాది ఆపరేషన్ సిందూర్ తర్వాత దౌత్యపరమైన సంబంధాలపై థరూర్ పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. దీనిపై సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత పలు సందర్భాల్లో ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించడం కూడా విమర్శలకు దారి తీసింది. పార్టీతో తనకు కొన్ని అభిప్రాయభేదాలు ఉన్నాయని, అయితే పార్లమెంటులో పార్టీ నియమావళిని ఎప్పుడూ ఉల్లంఘించలేదని ఇటీవల థరూర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో తాజా భేటీ జరగడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## ఎస్ఐఆర్ పారదర్శకంగా సాగాలి - ఇసికి సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ, జనవరి 29:** తమిళనాడులో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై సుప్రీంకోర్టు గురువారం జోక్యం చేసుకుంది. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా, సజావుగా సాగేలా వ్యవహరించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సూచించింది. ఈ మేరకు డిఎంకె దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు వెలువరించింది. ఏప్రిల్‌లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల జరగనుండగా.. ఎస్ఐఆర్ పేరుతో భారీగా ఓటర్లను తొలగించారని డిఎంకెకు చెందిన ఆర్ఎస్ భారతి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. రాష్ట్రంలోని ఎస్ఐఆర్ అనంతరం 97 లక్షల ఓట్లను తొలగించారు.. మొత్తం ఓటర్లలో దాదాపు 88 శాతం మంది అంటే 1.72 కోట్ల మంది ఓటర్లను "తార్కిక వ్యత్యాసాలు" పేరుతో జాబితాను తొలగించారని ఆయన ఆరోపించారు. పశ్చిమ్ బెంగాల్, కేరళలోనూ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సమగ్ర సవరణలకు సంబంధించిన ఫిర్యాదులను కూడా విచారిస్తున్న సర్వోన్నత న్యాయస్థానం.. ప్రభుత్వ కార్యాలయాలలో తార్కిక వ్యత్యాసాల జాబితాలోని ఓటర్ల పూర్తి జాబితాను ప్రచురించాలని, పేర్లు లేనివారు 10 రోజుల్లోపు సంబంధిత పత్రాలను సమర్పించడానికి అనుమతించాలని ఇసిని ఆదేశించింది. 'ప్రతి కలెక్టర్ ఇసి జారీ చేసిన ఆదేశాలను పాటించాలని, ఎస్ఐఆర్ సజావుగా నిర్వహించడానికి సిబ్బందిని నియమించాలని తాము ఆదేశిస్తున్నాం" అని కోర్టు పేర్కొంది. అలాగే, శాంతిభద్రతల సమస్య లేకుండా ఉండేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిజిపి, పోలీస్ కమిషనర్లకు సూచించింది. ఎస్ఐఆర్ ఎక్కడ జరుగుతున్నా ఇసి ఈ ఆదేశాలకు కట్టుబడి ఉంటుందని తాము ఆశిస్తున్నామని ధర్మాసనం వ్యాఖ్యానించింది.





## ప్రధాని మోడీతో దేవెగౌడ భేటీ

**- దేశాభివృద్ధితో పలు కీలక అంశాలపై చర్చ**

**బెంగళూరు, జనవరి 29 (ఐఏఎన్ఎస్):** మాజీ ప్రధాని, జెడి(ఎస్) అధినేత హెచ్.డి. దేవెగౌడ గురువారం ప్రధాని నరేంద్ర మోడీని కలిసి చర్చలు జరిపారు. ఈ విషయాన్ని ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "హెచ్.డి. దేవెగౌడతో అద్భుతమైన సమావేశం జరిగింది. కీలక సమస్యలపై ఆయనకున్న అకుంఠిత దీక్ష్ట ప్రశంసనీయం. భారతదేశ అభివృద్ధి పట్ల ఆయనకున్న అభిరుచి కూడా అంతే ప్రశంసనీయం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ) కూడా ఈ విషయమై కన్నడ భాషలో ఒక పోస్టను పెట్టింది. ఈ పరిణామం కర్ణాటక రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దేవెగౌడ, ఆయన కుమారుడు, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి తమ స్వస్థలమైన హాసన్‌లో భారీ ర్యాలీ నిర్వహించి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## వీధికుక్కల కేసులో సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

**- వారంలోపు లిఖిత పూర్వక వాదనలు దాఖలు చేయండి**

**- కేంద్ర, రాష్ట్రాలకు త్రిసభ్య ధర్మాసనం ఆదేశం**

**న్యూఢిల్లీ, జనవరి 29:** వీధికుక్కల కేసులో అన్ని రాష్ట్రాల నుండి వచ్చిన వాదనలు విన్న ఒక రోజు తర్వాత, సుప్రీంకోర్టు గురువారం వీధి కుక్కల కేసులో తన తీర్పును రిజర్వ్ చేసింది. కుక్కల ప్రేమికులు, కుక్క కాటు సంఘటనల బాధితులు, జంతు హక్కుల కార్యకర్తలు, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల తరపున హాజరైన న్యాయవాదులు సహా అన్ని వాటాదారుల వాదనలను వివరంగా విన్న తర్వాత కోర్టు విచారణను ముగించింది. విచారణ పూర్తయిన తర్వాత, సుప్రీంకోర్టు ఈ విషయంలో తన తీర్పును రిజర్వ్ చేసింది. అన్ని పార్టీలు ఒక వారంలోపు తమ లిఖితపూర్వక వాదనలను సమర్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. వీధి కుక్కలను క్రిమిరహితం చేయడానికి, కుక్కల పౌండ్లను ఏర్పాటు చేయడానికి, విద్య, ఇతర సంస్థల క్యాంపస్‌ల నుండి కుక్కలను తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో అనేక రాష్ట్రాలు విఫలం.





## మహారాష్ట్ర పరిణామాలు

## డిసిఎంగా సునేత్ర పవార్!

### అజిత్ పవార్ స్థానంలో నియమించే అవకాశం

**ముంబయి,జనవరి 29:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) అధినేత, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో పవర్ గేమ్ మొదలైంది. ఎన్సీపీకి తదుపరి అధినేత ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మరోవైపు, అజిత్ పవార్ వర్గం, శరద్ పవార్ వర్గం కలిసిపోతాయనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌ను మహారాష్ట్ర డిప్యూటీ సీఎం పదవి కోసం పార్టీ నామినేట్ చేయనున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఎన్సీపీ నేత, మహారాష్ట్ర ఎఫ్‌డీఏ మంత్రి నర్హరి జిర్వాల్ గురువారం మాట్లాడుతూ సునేత్ర పవార్‌ను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మరోవైపు, ఎన్సీపీ నేతలు ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్ బల్, ధనంజయ్ ముండే, సునీల్ తట్కరేలు సునేత్ర పవార్‌తో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. అజిత్ పవార్ మరణంతో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానం నుంచి సునేత్రా పవార్‌ను పోటీలో దింపాలని ఎన్సీపీ భావిస్తోంది. ఇక పార్టీ కార్యక్రమాలను నడిపించడానికి ఎన్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ ముందుంటారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇదే విధంగా శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాలు కలిసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల, ఈ రెండు కూటములు కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేశాయి. అజిత్ పవార్ ఎన్సీపీ రాష్ట్రంలో బిజెపి శివసేనతో కలిసి మహాయుతి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. ప్రస్తుతం సునేత్రా పవార్ రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. సునేత్రకు డిప్యూటి సిఎం పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌వద్దకు ఎన్సీపీ అజిత్‌వర్గం నేతలు మంత్రులు రాయబారం నడుపుతున్నారు. అలాగే పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఉన్న ప్రఫుల్‌పటేల్ ఇకపై పార్టీకి పూర్తి కాలం బాధ్యతలునిర్వర్తించేవిదంగ ఆజిత్ వర్గం నేతలు నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఈలోపు ఎన్సీపీలోని రెండు వర్గాలు ఒక్కటయ్యే ఛాన్స్ కూడా ఎ క్కువగా కనిపిస్తోంది. ఈ కోణంలోకూడా చర్చలు కొనసాగుతున్నట్లు పార్టీనేతలు చెపుతున్నారు.

## కొలంబియాలో కుప్పకూలిన విమానం..


## ఎంపి సహా 15 మంది మృతి




**లండన్, జనవరి 29:** కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. దేశ ఈశాన్య ప్రాంతంలోని నార్టే డి సెంటాండర్ ప్రావిన్స్‌లో ప్రభుత్వరంగ విమానయాన సంస్థ సటెనాకు చెందిన ఒక చిన్న విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న ఇద్దరు సిబ్బంది, 13 మంది ప్రయాణికులతో సహా మొత్తం 15 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ప్రముఖ రాజకీయ నాయకుడు, మానవ హక్కుల కార్యకర్త, ఎంపి డియోజెనెస్ క్వింటెరో కూడా ఉండటంతో దేశవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ విమానం, స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 11:42 గంటలకు కుకుటా విమానాశ్రయం నుంచి ఒకాన్యాకు బయలుదేరింది. 40 నిమిషాల ఈ ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో విమానానికి సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. అప్రమత్తమైన అధికారులు కురాసికా అనే మారుమూల గ్రామీణ ప్రాంతంలో విమానం కూలిపోయినట్లు గుర్తించారు. వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. విమానం ఉన్న ప్రదేశాన్ని గుర్తించిన తర్వాత అందులో ఎవరూ ప్రాణాలతో మిగిలిలేరని అధికారులు ధ్రువీకరించినట్లు కొలంబియా రవాణా మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

## సంక్షిప్తంగా..

### ఇజ్రాయెల్ ప్రధాని ఫోన్‌కు రెడ్‌టేప్!



**టెల్‌అవీవ్,జనవరి 29:** ఇజ్రాయెల్‌ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తాను వినియోగిస్తున్న ఫోను వెనుకభాగంలోని కెమేరా ఒక రెడ్‌టేప్‌తో సీల్‌వేసి ఉన్న విడియో ఇపుడు నెట్‌లో వైరల్ అయింది. సోషల్‌మీడియాలో ఇందుకు సంబంధించి అనేక ఫోటోలు విడియోలువ ఐరల్ అయ్యాయి. ఇజ్రాయెల్‌పార్లమెంట్ నెస్సెట్ అండర్‌గ్రౌండ్ పార్కింగ్ వద్దనెతన్యాహు తన లగ్జరీ కారు వెనక నిలబడి ఎవరితోనే ఫోన్‌లో మాట్లాడుతుండటం కనిపించింది. ఆయన కెమేరా లెన్సులు, ఫోన్ సెన్సార్లు మొత్తం ఒక దట్టమైన రెడ్‌టేప్‌తో కప్పి ఉన్నట్లు గుర్తించారు. తన ఫోన్‌ను సురక్షితంగా వాడాలనుకుంటే మరో ఫోన్ వాడతారని, ఇలా రెడ్‌టేప్‌లు ఎందుకు వస్తారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అమెరికా ఔట్‌లెట్ హైప్‌ఫ్రెష్ ఈ రెడ్‌టేప్‌పై వివరణ ఇస్తూ నెతన్యాహు ఫోన్‌కు వేసిన రెడ్‌టేప్ ట్యాంపర్ కాకుండా ఉండే సీల్ అని హైసెక్యూరిటీ ప్రాంతాల్లో ఇదొక ప్రత్యేక స్టిక్కర్ అని వీటిని తరచూ వినియోగిస్తారని తెలిపింది.

### అనుమానాస్పద స్థితిలో సాధ్వి ప్రేమ్‌బైసా మృతి!



**జైపూర్;జనవరి 29:** రాజస్థాన్‌లో హిందూ మతప్రచారక్ బోధకురాలు సాధ్వి ప్రేమ్‌బైసా మరణం ఇపుడు రాజకీయాల్లో దుమారం రేపింది. ఆర్ఎల్‌పి నేత జాట్ శక్తివంతమైన నేత హనుమాన్ బేనివాల్ సిబిఐ దర్యాప్తుజరిపించాలని, ఆమె మరణం మిస్టరీని ఛేదించాలని డిమాండ్ చేయడంతో ఇపుడు మరింత ప్రచారంలోకి వచ్చింది. ప్రేమ్‌బైసాను జోద్‌పూర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బోరనాదా ఆశ్రమ్‌నుంచి ఆమె తండ్రి వీరమ్‌నాథ్ మరో సహాయకుని సాయంతో తీసుకురాగానే వైద్యులు ఆమె చనిపోయిందని ధృవీకరించారు. వైద్యుడు డాక్టర్‌ప్రవీణ్‌జైన్ మాట్లాడుతూ ఆమెను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలుచేసినా ప్రయత్నంలేదని, ఆమె శరీరంలో అసలు కదలికలు లేవని అన్నారు. ఆమెకు జ్వరం వచ్చిందని తండ్రి తెలిపారని, కాంపౌండర్, హెల్‌నతకేర్ నిపుణుడిని ఆశ్రమానికి పిలిపించినట్లు చెప్పారు.

### సైబర్ నేరాల మాఫియా.. 11 మందికి మరణశిక్ష అమలు



**బ్యాంకాక్, జనవరి 29:** 100 కోట్ల డాలర్లకుపైగా సైబర్ మోసాల ర్యాకెట్ నిర్వహించిన 11 మంది మైన్మార్‌కు చెందిన కుటుంబ క్రైమ్ సిండికేట్‌కు చైనా మరణశిక్ష విధించింది. వెన్‌ఝౌ సిటీ ఇంటర్మీడియేట్ పీపుల్స్ కోర్టు ఈ మరణశిక్షను గురువారం అమలుచేసింది. వెంఝౌసిటీ న్యాయస్థానం గత ఏడాది సెప్టెంబరులో 11 మందిని దోషులుగా తేల్చి అందరికీ మరణశిక్ష విధించింది. కుటుంబసభ్యుల అప్పీలును ఇటీవల తిరస్కరించి మరణశిక్ష అమలుచేయాలని ఆదేశించింది. ఈ మొత్తం 11 మందిని 2023 నవంబరులోనే అదుపులోకి తీసుకుని చైనా అధికారులు విచారించారు. సరిహద్దుప్రాంతాల్లో నిఘా పెంచి మైన్మార్‌తో పరస్పరం టెక్ సమాచారం పంచుకుంటూ కుంభకోణాలను కట్టడిచేయగలిగింది. ఈ 11 మందిలోమింగ్ గౌపింగ్; మింగ్‌ఝెన్‌ఝెన్‌లు కూడా ఉన్నారు. వీరే ఈ సైబర్‌క్రైమ్, గ్యాంబ్లిక్ కార్యకలాపాలకు కీలకమని కోర్టు నిర్ధారించింది.

### ఖమేనీని తొలగిస్తే అధికారం ఎవరికో!: మార్క్ రుబియో

**వాషింగ్టన్,జనవరి 29:** పశ్చిమాసియాలో అమెరికా యుద్ధనౌకల మోహరింపుక్రమంలో ఇరాన్‌పై ఏక్షణంలో అయినా దాడిజరగవచ్చన్న భయాందోళనలు పెరిగాయి. అమెరికా విదేశాంగమంత్రి మార్క్ రుబియో మాట్లాడుతూ ఇరాన్ సుప్రీం లీడర్ అయుతొల్లా ఆలిఖమైనీని తలొగిస్తే అధికారి ఎవరిచేతుల్లోకి వెళుతుందో ఎవరికీ తెలియదన్నారు. సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ ముందు ఇచ్చిన వాంగ్మూలంలో రుబియో ఈ వ్యాఖ్యలుచేసారు. ఇరాన్‌లో పాలన మార్పు తర్వాత ఏంజరుగుతుందనే ప్రశ్నలకు రుబియో బదులిస్తూ అది ఒక బహిరంగప్రశ్న. ఎవరు అధికారంచేపడతారో ఎవరికీ తెలియదు. ఇరాన్ పాలన ఖమైనీ ఇస్లామిక్ రివొల్యూషనరీగార్డ్‌కార్ప్స్ తోపాటు ఎన్నికైన వ్యక్తులమధ్య విభజించి ఉంది. వారంతా చివరికి ఖమేనీ ఆదేశాలతోనే నడుచుకుంటారని అన్నారు.సుప్రీం లీడర్ పాలన పడిపోతే అక్కడ తర్వాత ఏంజరుగుతుందనే ప్రశ్నకు జవాబు కష్టమేనన్నారు.



విజ్ఞాన గిరివద్ద స్వామి అమ్మవార్లకు పూజలు

## దక్షిణ కైలాసంలో కన్నుల పండువగా భీష్మఏకాదశి

శ్రీకాళహస్తి, జనవరి 29 ప్రభాతవార్త: దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో గురువారం అంగరగ వైభవంగా భక్తి శ్రద్దలతో భీష్మఏకాదశి పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో రాజేష్, సూరి గురుకుల్స్ స్వామి అమ్మవార్లతో పాటు వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామని అందంగా ఆలంకరించారు. అక్కడ ఇఒ డి.బాపిరెడ్డి దంపతులు పూజలు జరిపి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. స్వామి అమ్మవార్లను పాతాళ వినాయకుని ఆలయం ఎదురుగా ఉన్న గోపురం నుంచి రాజగోపురం ద్వారా ఆలంకార మండపం వద్దకు చేర్చారు. అక్కడ సప్పరాలపై ప్రతిష్టించి ఉభయదారులు వెంటరాగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలు మంగళవాయిద్యాలతో స్వామి అమ్మవార్లను కన్నుల పండువగా భక్తులు దర్శించుకుంటుండగా గ్రామోత్సవం నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి దఫేదార్ రాజా తదితరులు వెంటరాగా ఉత్సవం సాగింది.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి విన్నవిస్తున్న ధార్మిక మండలి కన్వీనర్ రమేష్‌బాబు

## శివరాత్రి ఉత్సవాల్లో ప్రణాళికలు అవసరం

### ఎమ్మెల్యేకు హిందూధార్మిక మండలి వినతి

శ్రీకాళహస్తి, జనవరి 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో,గ్రామోత్సవాల్లో తిరుమల తరహా ప్రణాళికలు ఎంతో అవసరం అని గురువారం హిందూధార్మిక మండలి కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో 12రోజులు గ్రామోత్సవాలు, వాహన సేవలకే ప్రాధాన్యం అని వివరించారు. ఇక్కడి బ్రహ్మోత్సవాలకు దేశ వ్యాప్తంగా ఉన్న భక్తులు హాజరౌతారని వివరిస్తూ తిరుమల తరహా ప్రణాళికలు ఆచరణ ఎంతో అవసరం అని విన్నవించారు. ఈ అంశాలను సమీక్షా సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చి చర్యలు తీసుకునేటట్లు చూడగలమని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.

## అధికార కాంక్షతోనే జగన్ పాదయాత్ర



విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: అధికార కాంక్షతోనే వైఎస్ జగన్ పాదయాత్రకు సిద్దపడుతున్నారని కాంగ్రెస్ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. జగన్ పాదయాత్ర ఇప్పుడు ఎందుకు... అధికారం కోసమే కదా అని ఎద్దేవా చేశారు. అధికారం ఇస్తే.. జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. వైఎస్సార్ జలయజ్ఞం పేరుతో చేపట్టిన ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్... ఆ తర్వాత వాటిని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల మాట్లాడారు. మద్యం మాఫీ అన్న వ్యక్తి... మద్యాన్ని ఏరులై పారించి, నకిలీ మద్యంతో రూ.కోట్లు గడించారని వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. రిషికొండ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బోడి గుండు అయ్యింది. జగన్‌కు అధికారం ఇస్తే.. ప్రజలకు ఏం చేశారు. ప్రజల్లో ఉన్నారా, కనీసం వారి నాయకులకు కూడా అపాయింట్‌మెంట్ ఇచ్చారా..?. సీఎంగా అసలు జనాల్లోకి ఆయన ఎప్పుడు వచ్చారు. ఎన్నికలకు ముందు సిద్ధం సభలతో హడావుడి చేశారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే జగన్ ఏం చేద్దామని అనుకుంటున్నారు. ఒక మనిషి నిజమైన నైజం తెలియాలంటే.. ఆయనకు అధికారం ఇచ్చి చూడండి అని అబ్రహాం లింకన్ అన్నారు. అధికారంలో ఉన్న జగన్ పని తీరు మనమంతా చూశాం అని వైఎస్ షర్మిల విమర్శించారు. జగన్‌కు అధికారం సూట్ కాలేదు.. ఆయన నైజం మారాలి.. ఆయనలో మార్పు రావాలని షర్మిల అన్నారు. జగన్‌లో స్వార్థం తగ్గి ప్రజలకు సేవ చేసే గుణం రావాలి. అప్పటి వరకు దేవుడు కరుణించడు.. ప్రజలు కూడా ఆదరించరు. 2027 జులైలో జగన్ పాదయాత్ర చేస్తే.. ఇప్పుడు ఎందుకు ప్రకటన చేయడం. జగన్ పాదయాత్ర ఎందుకోసం, ఎవరి కోసం.. ప్రయోజనం ఏంటో చెప్పాలి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గట్టి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందన్నారు.



మంత్రి అచ్చెనాయుడుకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

## దుర్గమ్మ సేవలో మంత్రి అచ్చెన్నాయుడు

ఇంద్రకీలాద్రి, జనవరి 29, ప్రభాతవార్త: దుర్గమ్మవారిని గురువారం రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చెనాయుడు దర్శించుకున్నారు. శ్రీ అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆయనకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగిన వసంత పంచమి వేడుకల్లో జరుగుతున్న అవాస్తవాలను నమ్మవద్దని ఇఒ వికె శీనా నాయక్ భక్తులకు విజ్ఞప్తి చేవారు. సుమారు 65 వేల మంది భక్తులు దుర్గమ్మవారిని దర్శించుకున్నారని, క్యూలైన్లలో వున్న మిగిలిన భక్తులు దర్శించుకోడానికి సుమారు రాత్రి 11 వరకు అవకాశముండడంతో రద్దీ నియంత్రణకు రాత్రి 9-30 లకు టోల్‌గేట్ మూసివేశామన్నారు. దీంతో కొంతమంది టోల్‌గేట్ సిబ్బందితో వివాదం పడి, అవాస్తవ ప్రచారం చేస్తున్నారని ఇటువంటి అవాస్తవ ప్రచారాలు నమ్మవద్దని కోరారు. దుర్గమ్మ వారి ఆలయంలో వారాంతపు రోజుల్లో నిర్వహించే కళాప్రదర్శనలను వీక్షించాలని ఇఒ వికె శీనా నాయక్ భక్తులను కోరారు. ఈనెల 31న సివి రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా 110 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, అన్నదానం, 200 మందికి చీరల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## సిఎఫ్‌ఎంఎస్‌లో సమర్పించేందుకు

# ఫిబ్రవరి 10 తుది గడువు

విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బిల్లుల్ని సిఎఫ్‌ఎంఎస్‌లో సమర్పించేందుకు ప్రభుత్వం తాజాగా తుది గడువు ఇచ్చింది. ఈ గడువు నుంచి ఎవరెవరికి మినహాయింపు ఇస్తున్నారో కూడా వివరించింది. వారు తప్ప మిగిలిన వారంతా తమ బిల్లుల్ని సిఎంఎఫ్‌ఎస్ పోర్టల్‌లో నిర్ణీత గడువులోగా అప్ లోడ్ చేయాలని కోరింది. ఈ మేరకు ఆర్థికశాఖ ఇవాళ ఓ మెమో జారీ చేసింది. ఈ డెడ్ లైన్ నుంచి ఎవరెవరికి మినహాయింపు ఇచ్చారో కూడా వెల్లడించింది. ట్రెజరీలో బిల్లుల సకాల సమర్పణను నియంత్రించడానికి, 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేయబడిన రాబడికి అనుగుణంగా వ్యయాన్ని నియంత్రించడానికి, 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కసరత్తును సక్రమంగా సిద్ధం చేయడానికి, సిఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో బిల్లుల సమర్పణకు వచ్చే నెల 10వ తేదీని గడువుగా నిర్ణయించింది. వాచ్ ఆఫ్ అకౌంట్స్ 010, 020, 040, 060, 070, 130/134, 200/208, 200/209, 240/241, 280, 290, 300, 310/311, 370, 450, 560/561కు ఈ గడువు నుంచి మినహాయింపు ఇచ్చారు. ఎక్స్‌పెండిచర్ (నిర్బంధ వ్యయం), ప్రకృతి వైపరీత్యాలు, డిక్రీ చార్జీలు కోర్టు/ చట్టపరమైన అంశాలకు సంబంధించిన చెల్లింపుల బిల్లులన్నీ ఈ ఆంక్షల నుండి మినహాయించబడ్డాయి. డిటిఎ, పిఎఒ, సిఇఒ, ఎపిసిఎఫ్‌ఎస్‌ఎస్ ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రుణ సేవ బిల్లులు జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, కాంటింజెన్సీ ఫండ్, గౌరవ వేతనం, కార్పొరేషన్ల జీతాల బిల్లులు, చట్టపరమైన చెల్లింపులకు సంబంధించిన బిల్లులు (ఐటి, జిఎస్‌టి, మొదలైనవి), స్థానిక సంస్థలు తమ సొంత నిధులకు సంబంధించిన బిల్లులకు మాత్రం ఈ గడువు నుంచి మినహాయింపు ఇచ్చారు. లోక్‌భవన్, ఛార్జ్‌డ్ ఎక్స్‌పెండిచర్ (నిర్బంధ వ్యయం), ప్రకృతి వైపరీత్యాలు, డిక్రీ చార్జీలు కోర్టు/ చట్టపరమైన అంశాలకు సంబంధించిన చెల్లింపుల బిల్లులన్నీ ఈ ఆంక్షల నుండి మినహాయించబడ్డాయి. డిటిఎ, పిఎఒ, సిఇఒ, ఎపిసిఎఫ్‌ఎస్‌ఎస్ ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## డిసిపల్లిలో ఎసిబి అధికారుల సోదాలు

మర్రిపాడు (నెల్లూరు), జనవరి 29 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం డిసిపల్లి ఎస్సీ కాలనీలో విజయవాడ, కడప కు చెందిన స్పెషల్ ఎసిబి అధికారులు నల్లిపోగు రమణయ్య, నల్లిపోగు శ్రీనివాసులు ఇళ్ళలో గురువారం సోదాలు నిర్వహించారు. తిరుపతి జిల్లాకు చెందిన నల్లిపోగు తిరుమలేశు రేణిగుంటలోని సబ్‌రిజిస్టర్ ఆఫీస్‌లో పనిచేస్తుండగా కొన్ని అభియోగాల వలన అతని ఇంటిపై ఎసిబి దాడులు నిర్వహించారు. ఈదాడులకు సంబంధించిన వాటిలో డిసిపల్లిలోని తమ బంధువుల ఇళ్ళలో డాక్యుమెంట్లు ఉండడంతో కోర్టు ఆదేశానుసారం విజయవాడకు చెందిన ఎసిబి అధికారులు గురువారం తెల్లవారుజాము నుండి డిసిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన నల్లిపోగు శ్రీనివాసులు, నల్లిపోగు రమణయ్య ఇళ్ళల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎసిబి అధికారులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ఎం.వి.రమణయ్య, రమేష్, హరిబాబు, కడప ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు ఈ సోదాల్లో పాల్గొన్నారు.



## కోవూరును అభివృద్ధికి చిరునామాగా మారుస్తా

కోవూరు (నెల్లూరు), జనవరి 29 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఒకవైపు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తూనే మరోవైపు డ్రైన్లు, సిసి రోడ్లు, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలతో గ్రామాల రూపురేఖలు మారుస్తున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు పట్టణంలోని 13వ వార్డులలో రూ.18 లక్షలతో 14వ వార్డులో రూ.15 లక్షలతో సిసి రోడ్లు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ 20 నెలలకు ముందు ఎక్కడ చూసినా గుంతల రోడ్లు, అస్తవ్యస్తమైన డ్రైనేజ్ వ్యవస్థతో వున్న కోవూరు పట్టణం నేడు అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. కూటమి వచ్చాక విపిఆర్ ఫౌండేషన్ ద్వారా"క్లీన్ కోవూరు" పేరిట డ్రైనేజ్ కాలువలలో సిల్ట్ క్లియరెన్స్ నుంచి మొదలు పెట్టి దశల వారీగా రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అభివృద్ధిలో కోవూరును అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు.

## రైతు నుంచి రూ.4.60 లక్షలు దోచేశారు

సత్యవేడు, జనవరి 29 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కాదర్వేడు గ్రామం మాజీ సర్పంచ్ దశరథన్ నుంచి రూ.4 లక్షల 60 వేల నగదు బ్యాగ్‌ని కొందరు గుర్తు తెలియని దుండగులు లాక్కొని వెళ్లారు. ఈ సంఘటన సత్యవేడు పట్టణం గాంధీ విగ్రహం వద్ద గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సంభవించింది. తన పంట పొలంలో వచ్చిన వరి ధాన్యాన్ని ఇటీవల దశరథన్ వ్యాపారస్తులకు అమ్మేశారు. ఇందుకు సంబంధించి వ్యాపారస్తులు స్టేట్‌బ్యాంకు అకౌంట్‌కి నగదు జమ చేశారు. ఈ నేపథ్యంలో దశరథన్ ద్విచక్ర వాహనంపై స్టేట్‌బ్యాంకు చేరుకుని బ్యాంకు ఖాతా నుంచి రూ.4.60 లక్షలు డ్రా చేసుకుని బ్యాగులో ఉంచారు. బ్యాంకు వెలుపలకు వచ్చి ద్విచక్రవాహనం పెట్రోల్ ట్యాంక్‌పై నగదు బ్యాగు పెట్టి వాహనాన్ని నడుపుకుంటూ గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని అక్కడ రోడ్డు పక్కగా వాహనం ఆపారు. అదే సమయంలో బ్యాంకు నుంచే ద్విచక్రవాహనంపై దశరథన్‌ను అనుసరిస్తూ వచ్చిన ఇద్దరు దుండగులు నగదు బ్యాగును తస్కరించి ఉడాయించారు. దీంతో బాధితుడు దశరథన్ కుప్పకూలాడు. ఏకంగా రూ.4.60 లక్షలు దుండగులు తస్కరించడంపై కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ సాయినాథ్ చౌదరి వెంటనే స్పందించి స్టేట్ బ్యాంకు వద్దకు చేరుకుని అక్కడ సిసి కెమెరాల పుటేజిని పరిశీలించడంతో పాటు బ్యాంకు అధికారుల నుంచి పుటేజిని సేకరించారు. గాంధీ విగ్రహం చేరుకుని స్థానికులను విచారించారు. బాధితుడు దశరథన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్లు జైలు శిక్ష

సూళ్లూరుపేట, జనవరి 29 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు గుడ్ ట్రై మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా సూళ్లూరుపేట పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి లక్ష రూపాయలు జరిమానా విధిస్తూ నెల్లూరు ఫస్ట్ క్లాస్ ఎడిజె గురువారం తీర్పునిచ్చినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. సూళ్లూరుపేట పోలీసు సర్కిల్ పరిధిలో 2018 సెప్టెంబర్ 10వ తేదీన అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అప్పటి సీఐ కిషోర్‌బాబు 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులు తమిళనాడుకు చెందిన ఆర్.మహదేవన్, వెంకటేష్‌లను అరెస్ట్ చేశారు. ఈ కేసును నెల్లూరు ఫస్ట్ క్లాస్ ఎడిజె జడ్జి జి.గీత విచారణ జరిపి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్‌కె రఫీమాలిక్ వాదనలు వినిపించారు. కేసులో సమర్థవంతంగా పనిచేసిన నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు, అప్పటి సిఐ కిషోర్‌బాబు, ప్రస్తుత సిఐ ఎం.మురళీకృష్ణ, కోర్టు సిబ్బంది ఎస్‌కె ఖాజాహుస్సేన్, ఆర్.బ్రహ్మానందంను తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

## విమానయానంలో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేయండి

విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: భారత విమానయాన రంగంలో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేయడంపై తక్షణమే దృష్టి సారించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరారు. దేశంలో విమాన ప్రయాణాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, భద్రతాపరమైన చర్యలు కూడా అదే స్థాయిలో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. "భారత్‌లో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య ఏటా 10 నుంచి 12 శాతం పెరుగుతోంది. 2047 నాటికి దేశవ్యాప్తంగా 400 విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతు న్నప్పుడు, ఆ వృద్ధికి తగ్గట్టుగా విమాన ట్రాఫిక్ భద్రతను కూడా మెరుగు పరచాలి" అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనల వల్ల ప్రయాణికుల్లో భద్రతపై విశ్వాసం సన్నగిల్లుతోందని విజయసాయి రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)ను ఆధునీకీకరించాలని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)లో సిబ్బందిని, సాంకేతికతను బలోపేతం చేయాలని సూచించారు. విమానాల నిర్వహణలో లోపాలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కీలకమైన అంశంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.



సచివాలయంలో సిఎం చంద్రబాబుతో ఎమెస్కో విజయకుమార్

## గ్రంథాలయాలకు రూ.1.40 కోట్ల విలువైన పుస్తకాలు

విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రభుత్వ గ్రంథాలయాలకు రూ.1.40 కోట్ల విలువైన ప్రచురణలను అందించేందుకు ఎమెస్కో సంస్థ ముందుకొచ్చింది. ఎమెస్కో విజయకుమార్ సచివాలయంలో సిఎం చంద్రబాబును కలిసి ఈ విషయాన్ని తెలియజేశారు. రాష్ట్రంలోని గ్రంథాలయాలకు రూ.1.40 కోట్ల విలువైన ప్రచురణలను విరాళంగా అందించేందుకు తమ సంస్థ పాలక మండలి నిర్ణయం తీసుకున్నట్లు విజయకుమార్ తెలిపారు. ఈమేరకు పుస్తకాల జాబితాను సీఎంకు అందించిన విజయకుమార్ గ్రంథాలయాలకు ప్రచురణలు చేరేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేలా ఆ సంస్థను ఆదేశించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమెస్కో విజయకుమార్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. గ్రంథాలయాలు సమాజంలో జ్ఞాన విస్తరణకు కీలక పాత్ర పోషిస్తున్నాయని, పుస్తకాలు పంచడం అంటే జ్ఞానాన్ని పంచినట్లేనని అన్నారు. ప్రచురణల వితరణ ద్వారా విద్యార్థులు, ప్రజలకు మేలు జరుగుతుందని సీఎం అన్నారు.



మంత్రి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

## మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం: మంత్రి టిజి భరత్

సచివాలయం, జనవరి 29 ప్రభాతవార్త: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకారం అందిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ చెప్పారు. మంగళగిరిలోని ఏపిఐఐసి కార్యాలయంలో మంత్రి టిజి భరత్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి బోర్డు, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ లేడిస్ ఆర్గనైజేషన్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఏపి ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ సమక్షంలో ఫిక్కీఫ్లో జాతీయ అధ్యక్షురాలు పూనమ్ శర్మ, జాతీయ పాలకమండలి సభ్యురాలు ఉజ్వల సింఘానియా, జాతీయ పాలకమండలి సభ్యురాలు మౌర్య బోడా ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్‌పర్సన్ అమృతకుమార్, విజయవాడ చాప్టర్ సీనియర్ వైస్ చైర్‌పర్సన్ సుప్రియ మల్లినేని ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఎంతగానో ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రధానంగా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఎంతోకృషి చేస్తుందన్నారు.

## 301 బార్ లైసెన్సులకు రీనోటిఫికేషన్

విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: నూతన బార్ పాలసీ 2025-28 కింద రాష్ట్రవ్యాప్తంగా 301 ఓపెన్ కేటగిరీ బార్ లైసెన్సులను మళ్లీ నోటిఫై చేయాలని నిర్ణయించినట్లు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రకటించారు. డ్రా ఆఫ్ లాట్స్ విధానంలో ఇప్పటికే ఓపెన్ కేటగిరీలో 541 బార్లు, రిజర్వ్ కేటగిరీలో 84 బార్లు కేటాయించబడినప్పటికీ, 299 బార్లు ఇంకా కేటాయింపు పూర్తి కాలేదని చెప్పారు. గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున రెండు బార్లకు రీనోటిఫికేషన్‌కు అనుమతి ఇవ్వడంతో, మొత్తం 301 బార్లను మళ్లీ నోటిఫై చేయనున్నట్లు డైరెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. జిల్లాల వారీగా రీనోటిఫికేషన్ చేయనున్న బార్లలో ఎన్‌టీఆర్ (55), విశాఖపట్నం (52), గుంటూరు (42), ఎస్పీఎస్ నెల్లూరు (27), పల్నాడు (22), విజయనగరం (11), కృష్ణా (11), శ్రీకాకుళం (10), బాపట్ల (8), కాకినాడ (8), అనంతపురం (7), ఏలూరు (7), కడప (6), తూర్పు గోదావరి (5), కోనసీమ (5), చిత్తూరు (4), పీవీపీ మణ్యం (4), తిరుపతి (4), ప్రకాశం (3), అనకాపల్లి (2), కర్నూలు (2), శ్రీ సత్యసాయి (2), నంద్యాల (1), అన్నమయ్య (1) జిల్లాలు ఉన్నాయి. ఏఎస్ఆర్ పాడేరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ దశలో రీనోటిఫికేషన్ లేదు. డైరెక్టర్ శ్రీధర్ చమకూరి మాట్లాడుతూ, అప్లికేషన్ ప్రక్రియను అనుసరించి జిల్లా గెజెట్లలో బార్ల జాబితా ఇప్పటికే ప్రచురించామని, తదనుగుణంగా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవు తుందని తెలిపారు. ఆన్‌లైన్ / హైబ్రిడ్ / ఆఫ్‌లైన్ విధానాల్లో ఫిబ్రవరి 4, 2026 సాయంత్రం 6.00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 5న ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించబడతాయని, అదే రోజు ఎంపికైన వారికి తాత్కాలిక లైసెన్సుల మంజూరుపై సమాచారం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత జిల్లా ఎక్సైజ్ అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని డైరెక్టర్ శ్రీధర్ ఆదేశించారు.


## కూటమి ఎమ్మెల్యేలకు చట్టాలు వర్తించవా?




విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: మహిళలను కూటమి ఎమ్మెల్యేలు వేధిస్తున్నా వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం లేదని వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పేర్కొన్నారు. కనీసం కేసులు కూడా పెట్టడం లేదని తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై తక్షణం కేసు పెట్టాలన్నారు. బాధితురాలినే నిందితురాలిగా చేసే కుట్రలో భాగంగానే జనసేన నాయకులతో కమిటీ వేశారన్నారు. పోలీసులు, న్యాయ స్థానాలపై నమ్మకం లేక పార్టీ నాయకులతో కమిటీ వేశారా? చట్టాలను జనసేన నాయకులు పట్టించుకోరా? అని ప్రశ్నించారు. ఒక మహిళా ఉద్యోగి ఆవేదన, ఎమ్మెల్యే తప్పు చేసినట్లు కళ్లముందే ఆధారాలు కనిపిస్తుంటే ఇంకా ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై సిఎం, డిప్యూటీ సిఎం, హోంమంత్రి స్పందించాలన్నారు. అలాగే మంత్రి గుమ్మడి సంధ్యారాణి కొడుకుపైనా కేసు నమోదు చేయాలని కోరారు. ఇక రాష్ట్రంలో కీచక పర్వం సాగుతోందని వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. మహిళా ఉద్యోగిని ఎమ్మెల్యే వేధించినా పట్టించుకోవడం లేదని అన్నారు. హోమ్‌శాఖను వర్క్ ఫ్రమ్ హోంశాఖగా మార్చారని విమర్శించారు. మహిళకు అన్యాయం జరిగితే తిరిగి తిట్టడం అన్యాయమన్నారు. కాలయాపన కోసమే జనసేన త్రీమెన్ కమిటీ అని పేర్కొన్నారు.

## పొగాకు రైతుల పక్షాన పోరాడతాం

### - వైసిపి అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి



విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: పొగాకు రైతుల పక్షాన పోరాడతామని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సమస్య పరిష్కార దిశలో క్రియాత్మకంగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రభుత్వం వర్జీనియా పొగాకు, సిగరెట్లపై విధించిన అధిక ఎక్సైజ్ డ్యూటీతో పాటు జీఎస్టీ పెంపు నిర్ణయాల వల్ల తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామని ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గానికి చెందిన పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన రైతులు వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. పన్నుల భారంతో పొగాకు ఉత్పత్తుల ధరలు పెరగడంతో మార్కెట్లో డిమాండ్ గణనీయంగా తగ్గిపోయిందని రైతులు జగన్ దృష్టికి తీసుకువచ్చారు. ఫలితంగా పొగాకు కొనుగోళ్లు తగ్గి, రైతులకు గిట్టుబాటు ధరలు లభించక జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే రైతులు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపడుతూ, కేంద్ర ప్రభుత్వం పన్నుల తగ్గింపుపై పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. తమ ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాన్ని కూడా వైయస్ జగన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన వైయస్ జగన్ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తుందని భరోసా ఇచ్చారు. రైతుల దుస్థితిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో వైఎస్సార్సీపీ ఎంపీలు ఈ అంశాన్ని బలంగా లేవనెత్తి, రైతులకు న్యాయం జరిగేలా ప్రయత్నిస్తారని హామీ ఇచ్చారు. చింతలపూడి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కంభం విజయరాజు, ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షుడు సత్రం వెంకట్రావు, ఉపాధ్యక్షుడు అట్లూరి సతీష్, కార్యదర్శి సత్యనారాయణతో పాటు రైతు నాయకులు సత్తెనపల్లి వీర్రాజు, మచిలీపట్నం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు జెట్టి గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు బోధించాలి

### - ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు

### - ఆరోగ్యాలయాన్ని సందర్శించిన వైద్యాధికారులు

విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు బోధించేలా చర్యలు తీసుకోవాలని యోగా నేచురోపతి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అమరావతిలో కరకట్టపై ఉన్న మంతెన సత్యనారాయణ ఆరోగ్యాలయాన్ని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ, ఆయుష్ కమిషనర్ దినేష్ కుమార్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠారెడ్డి, ఇతర అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మంతెన సత్యనారాయణ రాజు వారితో జరిగిన సమావేశంలో ఖియోగా నేచురోపతి ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణఖి అంశంపై మాట్లాడారు. ప్రతిరోజూ 30 నిమిషాల యోగాభ్యాసం, 15 నిమిషాల ధ్యానం చేయడాన్ని పిల్లలకు జరిగే బోధన వేళల పట్టికలో చేర్చాలని సూచించారు. తగిన చర్యలు తీసుకోవడం ద్వారా మిల్లెటు ఆధారిత, ప్రొటీన్ సమృద్ధి ఆహారంతో ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని సాధించవచ్చునని తెలిపారు. యోగా నేచురోపతిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తాను పూర్తి స్థాయిలో సహకరిస్తానని అధికారులకు మంతెన సత్యనారాయణరాజు హామీ ఇచ్చారు. ఆరోగ్య రంగంలో తీసుకురావాల్సిన మార్పులు, అవగాహన, మౌలిక వసతుల కల్పన, విధానపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి మంతెన సత్యనారాయణ అధికారులకు ప్రజెంటేషన్ ఇచ్చారు.

## అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తాం

### ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా

విజయవాడ (గన్నవరం), జనవరి 29 ప్రభాతవార్త: జిల్లావ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇళ్ల కేటాయించటానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 46వ డివిజన్ లంబాడీపేటకు చెందిన కొండప్రాంత మహిళలు గురువారం కలెక్టర్‌ని కలిసి ఇళ్ళు కేటాయించాలని కోరారు. కొండప్రాంతంలో ఉంటున్న మహిళలు జాబితా తయారు చేసి కలెక్టర్‌కు ఇచ్చారు. తమకు ఇళ్ళు కేటాయిస్తే కొండప్రాంతాన్ని ఖాళీచేసి వెళ్ళిపోతామని తెలిపారు. ఈసందర భ్ంగా వారిని అభినందించిన కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పేదలందరకీ ఇళ్ళు ఇస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్ తక్షణమే కొండప్రాంత నివాసితుల సూచనలను పరిగణనలోకి తీసుకుని అర్హుల జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొంత నగదును సిద్దంగా ఉంచుకోవాలని సూచించారు.

### విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలి

రోజురోజుకీ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలని కలెక్టర్ లక్ష్మీశా అభిప్రాయపడ్డారు. బుధవారం ఓసంస్థ విద్యుత్ వాహనాన్ని కలెక్టర్ మార్కెట్‌లోకి విడుదల చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వినియోగించటం ద్వారా డబ్బు ఆదా అవుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు సులభ వాయిదాలపై విద్యుత్ వాహనాలు కొనుగోలు చేసి వినియోగించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు.

## శ్రీవారి ఆలయం ముందు చేసిన ఫొటో షూట్

# నూతన దంపతులు క్షమాపణ



తిరుమల, జనవరి 29 ప్రభాత వార్త: తిరువణ్ణామలైకి చెందిన తిరుమాల్ – గాయత్రీ దంపతులు ఇటీవల తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ వేదికలో వివాహం చేసుకున్నారు. వివాహానంతరం ఆలయ ప్రాంగ ణంలో ఫొటోగ్రఫీ చేయరాదనే నిబంధన తమకు ముందుగా తెలియకపోవడంతో, అనుకోకుండా కొన్ని ఫొటోలు తీసినట్లు వారు తెలిపారు. అయితే, ఇది ఆలయ నియమాలకు విరుద్ధమని తెలిసిన వెంటనే, ఆ ఫొటోలను పూర్తిగా తొలగించినట్లు వారు స్పష్టం చేశారు. ఈ అనుకోని తప్పు పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన సదరు దంపతులు, భక్తులను, టిటిడి అధికారులను హృదయపూర్వకంగా క్షమాపణలు కోరారు. తాము చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా, శ్రీవారి సేవా సేవ ద్వారా సేవలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని దంపతులు తెలిపారు. భక్తిసేవ ద్వారా తమ తప్పును పరిహరించుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆలయ సంప్రదాయాలు, నియమాలు ప్రతి భక్తుడూ తప్పనిసరిగా గౌరవించాల్సినవేనని, ఈ సంఘటన ద్వారా తాము గుణపాఠం నేర్చుకున్నామని తిరుమాల్ – గాయత్రీ దంపతులు పేర్కొన్నారు.

# రాయలసీమ సస్యశ్యామలం కావాలి

## దత్త పీఠం ఆధ్వర్యంలో భారీగా వన మహోత్సవం



మొక్కలు నాటి నీళ్ళు పోస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

అనంతపురం, జనవరి 29 ప్రభాతవార్త బ్యూరో: రాయలసీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా దత్తపీఠం అనంతపురం జిల్లాలోని రాప్తాడు మండలంలో గల జయలక్ష్మిపురం బొమ్మపర్తి నందు దత్త వనమోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వర్షాలు పెద్ద ఎత్తున కురుస్తాయని మైసూర్‌లోని దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. జయలక్ష్మి పురంలో దత్త వనమోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైసూరు దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీ విజయానంద తీర్థ స్వామీజీ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. జయలక్ష్మిపురం బొమ్మపర్తి పరిధిలో 100 ఎకరాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. అదేవిధంగా జయలక్ష్మిపురంలో దత్త క్రియాయోగ తరగతులను ప్రారంభించామని దీని ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ విజయానంద తీర్థ స్వామీజీ మాట్లాడుతూ దత్త పీఠం ఆధ్వర్యంలో యోగ నిర్వహించి ప్రజలందరికీ ఆరోగ్యం ఇవ్వాలన్నదే దత్తపీఠం లక్ష్యమన్నారు. గురువారం సాయంత్రం దత్త భక్తులకు స్వామీజీ దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్ష దైవం శిరిడి సాయి సినిమా షిరిడి సాయిబాబా పాత్రధారి మచ్చా రామలింగారెడ్డి కుటుంబ సమేతంగా స్వామీజీని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. మైసూరు దత్తపీఠం నుంచి ట్రస్ట్ సభ్యులు శ్రీనాథ్ స్వామీజీ, ట్రస్టు సభ్యులు నారాయణ శర్మ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

## సిడబ్ల్యూసి సభ్యుడు రఘువీరారెడ్డి

మడకశిర టౌన్, జనవరి 29 ప్రభాతవార్త: గాంధీజీ ఆశయాలు భావితరాలకు ఎంతో అవసరమని అతను చూపిన అహింస, సత్యాగ్రహం దేశ భవిష్యత్తుకు పునాది అని అలాంటి గాంధీజీ నిరంతరం స్మరిస్తూ అతని ఆశయాల అడుగుజాడల్లో నడవాలని సిడబ్ల్యూసి సభ్యుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. గురువారం బుల్ల సముద్రం నుండి పాదయాత్రను రెండవ రోజు ప్రారంభించారు. రఘువీరారెడ్డితో కలిసి మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి మద్దతిస్తూ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బుళ్ళ సముద్రంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు గాంధీజీ ఆశయాలను వివరించారు. గాంధీజీ ని ప్రపంచ దేశాలే శాంతి దూతగా అభివర్ణించి అతని స్ఫూర్తిని ఎంతోమంది దేశాలే కొనియాడుతున్నప్పుడు భారత దేశంలో గాంధీని తూలనాడడం సమంజసమేనా అని ఆయన ప్రశ్నించారు. గాంధీజీ చరిత్రను మనం మన తరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు నేడు గాంధీజీ ఔన్నత్యం చాటి చెప్పడం కోసమే తాను పాదయాత్ర చేపట్టానని గాంధీజీపై రచించిన పుస్తకాలను కూడా విద్యార్థులకు ఉచితంగా అందిస్తానని కూడా పేర్కొన్నారు. రెండవ రోజు పాదయాత్ర ముగిసేటప్పటికీ సాయంత్రానికి సేవ మందిరంకు చేరుకున్నారు రఘువీరారెడ్డితో పాటు అతని శ్రీమతి సునీత రఘువీర్, కుమార్తె అమృత్ కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ యాత్రలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రామకృష్ణ యాదవ్, ఏఐసీసీ సభ్యుడు కేటీ శ్రీధర్, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మండల కన్వీనర్ మంజునాథ్, డాక్టర్ రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రతి మత్స్యకారుడు పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే సంకల్పం
- మత్స్యకార సొసైటీల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఆక్వా రంగంలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యం
- మంత్రులు కొల్లు రవీంద్ర, సవిత, అచ్చెన్నాయుడు



విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్ కాఫ్) నూతన చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ మాట్లాడుతూ.. మత్స్యకార గ్రామాల్లో పర్యటించి, వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుల, మతాలకు అతీతంగా కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై, ముఖ్యంగా మత్స్యకార సామాజిక వర్గం ఎదుర్కొన్న సమస్యలపై అనేక పోరాటాలను చేసానన్నారు. అధిష్ఠానం, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సవిత సూచనల మేరకు, సమైక్య 13 జిల్లాల మత్స్యకార సంఘాల మద్దతుతో మత్స్య సహకార సంఘాల సమైక్య చైర్మన్‌గా ఏకగ్రీవంగా తనను ఎన్నుకోవడం జరిగిందన్నారు. స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రం లో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్ కాఫ్) చైర్మన్, పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రతి మత్స్యకారుడిని ఒక పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి మత్స్యకారుడు పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రానికి అతిపెద్ద తీర ప్రాంతం ఉందని అత్యంత ఎక్కువ నీటి వనరులు ఉన్నాయని. అటువంటి ఆఫ్ కాఫ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, ఈరోజు ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ యాటగిరి రాంప్రసాద్, ఉపాధ్యక్షులు బి. రంగారావు అభినందనీయులన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 972 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, లక్షలాది కుటుంబాలు మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 217 మత్స్యకారుల ప్రయోజనాలకు విరుద్ధమని, దానిపై పోరాడి ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసెంబ్లీలో తీర్మానం ద్వారా దానిని రద్దు చేసామన్నారు. మత్స్యకారుల కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసామన్నారు. వేట నిషేధ కాలంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని 2019లోనే ప్రభుత్వం ప్రారంభించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక కార్పొరేషన్లకు కొత్త నాయకత్వం వచ్చిందని, పదవులను కేవలం అలంకారప్రాయంగా చూడకుండా సామాజిక వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ.. తెలివికి, ధైర్యానికి మారుపేరు మత్యకారులని, సముద్రంతో పోరాడి చేపలను వేటాడి సమాజానికి అందించే మత్స్యకారుల ధైర్యాన్ని, కృషిని మంత్రి అభినందించారు. మత్స్యకారులు ఎప్పటి నుంచో తమ ప్రభుత్వానికి అండగా ఉంటున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వారు చేసిన కృషి అమోఘమని పేర్కొన్నారు. బీసీలంటే తమ ప్రభుత్వమని.. దివంగత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి రామారావు చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, బీసీల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. మత్స్యకారుల భృతిని 10,000 నుండి 20,000కు పెంచామన్నారు. గతంలో 9 మత్స్యకార గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి, అందులో 47 రిజర్వేషన్లు మత్స్యకార బిడ్డలకే ఇచ్చామని గుర్తు చేశారు. డీజిల్ సబ్సిడీ, వలలు, పడవలు, ఐస్ బాక్స్‌లు, మోపెడ్లపై సబ్సిడీలను అందిస్తున్నట్లు తెలిపారు. చేపల పెంపకం, విక్రయాల్లో మహిళలకు సబ్సిడీ అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. చేపలు, రొయ్యలు వంటి ప్రోటీన్ ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ, ఉత్పత్తితో పాటు వినియోగాన్ని కూడా పెంచాలని పిలుపునిచ్చారు. మత్స్యకారులందరూ ఈ కూటమి ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా ఉండాలని మంత్రి తెలియజేశారు.

రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల అభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వానికి మత్స్యకార సామాజిక వర్గం అంటే ఎంతో ఇష్టమని, స్వాతంత్రం వచ్చిన 35 ఏళ్ల వరకు మత్స్యకారులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, కానీ దివంగత స్వర్గీయ ముఖ్యమంత్రి యన్.టి రామారావు నుండి వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు లభించిందని గుర్తుచేశారు. గత 44 ఏళ్లుగా కష్ట సుఖాల్లో మత్స్యకారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి వెన్నంటి ఉంటున్నారని పేర్కొన్నారు. మత్స్యకార గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత తమదేనని, ఈ విషయాలను నేటి యువతకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రానికి సుదీర్ఘ తీరప్రాంతం ఉందని, మన రాష్ట్ర ప్రజలు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తమ కష్టార్జితంతో అభివృద్ధి సాధిస్తూ రాష్ట్రాన్ని గర్వపడేలా చేస్తున్నారని అభినందించారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేసిందని, కేంద్ర నిధులను దారి మళ్లించి, కనీసం డీజిల్ సబ్సిడీ, ప్రమాద బీమా వంటివి కూడా సరిగ్గా అందించలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని, ఇప్పటికే పెండింగ్లో ఉన్న నష్ట పరిహారాలను విడుదల చేశామని తెలిపారు.

రాబోయే మూడేళ్లలో మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరగాలని, ఆక్వా రంగంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండేలా అందరం కలిసి పని చేయాలన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఆర్థికంగా బలోపేతం కాగలమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలియజేశారు.

రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 240 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. మత్స్యకారులకు, ఆక్వా కల్చర్ రైతులకు వలలు, ఐస్ బాక్సులు, బోట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ప్రధాన మంత్రి మత్య సంపద యోజన పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలతో మేలు చేకూరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యులు రెడ్డప్పగారి మాధవిరెడ్డి, అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాపారావు, బెస్త కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్, జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# రాజధానికి భూములిచ్చిన రైతులకు ఊరట

- కేటాయించిన ప్లాట్లకు వీధి పోట్ల సమస్యకు పరిష్కారం
- 112 ప్లాట్లు గుర్తింపు... త్వరలో కేటాయింపు: సిఆర్‌డిఎ




రైతులకు ప్లాట్ల కేటాయింపు దస్త్రాలు అందజేస్తున్న సిఆర్‌డిఎ అధికారులు (ఫైల్ ఫొటో)

విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్తప్రతినిధి: రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాజధానికి భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్లకు వీధి పోట్ల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. త్రిసభ్య కమిటి ఇచ్చిన సూచన మేరకు రైతులకు వేరే ప్రాంతాల్లో ప్లాట్ల కేటాయింపు కోసం అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీధి పోట్లు ఉన్న ప్లాట్లు, చిన్న రోడ్డు నుంచి పెద్ద రోడ్డుకు మారడం లేదా సమాన వెడల్పు రోడ్ల వల్ల తమకు అన్యాయం జరిగిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయని, మ్యూటేషన్ కాని 112 ప్లాట్లను అధికారులు గుర్తించారు. ఆ ప్లాట్లకు బదులు వేరే చోట వాస్తు ప్రకారం ప్లాట్లు కేటాయించనున్నట్లు సీఆర్డీఏ ఓ ప్రకటనలో తెలిపింది. రాజధానిలోని సీడ్ యాక్సిస్ రహదారికి భూములిచ్చిన ఉండవల్లి గ్రామానికి చెందిన 16 మంది రైతులకు ప్లాట్ల కేటాయించారు. రాయపూడిలోని ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో ఈ లాటరీ విధానం ద్వారా 21 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరతిగతిన పూర్తి చేసుకోవాలని అధికారులు కోరారు. అదేవిధంగా రాజధాని గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం గ్రామసభలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉద్దండరాయుని పాలెం, వెలగపూడి, వెంకటపాలెంలో గ్రామసభలు జరుగుతున్నాయి. ఈ గ్రామసభల్లో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజధాని గ్రామాల అభివృద్ధిపై గ్రామస్థులు ఇచ్చిన అభిప్రా యాలను మంత్రి నారాయణ తీసుకున్నారు. అలాగే భూము లుచ్చిన రైతుల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, అమరావతి నిర్మాణానికి రూ.48 వేల కోట్లతో టెండర్లు పిలిచాం. అమరావతిలో 350 కి.మీ ట్రంక్ రోడ్లు, 1500 కి.మీ లేఅవుట్ రోడ్ల పనులు, క్వార్టర్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ నాటికి అధికారులు, ఉద్యోగులకు 3500 ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. రాజధాని నిర్మాణంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక వేశాం. 29 గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మిస్తాం. వర్షాకాలం నాటికి అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన చేస్తాం అని మంత్రి నారాయణ తెలిపారు. ఈ లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయింపు: కొద్దిరోజుల కిందటే భూ సమీకరణ కింద రాజధాని నిర్మాణం కోసం తమ భూములు ఇచ్చిన తాడేపల్లి మండలం ఉండవల్లి, పెనుమాక గ్రామ రైతులకు సీఆర్డీఏ అధికారులు ఈ లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించారు. 2015 నుంచి రాజధాని నిర్మాణానికై భూములు అందజేసిన ఉండవల్లి గ్రామానికి చెందిన 195 మంది రైతులకు సీఆర్డీఏ అధికారులు 381 నివాస, వాణిజ్య ప్లాట్లను కేటాయించారు. ఈ లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రయల్ రన్ వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు.

# రూ.6 వేల కోట్ల ట్రాన్స్‌కో ప్రాజెక్టులు

- సత్వరమే పూర్తి చేయాలి
- భవిష్యత్తు విద్యుత్ అవసరాలను అందుకోవాలి
- డిమాండ్‌కు తగిన విధంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలి
- ట్రాన్స్ కో ప్రాజెక్టుల సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్



విజయవాడ, జనవరి 29 ప్రభాతవార్త ప్రతినిధి: ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.6 వేల కోట్లతో చేపట్టిన వివిధ విద్యుత్ ప్రాజెక్టులను నిర్ణీత కాల వ్యవధిలోపు పూర్తి చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉన్న ట్రాన్స్ కో ప్రాజెక్టుల పురోగతిపై సచివాలయంలో గురువారం నాడు సమీక్ష నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధ్యక్షతన జరిగి ఈ సమీక్ష సమావేశంలో సీఎస్ విజయానంద్, టాన్స్ కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్ పాల్గొన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వివిధ ట్రాన్స్ కో ప్రాజెక్టుల వివరాలను అధికారులను మంత్రి గొట్టిపాటి అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభించి పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను కూడా అధికారులు మంత్రికి తెలిపారు. పాత ప్రాజెక్టులతో పాటు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను అన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను అందుకునే విధంగా ప్రాజెక్టులన్నీ నిర్ణీత కాల వ్యవధిలో కాంట్రాక్టర్లు పూర్తి చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం, ఉత్పత్తి, సరఫరా వంటి అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి సూచించారు.

సీఆర్డీఏ పరిధిలో అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఆ పనులను కూడా శాకాధికారులతో సమన్వయం చేసుకుని విద్యుత్ శాఖ అధికారులు ముందుకు సాగాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఉత్తమ స్థాయిలో టాన్స్ మిషన్ నెట్ వర్క్‌ను ఏర్పాటు చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో కీలక సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకొచ్చామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వివరించారు. ప్రజలు, రైతులతో పాటు వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయాలనే లక్ష్యంతో పని చేయాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి దిశా నిర్దేశం చేశారు. మరో రెండు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6 ట్రాన్స్ కో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ట్రాన్స్‌కోకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# టెక్సాస్‌లో హెచ్1బి వీసా దరఖాస్తులు నిలిపివేత!

ఆస్టిన్(టెక్సాస్), జనవరి 29: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అమలులోకి తీసుకొచ్చిన హెచ్1బి వీసా ప్రోగ్రామ్‌పై టెక్సాస్ విస్తృతమైన ఆంక్షలను విధించింది. ఆ రాష్ట్ర గవర్నర్ గ్రెగ్ అబాట్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త హెచ్ 1బీ వీసా దరఖాస్తులను తక్షణమే నిలిపివేశారు. ప్రభుత్వ నిధులు, ఉద్యోగాలను అమెరికన్ వర్కర్లు, ప్రొఫెషనల్స్‌కు కేటాయించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు, విశ్వవిద్యాల యాలను ఈ ఉత్తర్వుల పరిధిలోకి తీసుకొచ్చారు. గ్రెగ్ అబాట్ రిపబ్లికన్ గవర్నర్ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నిలిపివేత 2027 మే 31 వరకు అమలులో ఉంటుంది. ఈ నిర్ణయంతో హెచ్1బీ వీసా కార్యక్రమంపై ఇలాంటి ఆంక్షలను విధించిన మొదటి అమెరికన్ స్టేట్ గా నిలిచింది టెక్సాస్ నిలిచింది. ఫెడరల్ హెచ్1బి వీసా ప్రోగ్రామ్ దుర్వినియోగమవుతోందంటూ వచ్చిన నివేదికలు, అమెరికన్ ఉద్యోగాలు స్థానికులకు మాత్రమే లభ్యమ య్యేలా చూసేందుకు ఫెడరల్ ప్రభుత్వం ఆ ప్రోగ్రామ్‌ను సమీక్షిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అబాట్ తెలిపారు. కొత్త హెచ్1బి వీసా దరఖాస్తులను తక్షణమే నిలిపివేయాలని రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీలను ఆదేశిస్తున్నట్లు చెప్పారు.

హెచ్ 1బీ వీసా కార్యక్రమం కింద ప్రత్యేక నైపుణ్యాలు అవసరం అయ్యే ఉద్యోగాల కోసం విదేశీ నిపుణులను నియమించుకోవడానికి ఆయా సంస్థల యజమానులకు అనుమతిస్తుంది. ఈ వీసా ప్రోగ్రామ్ దుర్వినియోగమోతోందని అర్హత కలిగిన స్థానిక కార్మికులు/నిపుణులు ఇక్కడే అందుబాటులో ఉన్నప్పటికీవారిని నియమించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వట్లేదని, కృత్రిమ కొరతను సృష్టించి, విదేశీయులను నియమించుకుం టోన్నాయని, వీటిని రెగ్యులరైజ్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కొన్ని చోట్ల అమెరికన్ నిపుణులను తీసివేసి, తక్కువ జీతాలకే హెచ్1బి ఉద్యోగులను నియమించినట్లు రిపోర్టులు అందాయని పేర్కొన్నారు.

# విమానంలో బ్లాక్‌బాక్స్ స్వాధీనం



**బారామతి, జనవరి 29:** అజిత్‌పవార్ ప్రయాణంచేసిన విమాన ప్రమాదానికి సంబంధించి దర్యాప్తులో బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనంచేసుకున్న దర్యాప్తు అధికారులు ప్రస్తుతం ప్రమాద కారణాలను విశ్లేషిస్తున్నారు. బ్లాక్‌బాక్స్ విశ్లేషణలోనే పైలట్లు ఓషిట్ అన్న చివరి మాటలు రికార్డయ్యాయి. అలాగే విమానంలో ఆధునిక వ్యవస్థగా భావిస్తున్న గగన్ వ్యవస్థలేదని కూడా నిర్ధారించారు. అయితే విమానం కూలిపోవడానికి పైలట్ నిర్ణయం, ప్రతికూల వాతావరణమే కారణమని ఏఏఐబీ ప్రాథమికంగా గుర్తించింది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) నిర్వహించిన ప్రాథమిక దర్యాప్తులో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రతికూల వాతావరణంలో విమానాన్ని ల్యాండ్ చేసే క్రమంలో పైలట్ తీసుకున్న తప్పుడు నిర్ణయం ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా అధికారులు భావిస్తున్నారు. విమాన ప్రమాదం జరిగిన సమయంలో బారామతిలో పొగమంచు వల్ల విజిబిలిటీ చాలా తక్కువగా ఉందని విమానాన్ని పూణేకు మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ పైలట్ బారామతిలోనే ల్యాండ్ చేయడానికి మొగ్గు చూపారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. చివరి నిమిషంలో కరెక్షన్ జరిగిందని తేల్చారు. మొదటి ప్రయత్నంలో రన్‌వే కనిపించక గో అరౌండ్ చేసిన పైలట్లు రెండోసారి ల్యాండ్ అయ్యేందుకు ప్రయత్నించారు. అయితే విమానం వేగం పొజిషన్ సరిగ్గా లేకపోవడంతో చివరి నిమిషంలో దాన్ని సరిచేయడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు. దాని వల్లే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొంటున్నారు. ఇక ఘటనా స్థలం స్వాధీనం చేసుకున్న బ్లాక్ బాక్స్ ప్రకారం ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు పైలట్లు "ఓ షిట్" అని అరిచినట్లు అందులో రికార్డ్ అయింది. అంటే ప్రమాదాన్ని ముందే ఊహించినప్పటికీ దాన్ని నివారించలేకపోయారని అర్థం అవుతోంది. ఈ విమానంలో ఆధునిక నావిగేషన్ వ్యవస్థ గగన్ లేకపోవడం కూడా పైలట్లు రన్‌వేను గుర్తించడంలో ఇబ్బంది పడటానికి ఒక కారణమని తెలుస్తోంది.

# ప్రపంచానికి భారత్ ఆశాకిరణం

- ఇయు డీల్‌ను ప్రశంసించిన ప్రధాని మోడీ
- వికసిత్ భారత్ 2047 సాధన దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టీకరణ
- తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడంపై నిర్మలాసీతారామన్‌ను అభినందించిన మోడీ



**న్యూఢిల్లీ, జనవరి 29:** 21వ శతాబ్దంలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య బలంపై ప్రపంచానికి పెరుగుతున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని తెలిపారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. భారత్ – యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ), "ఆశావహ, ఆత్మవిశ్వాస, ఆత్మనిర్భర్ భారత్" స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా భారతదేశానికి, ముఖ్యంగా యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. 'భారత్, యూరప్ మధ్య ఈ చారిత్రాత్మక ఒప్పందం కుదిరినప్పుడు మన పారిశ్రామికవేత్తలు, తయారీదారులు కేవలం పన్నుల తగ్గింపు గురించే ఆలోచించ కూడదు. ఇది నాణ్యతను చాటుకోవాల్సిన గొప్ప అవకాశం. ఇప్పుడు మార్కెట్ మన కోసం తెరుచుకుంది. అత్యుత్తమ నాణ్యతతో యూరప్‌లోని 27 దేశాల హృదయాలను మనం గెలుచుకోవాలి. ఇది దీర్ఘకాలంలో మనకు ఎంతో మేలు చేస్తుంది' అని ప్రధాని వివరించారు. ఈ ఒప్పందం ద్వారా భారత రైతులు, యువత, సేవల రంగంలోని నిపుణులకు ప్రపంచ మార్కెట్లలో గణనీయమైన అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అనుసరిస్తున్న 'రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్' (సంస్కరణ, పనితీరు, మార్పు) విధానాన్ని ఆయన మరోసారి స్పష్టం చేశారు. భారత్ ఇప్పుడు 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' మీద ప్రయాణి స్తోందని.. అభివృద్ధి పథంలో దేశం వేగంగా దూసుకు పోతోందని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు.

2047 లక్ష్యం దిశగా అడుగులు

ప్రస్తుత బడ్జెట్ సమావేశాల ప్రాముఖ్యతను వివరిస్తూ.. 21వ శతాబ్దంలో మొదటి పావు భాగం ముగిసిందని, ఇప్పుడు రెండో పావు భాగం ప్రారంభమైందని ప్రధాని గుర్తు చేశారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని చేరుకోవడానికి రాబోయే 25 ఏళ్లు అత్యంత కీలకమని, ఆ దిశగా ఈ బడ్జెట్ బలమైన పునాది వేస్తుందని ఆయన పేర్కొన్నారు. దేశం ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడి, శాశ్వత పరిష్కారాల మార్గంలో భారత్ బలోపేతం అవుతోందని మోడీ వివరించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం మానవతా దృక్పథంతోనే ఉంటుందని ప్రధాని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలు ఓ చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కాబోతున్నాయని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. వరుసగా 9వ సారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న తొలి మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించబోతున్నారని, దేశ పార్లమెంటరీ చరిత్రలో ఒక గర్వకారణమైన క్షణమని ప్రధాని అభివర్ణించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటులో చేసిన ప్రసంగం 140 కోట్ల మంది భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబించిందని కొనియాడారు. దేశాభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఎంపీలందరూ నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని ప్రధాని కోరారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే

## మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బిజెపిని గెలిపించాలి

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, స్కాంల విషయంలో కాంగ్రెస్ - బిఆర్ఎస్ పార్టీల మధ్య తీసుకుంటున్న నిర్ణయాలు, వ్యవహార శైలి ఒకే విధంగా కొనసాగుతు న్నాయన్న విషయం స్పష్టంగా కనిపిస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్ పాలనలో గొర్రెల పంపిణీ స్కాం జరిగిందని ఆరోపణలు వచ్చాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, ఆ స్కాంపై ఇప్పటివరకు ఎలాంటి సమగ్ర విచారణ జరగడం లేదన్నారు. కోల్ బ్లాక్ విషయంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వంలో కొనసాగిన అదే కాంట్రాక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని, కేవలం కాంట్రాక్టర్లు, మంత్రివర్గం మారాయి తప్ప విధానం మాత్రం అలాగే కొనసాగుతుందని, కమిషన్ల ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో కూడా నిజమైన విచారణ జరగడం లేదన్నారు. గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్కాంల విషయంలో ఒకే ధోరణితో వ్యవహరిస్తున్నాయన్న విషయాన్ని ప్రజలు గమనించాలి.ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కాంలపై 100 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి, కెసిఆర్‌ని జైలుకు పంపిస్తామని, అక్కడ డబుల్ బెడ్రూమ్ ఇల్లు కట్టిస్తామని మాటలు చెప్పారు. కానీ ఇప్పుడు కేవలం సిట్ విచారణ పేరుతో కాలయాపన చేస్తూ, ప్రధాన నిందితులను కాపాడుతున్నారు తప్ప ఏ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు అన్నారు. కాళేశ్వరం స్కాం సహా అన్ని అవినీతి కేసులపై తన వద్ద ఆధారాలున్నాయని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదు అన్నారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం వంటి అన్ని అవినీతి కేసులపై సిట్టింగ్ జడ్జితో జ్యుడిషియల్ ఎంక్వైరీ జరగాలని బిజెపి డిమాండ్ చేస్తోంది.త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా బిజెపి లేదని కొందరు, బిజెపి మత పార్టీ అని మరికొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.బిజెపికి పెరుగుతున్న ప్రజాదరణను అడ్డుకోవడానికి కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు ఇలాంటి నాటకాలు చేస్తున్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికల్లో గతంలో 163 సర్పంచ్ స్థానాలు మాత్రమే గెలిచిన బిజెపి, ఇటీవల ఎన్నికల్లో సుమారు వెయ్యి సర్పంచ్‌లు, పదివేల వార్డు మెంబర్లు, 1200 ఉపసర్పంచ్ స్థానాలను గెలుచుకుందన్నారు. బిఆర్ఎస్‌కాంగ్రెస్ పార్టీల దోపిడీ విధానం ఒకటే. ప్రజలను మోసం చేయడంలో రెండూ ఒకేవిధంగా ఉన్నాయి. అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి, బిజెపిని గెలిపించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాధవి, ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్, పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, విఠల్, కన్నర ప్రసాద్, సునీతలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపుదారులకు చట్టబద్ధ రక్షణ కల్పిస్తున్న కాంగ్రెస్

### బిజెపి ముఖ్య అధికారప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారాయని బిజెపి ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ మండిపడ్డారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఇచ్చిన ఓటు తీర్పును బహిరంగంగా అవహాస్యం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో పాటు ఒకదాని తర్వాత ఒకదాన్ని కొట్టివేయడం ద్వారా ఫిరాయింపుదారులకు చట్టబద్ధ రక్షణ కల్పిస్తుందని మండిపడ్డారు. ఇది ప్రజలు ఓటు విలువను నాశనం చేసే ప్రమాదకర ధోరణి అని సుప్రీంకోర్టు ప్రకటనలు సైతం గడువులు ఇవ్వడం, చివరికి ఇది చివరి అవకాశం అని హెచ్చరించడం ద్వారా, అత్యున్నత న్యాయస్థానం స్పీకర్ వ్యవస్థ రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు సూచించింది. ఇది తెలంగాణలో ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, రాజీవ్‌గాంధీ హయాంలో వచ్చిన యాంటీడిఫెక్షన్ చట్టాన్ని కూడా ఉల్లంఘిస్తున్నారని, 1985లో 52వ రాజ్యాంగ సవరణ ప్రకారం, పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2018 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ 12 మంది ఎమ్మెల్యేలను బిఆర్ఎస్‌లో చేర్చింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత, 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఈ 10 మంది ఎమ్మెల్యేలు మేము ఇంకా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే అని చెప్పడం, కానీ పార్టీ కోర్ కమిటీ సమావేశాలకు పిలవక పోవడం, అధికారిక కార్యక్రమాల్లో కనిపించకపోవడం, ప్రజలు మభ్యపెట్టే చర్య మాత్రమే అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు నిజంగా నిజాయితీ ఉంటే, తమ పదవిని రాజీనామా చేసి మళ్లీ ప్రజల్లోకి వెళ్లాలి. ప్రజల ఓటు తీర్పు కోరాలన్నారు.

## మేడారం భక్తులకు ఆర్టీసీ మెరుగైన రవాణా సేవలు

### ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రెండేళ్లకొకసారి నిర్వహించే అతిపెద్ద గిరిజన జాతర మేడారానికి వెళ్లే భక్తుల కోసం ఆర్‌టిసి సంస్థ అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. వివిధ ప్రాంతాల నుంచి జాతరకు పోటెత్తే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌టిసి ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేక రవాణా ఏర్పాట్లతో సేవల్ని అందిస్తోంది. ఆర్‌టిసి సంస్థ ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాలి సంస్థ వైస్‌ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి యంత్రాంగం చేప ట్టిన రవాణా సౌకర్య సేవల్ని గురువారం స్వయంగా పరిశీలించారు. ఉప్పల్ నుంచి మేడారం వెళ్లే దారిలోని కొన్ని ప్రధాన పాయింట్లను పర్యవేక్షి ంచారు. మేడారం మహాజాతరకు వెళ్లే భక్తుల పిల్లల భద్రత కోసం ఉప్పల్ బస్టాప్, హన్మకొండ బస్టాండులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సురక్షి త కేంద్రాలలో పిల్లలకు గుర్తింపు ట్యాగులను వేస్తున్న విధానాన్ని పరిశీలించి.. స్వయంగా పిల్లలకు ట్యాగులు వేశారు. మేడారం వెళ్లే సమయంలో పిల్లలు తప్పిపోకుండా ఉండేందుకు ఈ సురక్షి త చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. హన్మకొండ బస్టాండులో క్యూలైన్లను పరిశీలించి అక్కడ ప్రయాణికులతో మాట్లాడుతూ రవాణా సేవలను అడిగి తెలుసు కున్నారు. సౌకర్యవంతమైన రవాణా సేవలకై ఆర్‌టిసి తీసు కుంటున్న చర్యల పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. ఎండీ నాగిరెడ్డితో పాటు కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమాన్, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట విద్యార్థుల ధర్నాలో పాల్గొన్న ఎంపి ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్ తదితరులు

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

### ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 29, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 14 లక్షల మంది కళాశాల విద్యార్థుల ఫీజులు బకాయిలు 800 కోట్లు వెంటనే చెల్లించాలని, వంద బిసి కళాశాల హాస్టళ్లు, 119 బిసి గురుకులాలు మంజూరు చేయాలని, గురుకుల పాఠశాలల్లో 20 శాతం సీట్లు పెంచాలని డిమాండ చేస్తూ అనేకమంది విద్యార్థులు గురువారం ట్యాంక్‌బండ్ వద్ద గల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు బిసి నాయకుడు మోదీ రాందేవ్ నాయకత్వంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నాలో ముఖ్యఅతిధిగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు ఫీజుల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పథకాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని, ఫీజులు కట్టమని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై వత్తిడి చేస్తు న్నారని, హాల్ టిక్కెట్లు, సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని, విదేశాల్లో చదువు కోవడానికి అవకాశం వచ్చినప్పటికి వారికి సర్టిఫికేట్లు లేక వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫీజుల బకాయిల, స్కాలర్‌షిప్‌ల బకాయిలను చెల్లించాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

# స్ఫూర్తిదాయకం..'తెలుగుజాతికి భూషణాలు'

## తెలుగు వెలుగులను పరిచయం చేసిన ఉత్తమ గ్రంథం: వెంకయ్యనాయుడు



తెలుగుజాతికి భూషణాలు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రమణాచారి, పద్మనాభయ్య, పార్వతీశం, రఘురామ్ తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 29, ప్రభాతవార్త :** భారతదేశ అత్యున్నత పురస్కారాలైన భారతరత్న, పద్మ అవార్డులు పొందిన తెలుగువారి జీవిత సంగ్రహమే డా. రేవూరు అనంత పద్మనాభ రావు రచించిన తెలుగుజాతికి భూషణాలు గ్రంథ మని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఈ భూషణాల వివరాలు వార్తాపత్రికల్లో కొంత వరకు వచ్చినా వివరంగా రాదు కనుక ఈ గ్రంథం వారి జీవితాలు, వారు చేసిన మంచిపనుల గురించి విశ్లేషించిన తీరు అభినందనీ యమని, ఈ గ్రంథం ఎంతగానో ఉపయుక్తంగా, మార్గదర్శిగా, స్ఫూర్తిదాయకం గా ఉంటుందని, ప్రతిఒక్కరూ తప్పక చదివి తెలుసుకోవాలని, ఇతరులకు అందించాలని ఆయన సూచించారు. అనంత పద్మనాభరావు 80 యేళ్ల వయస్సులోని ఎన్నో అనుభవాలు, నేర్చుకున్న అంశాలు, పొందిన విజ్ఞానాన్ని ఇతరులతో పంచుకుని భవిష్యత్ తరాలకు అందించాలన్న స్ఫూర్తిని తన రచనల ద్వారా చక్కగా పాటించారన్నారు. ఇలాంటి మహోన్నత వ్యక్తుల నుండి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు.

నేటితరం సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల బారి నపడి విచక్షణ, విజ్ఞానాన్ని కోల్పోయి నానా అనర్థాలకు దారితీస్తున్న విషయం మనందరికీ విదితమేనని, ఈ తరుణంలో వీటిని సంస్కరించాల్సిన అవసరం ప్రభుత్వాలు, విజ్ఞానవంతులైన మనందరిపైనా ఉందని వెంకయ్యనాయుడు హితవు పలికారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలోనబొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో గురువారంరాత్రి తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహా దారు డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన గ్రంథావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు గౌరవ అతిథులు పద్మభూషణ్ కె.పద్మనాభయ్య, డా. ఓలేటి పార్వతీశం, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి ప్రముఖ రచయిత, విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్ డా. రేవూరు అనంతపద్మ నాభరావు అసీతిని పురస్కరించుకుని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి తెలుగుజాతికి భూషణాలు గ్రంథాన్ని ఆవిష్కరించారు.

ముందుగా గ్రంథ రచయిత అనంతపద్మనాభ రావు, శోభాదేవి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డా. రేవూరు అనంతపద్మ నాభరావు సమగ్ర సాహిత్య పరిశోధన చేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ పర్యవేక్షణ లో థీసీస్ ప్రతిని వేదిక మీదున్న అతిథులకు గౌరీశంకర్ సమర్పించారు. అనంతరం కె.పద్మ నాభయ్య తదితరులు ప్రసంగించారు. అనంత

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మామ మోతె కృష్ణారెడ్డి ఆకస్మిక మృతి

**హైదరాబాద్ (మలక్‌పేట), జనవరి 29, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీ మణి కావ్య తండ్రి మోతె కృష్ణారెడ్డి(86) గుండెపోటుతో గురువారం కన్ను మూ శారు. కామారెడ్డి జిల్లాకు చెందిన ఆయన ఉద్యోగరీత్యా నగరానికి వచ్చి మలక్‌పేట పల్టాన్‌లో స్థిర పడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషనర్ ప్రింటింగ్ ప్రెస్‌లో సీనియర్ లీడర్‌గా పనిచేసి 1995లో పదవీ విరమణ చేశారు. రెండు రోజుల క్రితం హైదర్‌గూడా అపోలో హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం 11.53 గంటలకు గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. కృష్ణారెడ్డికి భార్య శ్యామల, ఇద్దరు కుమార్తెలు విజయభారతి, కావ్య, కుమారుడు శ్రీనివాసరెడ్డి ముగ్గురు సంతానం ఉన్నారు. శుక్రవారం ఉద యం 11 గంటలకు అంబర్‌పేట స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిం చనున్నట్లు కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



మోతె కృష్ణారెడ్డి (ఫైల్)

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు.. ఫిర్యాదుల కోసం టిఇ-పోల్ యాప్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 29:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందడి ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం టిఈ-పోల్ మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్య లుంటే ఫిర్యాదులు చేయడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సులభంగా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. అలాగే టిఎస్ఈసీ.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని ఎస్ఈసీ పేర్కొంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు నిర్వహించేందుకు అధికా రులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 11వ తేదిన పోలింగ్ జరగనుంది, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

## సింగరేణికి 'బేకన్ ఆఫ్ హోప్' అవార్డు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** సామాజిక భాధ్యత కార్యక్రమాలకు గాను సింగరేణికి బీకన్ ఆఫ్ హోప్ అనే అవార్డును పొందింది. సింగరేణి సంస్థ గత ఐదేళ్ల కాలంలో కొత్తగూడెం జిల్లాలో 15 కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులు వెచ్చించి పాఠశాలల భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు వంటి ప్రజోపయోగమైన అనేక పనులను చేపట్టింది. భద్రాచలం ట్రైబల్ భవన్ లో జరిగిన సీఎస్ఆర్ సమిట్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ అవార్డును సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ జి.వెంకట కిరణ్ కుమార్, సీఎస్ఆర్ అధికాగట్టు స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ సేవలను కలెక్టర్ ప్రశంసించారు. ఈ జిల్లాలో అత్యధిక సీఎస్ఆర్ పనులు చేపట్టినందుకు గుర్తింపుగా ఈ అవార్డును సింగరేణి సంస్థకు బహూకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే విధంగా సింగరేణి సంస్థ అన్ని జిల్లాల్లోనూ కోట్లాదిరూపాయలు వెచ్చించి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు మరియు విద్యా, వైద్యాభివృద్ధికి సీఎస్ఆర్ నిధులతో సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలన్నీ జనాభా ప్రకారం సీట్లు ఇవ్వాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న మాజీ ఐఎఎస్ చిరంజీవులు, బాలరాజుగౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, బైరి శేఖర్ తదితరులు

**జనరల్ స్థానాల్లోనూ బిసిలు పోటీ చేయాలి**

**బిసి ఇంటలెక్చువల్ ఫోరమ్ ఛైర్మన్ చిరంజీవులు**

**బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలరాజుగౌడ్**

**హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీలు బిసి లకు జనాభా దామాషా ప్రకారం బిసిలకు 56శాతం స్థానాలు కేటాయించాలని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిల ద్రోహి పార్టీలుగా చిత్రీకరిస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లోనూ ఈ పార్టీలకు బిసిలు ఓట్లు వేయొద్దని ప్రచారం చేస్తామని తెలిపారు. బిసిలు 56 శాతం ఉన్నారని లెక్కలు చెప్పడం, 42 శాతం రిజర్వే షన్లు ఇస్తామని హామీనివ్వడం తర్వాత ఇష్టానుసారంగా రిజర్వేషన్లు తగ్గించు కొంటూపోతే బిసి సంఘాలు చూస్తూ ఊరుకోబోవన్నారు. గురువారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి పొలిటికల్ ఫ్రంట్, బిసి ఇంటలెక్చువల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్.దుర్గయ్యగౌడ్ ఆధ్యక్షతన జరిగిన మీడియా సమావేశానికి చిరంజీవులు ముఖ్యఅతిథిగా హాజరుకాగా ఫ్రంట్ ఛైర్మెన్ బాలగోని బాలరాజు గౌడ్, ఎలికట్టే విజయకుమార్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు.

ఒకవైపు తెలంగాణలో ప్రపంచంలోనే అతిపెద్ద మేడారం జాతరకు ప్రజలంతా వెళ్తే మరోవైపు మున్సి పల్ ఎన్నికల నోటిఫికేషన్ 28 నాడే ఇచ్చి, 29 నుంచే నామినేషన్లు అనడం సరికాదన్నారు. సర్పంచ్ ఎన్నికల తరహాలో మున్సిపల్ ఎన్నికల్లోనూ జనరల్ స్థానాల్లో బిసిలు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సి, ఎస్టిలను కలుపుకొని బిసిలు ముందుకెళ్లి, బహుజనవాదాన్ని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ సామాజిక న్యాయం అంటూ వందల కోట్లు ఖర్చుతో కులగణన చేసి లెక్కలను ఇంతవరకు బయట పెట్టలేదన్నారు.

గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో బిసిలను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఈ మూడు పార్టీలను మున్సిపల్ ఎన్నికల్లో బిసిలు బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. బాలరాజు గౌడ్ మాట్లాడుతూ అధికారంలో లేని రాష్ట్రాల్లో జనగణనలో కులగనన చేస్తామని మాట ఇచ్చి అధికారం చేపట్టగానే కులగన బీసీ కులగననపై లేనిపోని షరతులు పెడుతూ బిసి లను ఇబ్బందికి గురి చేస్తుందన్నారు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు కోసం 5న చలో ఢిల్లీ

### పోస్టర్‌ను ఆవిష్కరించిన తెలంగాణ ఉపాధ్యాయ సంఘాలు

**హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకి టెట్ మిన హాయింపు కోరుతూ ఫిబ్రవరి 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఉపాధ్యాయ సంఘాలు నిర్వహించనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ ఉపాధ్యాయ సంఘాలు గురువారం ఆవిష్కరించాయి. గురువారం పిఆర్‌టియు టిఎస్ కార్యాలయంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ గోడపత్రిక(పోస్టర్)ను విడుదల చేశారు. సీనియర్ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పాఠశాలల మూసివేత, విలీనం నిలిపివేసి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలనే పలు డిమాండ్లతో జాతీయ ఉపాధ్యాయ ఫెడరేషన్ల పిలుపు మేరకు ఫిబ్రవరి 5న నిర్వహించే పార్లమెంట్ మార్చ్ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఉపాధ్యా యులు అందరూ ఫిబ్రవరి 5న ఉదయం 10 గంటలకు జంతర్ మంతర్ వద్దకు చేరుకోవాలని సూచించారు. జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పార్లమెంట్‌సభ్యులు, వివిధ జాతీయ సంఘాల నాయకులు పాల్గొంటార న్నారు. కార్యక్రమంలో ఎస్‌టిఎఫ్ఐ ప్రధాన కార్య దర్శి చావ రవి, ఎఐఎస్టిఎఫ్ ప్రధాన కార్యదర్శి జి సదానందం గౌడ్, పిఆర్‌టియు టిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి దామోదర్ రెడ్డి, ఎస్ బిక్షం గౌడ్, టిఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్, ఎస్టియు ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, పిటిఎ టిజి అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, టిపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అనిల్ కుమార్, ఎన్ తిరుపతి, డిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమయ్య, టి లింగారెడ్డి, పిటిఎ టిజి అధ్యక్షుడు కె మల్లికార్జున రెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, టిఆర్టిఎఫ్ అధ్యక్షుడు కటకం రమేశ్, ఎఐఐటిఎ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముజీబ్, ముంతాజ్ అలీ పాల్గొన్నారు.

# 12,751 గ్రామ పంచాయతీల్లో టి ఫైబర్ విస్తరణ

## ఇంధన, వైద్య, పరిశ్రమలు, మైన్స్, ఐటీలపై సిఎస్ సమీక్ష



గురువారం సచివాలయంలో విభాగాల వారీగా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 29:** ఇంధన, వైద్య ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసి, భారత ఫ్యూచర్ సిటీ, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల పనితీరుపై విభాగాల వారీగా గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె. రామకృష్ణారావు ఉన్నతాధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంధన శాఖ సమావేశంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టిజి ట్రాన్స్‌కో, టిజి జెన్‌కో, టిజి ఎస్‌పిడిసిఎల్, టిజి ఎన్‌పిడిసిఎల్ విభాగాలలో కొనసాగుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టుల పురోగతి, అలాగే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సిఎస్ ఆదేశించారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో విద్యుత్ రంగంలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించి మన రాష్ట్రంలో కూడా వివిధ డిస్కంలలో అమలు చేసేందుకు తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిపై సిఎస్‌కు వివరించారు. ఇగవర్నెన్స్, తదితర అంశాలు, అండర్ గ్రౌండ్ కేబులింగ్, విజన్ 2047 లక్ష్యాలు, గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు ప్రతిపాదిం చిన చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్‌నగర్, పరిగిలో విద్యుత్ సబ్ స్టేషన్ల పనుల పురోగతిపై సిఎస్ సమీక్షి ంచారు.


వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో వరంగల్, ఆల్వాల్, సనత్‌నగర్, ఎల్.బి.నగర్, న్యూఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పలు ప్రాంతాల్లో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల పురోగతి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వైద్య సదుపాయాల లభ్యత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల సరఫరా, వైద్యశాఖలో నర్సింగ్, వైద్యుల నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఇహెచ్ఎస్ పథకం, వైద్యపరికరాల సరఫరా తదితర అంశాలపై సిఎస్ సమీక్షి ంచారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సిఎస్ ఆదేశించారు. మాతా-శిశు ఆరోగ్యం, సంక్రమణ రోగాల నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిహెచ్ఎంసి పరిధిలో చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం, ఆల్వాల్, సనత్‌నగర్, ఎల్.బి.నగర్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు.

నూతన ఆసుపత్రుల అవసరాలకు మేరకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసిలకు సంబంధించిన సమావేశంలో ఐటీఈసీ శాఖలో ప్రస్తుత కార్యకలాపాలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై అధికారులు సిఎస్‌కు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, ఈగవర్నెన్స్ సేవల విస్తరణ, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రంలో ఉన్న 12,751 గ్రామ పంచాయతీల్లో టిఫైబర్ విస్తరణపై సమీక్ష చేశారు. రాష్ట్రాన్ని ఐటీ రంగంలో మరింత పోటీగా నిలిపే దిశగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం,యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గత మూడు రోజులుగా ఇప్పటి వరకు (13) విభాగాలను ప్రధాన కార్యదర్శి సమీక్షి ంచారు. రాబోయే రెండు రోజులలో మిగతా విభాగాల సమీక్షకు

## నిజంగా ర్యాషేనా?



ఈ కాలంలో పొడిబారే చర్మంతో దురద, దద్దుర్లు వంటివీ సహజంగానే కనిపిస్తుంటాయి. ఆ ఎర్రబడటం, పొట్టులా రాలడం... నిజంగా ర్యాషేనా? చల్లని వాతావరణంలోకి వెళ్లినప్పుడు చర్మం బిగుతుగా, తాజాగా తోయడం మనకు పరిచయమే. వాతావరణంలో తేమ తగ్గడం వల్ల చర్మం పొడిబారి అలా అనిపిస్తుంది. ఫలితమే ఎర్రబడటం, పొలుసుల్ల రాలడం, ఇలా బిగుతుగా తోయడం వగైరా. అయితే ఇవి తాత్కాలికమే. తగిన తేమను అందించినా, వాతావరణంలో మార్పు మొదలైనా అన్నీ తగ్గుతాయి. కానీ జెంటిల్ ఫేస్‌వాష్, మాయిశ్చరైజర్ను తరచూ వాడటం స్థిరంగా చేస్తుండాలి. ఇంత చేసినా తగ్గకపోతే? ఎగ్జిమా అయ్యుండొచ్చు. స్కిన్ బారియర్ సరిగా పనిచేయకపోతే ఇది వస్తుంది. దీనిలోనూ దురద, ఇన్ఫ్లమేషన్ ఉంటాయి. మిగిలిన కాలాలతో తాజా చలికాలం ఎక్కువగా కనిపిస్తుంది. దీనిలోనూ చర్మం ఎర్రబడటం, దురద, పొలుసుల్లా కావడం కనిపిస్తుంది. వాటిని గీకితే మందమైన ప్యాచ్లనూ మారతాయి. ముఖ్యంగా అలర్జీలు, ఆస్తమా వచ్చేవారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి, దద్దుర్లు, ఎరుపుదనం వంటి వాటిని తేలిగ్గా తీసుకోవద్దు.. మొదట..ఎక్కువ వేడినీటితో స్నానం చేయకపోవడం, త్వరగా ముగించడం, మాయిశ్చరైజర్ రాయడం, హ్యుమిడిఫయర్లు వాడటం... వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. వారం, రెండు వారాల్లో పరిస్థితి అదుపులోకి వస్తుంది. అయినా రాకపోతే ఎగ్జిమా అయ్యుండొచ్చు. అప్పుడు దీనికి తగిన చికిత్స తీసుకోవడం తప్పనిసరి.

## అనుబంధాన్ని దృఢంచేసే 'ధ్యానం'



గొడవలు రాకుండా.. ఒకవేళ వచ్చినా.. వాటికి తగిన పరిష్కార మార్గాలు వెతుక్కునే నేర్పును అందిస్తుందని నిపుణులు.

✦. మనసు లోని ప్రతి కూల ఆలోచనల్ని దూరం చేయడంలో ధ్యానం కీలక పాత్ర పోషి స్తుంది. నుండి పాజిటివిటీని అలవర్చు కోగలు గుతాం. ఇలా ప్రతి ఒక్కటి సానుకూల దృక్పథంతో చూస్తే మనం.. ఎదుటి వ్యక్తిలోనూ అలాంటి లక్షణాలనే చూడగలుగుతాం.

వ్యాయామాలు మన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి.. భావోద్వేగాలను అదుపులో ఉంచుతాయి ఉంచుతాయి. అయితే ఇవే వ్యాయామాలు అనుబంధాలను దృఢం చేస్తాయంటున్నారు రిలేషన్షిప్ నిపుణులు. . ✦ ధ్యానం వల్ల ఒత్తిడి, ఆందోళనలు తగ్గుతాయి. ఫలితంగా కోపాన్ని అదుపులో ఉంచుకొని ఏ విషయం గురించైనా ప్రశాంతంగా ఆలోచించగలుగు తాం. ఈ ప్రశాంతతే ఇద్దరి మధ్య ఎలాంటి

వారి మాటలు, బావాల్నీ అర్థం చేసుకోగలుగుతాం. భార్యాభర్తల మధ్య పెరిగిన దూరాన్ని దగ్గర చేసుకోవాలంటే ఇదీ ముఖ్యమే అంటున్నారు నిపుణులు. ✦ .మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు అవతలి వారితోనూ సులభంగా కలిసిపోగలుగుతాం.. ఇటు మన మనసులో ఉన్న సమస్యలు, బాధల్ని వారితో పంచుకోవడంతో పాటు... వారు చెప్పే సమస్యలు విషయాల్నీ శ్రద్ధగా వినగలుగు తాం. ఇలా ఇద్దరి మధ్య ఎలాంటి దాపరికాల్లేనప్పుడు అను బందంలోనూ ఎలాంటి కలతలు రావంటున్నారు నిపుణులు.

✦. కొన్నిసార్లు భార్యాభర్తలిద్దరిలో ఎవరికి కోపం వచ్చినా.. అవతలి వారు మాట పడరు. దీనివల్ల గొడవ పెద్దదవడం తప్ప మరే ప్రయోజనం ఉండదు. ఇలాంటప్పుడు ఓపికతో వ్యవహరించా లన్నా, భరించే శక్తిని పెంచుకోవాలన్నా ధ్యానం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. □

## తొలి భారతీయ రాయల్ ఐసింగ్ ఆర్టిస్ట్..



చాలామందికి కేక్ చేయడమెలాగో తెలిసే ఉంటుంది. కానీ దాన్ని సృజనాత్మకంగా అలంకరించడంలోనే సిసలైన ప్రత్యేకత దాగుంటుంది. ఇలాంటి అరుదైన కేక్ బేకింగ్ నైపుణ్యాలతో ప్రపంచ గుర్తింపు సంపాదించు కున్నారు ప్రాచీ ధవళ్ దేవ్. రాయల్ ఐసింగ్ ఆర్ట్‌లో ప్రావీణ్యం పొందిన ఆమె.. విశ్వవ్యాప్తం గా ఉన్న ఎలాంటి రాజప్రాసాదాలు, కట్టడాలనైనా రుచికరమైన కేక్ల రూపంలో తీర్చిదిద్దడంలో దిట్ట. అనితర సాధ్యమైన తన నైపుణ్యాలతో భారత్‌లోనే అత్యుత్తమ రాయల్ ఐసింగ్ కేక్ ఆర్టిస్ట్‌గా ఖ్యాతి గాంచిన ప్రాచీ.. ఇప్పటికే పలు ప్రపంచ రికార్డుల్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇక ఇటీవలే మరో అరుదైన ఘనత సాధించారామె. ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ఆక్స్‌ఫర్డ్ సెంటర్ ఫర్ హిందూ స్టడీస్'లో అసోసియేట్ ఆర్టిస్ట్‌గా నియమితు లయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడు ఐసింగ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. కేక్ తయారీలో తాను పొందే సంతోషం, సంతృప్తి మరెందులోనూ దొరకదంటున్న ఈ రాయల్ ఐసింగ్ క్వీన్ సక్సెస్ స్టోరీ తెలుసుకుందాం.. ప్రాచీ తల్లి దండ్రులు డెహ్రాడూన్కు చెందిన వారు. పుణేకు చెందిన ఓ ఐటీ ఉద్యోగిని పెళ్లాడిన ఆమె.. ఆ తర్వాత అక్కడే స్థిరపడ్డారు. చిన్న తనం నుంచీ అటు చదువులో రాణి స్తూనే.. ఇటు కేక్ బేకింగ్ పైనా ఆసక్తి చూపే వారు ప్రాచీ. ఈ విధంగానే అందరిలా కాకుండా తనకంటూ ప్రత్యేకంగా, కొత్తగా కేక్లు తయారుచేయాలని ఆరాటపడేవారు. ఈ తపనే తనను రాయల్ ఐసింగ్ వంటి క్లిష్టమైన కేక్ కళ నేర్చుకునేలా ప్రేరేపించిందంటూ ఓ సంద ర్భంలో చెప్పుకొచ్చారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన, కేక్ ఐకాన్‌గా పేరుగాంచిన 'సర్ ఎడ్డీ స్పెన్స్ ఎంబిఈ' ఆధ్వర్యంలో యుకెలో ఈ ఐసింగ్ నైపుణ్యాలు ఒంటబట్టించుకున్నారీ కేక్ లవర్.

**కష్టమైన ఇష్టంగా..** నిజానికి మనం ఒక పనిని ఇష్టపడితే.. అది ఎంత కష్టమైనా సరే.. దాన్ని ఆస్వాదిస్తూ మరీ. పూర్తి చేస్తాం. రాయల్ ఐసింగ్‌పై తనకున్న ఈ మక్కువే ఇంతటి క్లిష్టమైన కళనూ సులువుగా నేర్చుకునేలా, తనకు ప్రత్యేక గుర్తింపు దక్కేలా చేసిందన ప్రాచీ. నాకు చిన్నతనం నుంచీ అద్భుతమైన కళాఖండాల అందాలను ఆస్వాదించడమంటే మక్కువ. ముఖ్యంగా విక్టోరియా, యూరోపియన్ కట్టడాల నిర్మాణ శైలి, సొగసును వర్ణించడం మాటలతో సాధ్యమయ్యే పని కాదు. అందుకే వాటిని అంతే అందంగా, అద్భుతంగా నా ఐసింగ్ నైపుణ్యాలతో తీర్చిదిద్దుతున్నా. శిలలపై శిల్పాలు చెక్కినట్లు.. ఆ హంగుల్ని కేక్ తీర్చిదిద్దమంటే మాటలు కాదు.. అందుకు ఎంతో ఓపిక కావాలి. అయితే ఇష్టమైన పనిలో కష్టం తెలియ దన్నట్లు ఈ కళను మనసారా ఆస్వాదిస్తున్నా.. అంటోన్న ఈ ఐసింగ్ క్వీన్... రాయల్ ఐసింగ్‌తో ఎంబ్రాయిడరీ చేస్తూ, లేస్ తరహాలో హంగు లద్దుతూ, బంగారు వర్ణపు మెరుపును తీసుకొస్తూ ప్రత్యేకంగా నిలుస్తు న్నారు. వర్ణించడానికి మాటలు కూడా సరిపోని ఈ కేక్ కళాకృతులు చూడగానే ఆకట్టుకోవడమే కాదు.. నోరూరిస్తాయి కూడా!

**'వీగన్'.. నా ప్రత్యేకత ...** కేక్స్ తయారీలో చాలావరకు కోడిగుడ్లు ఉపయోగించడం మనకు తెలిసిందే! అప్పుడే వాటి రుచి, మృదుత్వం ఇనుమడిస్తాయి. అయితే తాను తయారుచేసే ఏ కేక్ లోనూ, రాయల్ ఐసింగ్‌తో తయారు చేసే కళాఖండాల్లోనూ గుడ్లు అస్సలు ఉపయోగించనంటు న్నారు ప్రాచీ ఈ క్రమంలో ఎక్కువ భాగం వీగన్ కేక్స్ రూపొందించ డానికే మొగ్గు చూపుతానంటున్నారు.


**మూడు ప్రపంచ రికార్డులు!** కేక్ బేకింగ్, రాయల్ ఐసింగ్ నైపుణ్యాలతో ఖిది క్వీన్ ఆఫ్ రాయల్ ఐసింగ్ పేరుగాంచిన ప్రాచీ తయారు చేసే కేక్ లకు విశ్వవ్యాప్తంగా అభిమానులు న్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా పలు కేక్ తయారీ పోటీల్లో జడ్జిగానూ వ్యవహరించా రామె. అంతేకాదు.. ఫోర్బ్స్ ఇండియా.. వంటి పత్రికలు విడుదల చేసిన స్ఫూర్తి దాయక, ప్రభావశీల మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆక్స్‌ఫర్డ్‌లో పాఠాలు ! తన రాయల్ ఐసింగ్ నైపుణ్యాలతో ప్రపంచం దృష్టిని తనవైపుప తిప్పుకొన్న ప్రాచీ.. ఇటీవలే మరో ఘనత సాధించారు. ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ఆక్స్‌ఫర్డ్ సెంటర్ ఫర్ హిందూ స్టడీస్'లో అసోసియేట్ ఆర్టిస్ట్‌గా నియమితులయ్యా రామె..తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ రాయల్ ఐసింగ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. □

## మనసు మలినమైతే..



ఒక రైతు రోజంతా ఎంతో కష్టపడి తన చెరకు తోట నీరు కోసం తోడాడు. తీరా సాయంత్రం చూస్తే పొలం కొద్దిగానే తడిచింది. ఆ నేలలో ఎక్కడ చూసినా ఎలుకల కలుగులు. రైతు తోడిన నీరంతా వాటి ద్వారా భూమి లోకి ఇంకిపోయింది. ముక్తిని కోరుకుంటూ నిర్మలమైన మనసుతో భగవంతుడిని ఆరాధించాలె తప్ప.. లోలోపల కీర్తి కోసం, సుఖాలు, సౌకర్యాలు, సంపదలు, పదవుల కోసం పూజించ కూడదు. అలా చేస్తే ఆ వ్యక్తి పైన చెప్పిన రైతులాగే తయారవుతుందని రామకృష్ణ పరమహంస హెచ్చరిక. అలాంటి వ్యక్తి నిత్యం దేవుణ్ణి ప్రార్థిస్తున్నా జీవితంలో నిజమైన అభివృద్ధి ఆనందం ఉండవని, అతడి భక్తి మొత్తం.. కోరికలనే ఎలుక కలుగుతోందని. జిడ్డుగా ఉన్న అద్దంలో ముఖం సరిగ్గా కనిపించదు. అలాగే కోరికలు అనే మలినాలతో నిండిన హృదయంలో భగవంతుడి స్వరూపం ప్రకాశించదు. జిడ్డును తుడిచేస్తే స్పష్టత వచ్చి నట్లు, నిర్మలంగా ఉన్న మదిలోనే దేవుడి రూపు దర్శనమిస్తుందని పరమహంస ప్రబోధించారు. □

## కురులకేం కావాలి?



జుట్టు గడ్డిలా మారినా, ఊడు తోందన్నా... బోలెడు సలహాలు వచ్చేస్తాయి కదూ! ఒకరు ప్రొటీన్ అందట్లేదు అంటారు. మరొకరు లేదు తేమ సరిపోవట్లేదు అందుకే ఇలా అని చెబుతారు. ఇంతకీ కురులకేం కావాలి?

✦ మన వెంట్రుకలు కెరటిన్ అనే ప్రొటీన్తో నే తయారవు తాయి. కాలుష్యం, వేసే రంగులు, స్టైలింగ్ అంటే, మనం దాన్ని గట్టిగా లాగడం ఏం చేసినా ప్రభావం పడుతోంది ఆ ప్రొటీన్ మీదే కురులు ఊరికే తెగిపోతున్నా, మందం తగ్గినా ప్రొటీన్ తగ్గిందనే అర్థం.

✦.కురులు మృదువుగా, మెత్తగా ఆరోగ్యంగా కనిపించాలంటే వాటికి తేమ తప్పనిసరి. పొడి జ వాతావరణం, తరచూ తలంటడం, రసాయనాలున్న షాంపూలు వాడటం... సహజ నూనెలను తొలగించి జుట్టుని గడ్డిలా బరకగా మారుస్తాయి. అప్పుడు వాటి నిర్వహణ కష్టమే. మృదువుగా ఉంటే చిక్కులుండవు. దాంతో కుదుళ్లపై దుష్ప్రభావాలు ఉండవు. కొద్దిగా లాగినా ఊడి వస్తోంటే తేమ తగ్గిందనే!

✦ ఆరోగ్యకరమైన జుట్టుకు ప్రొటీన్, తేమ అవసరం. కాబట్టి, రెండు దొరికేలా చూసుకోవాలి. అలాగే, పై పూతలకే పరిమితం కావొద్దు. కురుల నిర్వహణ దీర్ఘకాలం సాగే ప్రక్రియ. కాబట్టి, జాగ్రత్తగా కొనసాగించాలి. ఆహారం ద్వారా తగినంత ప్రొటీన్ అందేలా చూసుకోండి. మీ కురుల తీరుకు తగ్గ షాంపూ, కండిషనర్లు వాడండి. □


## మెక్సికన్ పరోటా రోల్స్



**కావలసినవి:** బ్రకోలీ ముక్కలు: ఒక కప్పు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, క్యాప్సికం, టమాట ముక్కలు: పావు కప్పు చొప్పున, చీజ్ తురుము: ఒక కప్పు, ఉడికించిన స్వీట్‌కార్న్: రెండు టేబుల్ స్పూన్లు, మిరియాలపొడి: అర టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, నిమ్మరసం: ఒక టేబుల్ స్పూన్, గోధుమపిండి, మైదాపిండి: ఒక కప్పు చొప్పున, నూనె: అర కప్పు.

**తయారీ విధానం:** ఒక గిన్నెలో మైదాపిండి, గోధుమపిండి, ఒక టేబుల్ స్పూన్ నూనె, కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో తగినన్ని నీళ్లు పోసి ముద్దలా కలిపి పావుగంట మూతపెట్టి పక్కనపెట్టాలి. బ్రకోలీ ముక్కల్ని పది నిమిషాల పాటు ఉప్పునీళ్లలో ఉడికించి చిన్నగా తరగాలి. ఒక గిన్నెలో బ్రకోలీ, టమాట, క్యాప్సికం, ఉల్లిగడ్డ ముక్కలు, చీజ్ తురుము, స్వీట్ కార్న్, కారం, మిరియాల పొడి, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. స్టవ్ మీద పెనం పెట్టి వేడి చెయ్యాలి. పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని చపాతీలా ఒత్తి పెనంపై వేసి ఒక నిమిషంపాటు రెండు వైపులా తిప్పుతూ కాల్చుకోవాలి. కాలిన చపాతీ మధ్యలో బ్రకోలీ మిశ్రమం పెట్టి గుండ్రంగా చుట్టి ఒక నిమిషంపాటు మూతపెడితే వేడివేడి మెక్సికన్ పరోటా రోల్స్ రెడీ. □

## 'ఆకాశంలో ఒక తార' శృతి హాసన్ ఫస్ట్ లుక్



స్వప్న సినిమా ప్రజెంట్స్ దుల్కర్ సల్మాన్ 'ఆకాశంలో ఒక తార' నుంచి శృతి హాసన్ ఫస్ట్ లుక్ రిలీజ్ 2026 సమ్మర్ లో పాన్‌ఇండియా థియేట్రికల్ రిలీజ్‌వరుస బ్లాక్‌బస్టర్‌లు, పాన్ ఇండియా స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్న వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్, ఇప్పుడు మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ ఖిఆకాశంలో ఒక తారఖితో అలరించబోతున్నారు. విలక్షణ కథలతో ఆకట్టుకునే పవన్ సాదినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో, ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన కొత్త హీరోయిన్ సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తోంది. ఇంతకు ముందు విడుదలైన ప్రోమోలు సినిమాపై అంచనాలను పెంచాయి.తాజాగా చిత్ర బృందం ఒక సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో చాలా సెలక్టివ్ గా సినిమాలు చేస్తున్న శృతి హాసన్, ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర చేస్తున్నారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, టీం ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఆమె కళ్ళకు అద్దాలు పెట్టుకుని ఇంటెన్స్ లుక్ లో కనిపించడం ఆకట్టుకుంది. ఈ సినిమా సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో ఉండబోతుంది.

## తెర

## ఎన్‌టీఆర్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు రక్షణ కల్పించిన ఢిల్లీ హైకోర్టు



నటుడు నందమూరి తారక రామారావు (ఎన్.టి.ఆర్) వ్యక్తిత్వ మరియు ప్రచార హక్కులను రక్షణ కల్పించేలా గౌరవనీయ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.వివిధ మాధ్యమాల్లో తన పేరు, ఫోటోలు, గుర్తింపును అనుమతి లేకుండా వాణిజ్య పరమైన ప్రయోజనాల కోసం వాడుతున్నారని ఎన్టీఆర్ కోర్టును ఆశ్రయిస్తూ పిటిషన్ వేశారు. ఈ విషయాన్ని పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు ఆయన వ్యక్తిత్వ హక్కులకు రక్షణ కల్పిస్తూ ఆదేశాలను జారీ చేసింది.ఆదేశాల మేరకు ఎన్‌టీఆర్ గారి పేరు గానీ, 'ఎన్‌టీఆర్', 'జూనియర్ ఎన్‌టీఆర్', 'తారక్"= లాంటి పేర్లు గానీ, 'యంగ్ టైగర్', 'మ్యాన్ ఆఫ్ మాసెస్' వంటి పేర్లు గానీ, అలాగే ఆయన ఫోటోలు, ఇమేజ్‌ను అనుమతి లేకుండా వాణిజ్య పరంగా వాడితే చట్ట విరుద్ధమని కోర్టు పేర్కొంది. ఎక్కడైనా ఇలా అనధికారంగా వాడినట్టు తెలిస్తే.. చట్టం ప్రకారం వెంటనే తీసేయాలని ఆదేశాలను కోర్టు జారీ చేసింది. ఒక వ్యక్తి పేరు, ఇమేజ్ వంటి ప్రముఖ వ్యక్తిత్వ హక్కులనేవి జీవించే హక్కు, స్వేచ్ఛ తోనే కలిసి ఉంటాయని చెప్పిన ఢిల్లీ హైకోర్టు. ఇవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 కింద రక్షణ పొందుతాయని, అలాగే కాపీరైట్ చట్టం 1957, ట్రేడ్‌మార్క్ చట్టం 1999 ద్వారా కూడా అమలు చేయవచ్చని స్పష్టం చేసింది. అదేవిధంగా ఇంటర్మీడియరీ ప్లాట్‌ఫామ్స్‌లో భాగమైన ఫేస్‌బుక్, యూట్యూబ్ లాంటి వాటిని కూడా కోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌ను 2021 ఐటీ రూల్స్ (ఇంటర్మీడియరీ గైడ్ లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) కింద అధికారిక ఫిర్యాదుగా పరిగణించి, చట్టపరంగా కేటాయించిన సమయాల్లో దొరికిన హక్కుల ఉల్లంఘన లింక్‌లను తీసేయాలని కోర్టు తెలియజేసిందికోర్టు మరో ఆదేశాన్ని కూడా ఇచ్చింది.. దాని ప్రకారం ఎవరో గుర్తించని వ్యక్తులు, ఆన్‌లైన్ ట్రోల్స్ చేసేవాళ్ల, ఎవరికీ తెలియకుండా తప్పులు చేసేవాళ్ల ఎవరైనా ఎన్‌టీఆర్ గారి పేరు, ఫోటో, ఇమేజ్, గుర్తింపును వాణిజ్య ప్రయోజనాల కోసం వాడకూడదని, మెర్చండైజ్, డిజిటల్ కంటెంట్, మోర్ఫ్ చేసిన ఫోటోలు, AI కంటెంట్ లేదా ఏదైనా టెక్నాలజీ ద్వారా ఉపయోగించకూడదని ఆదేశించింది.

## 'ఫౌజీ' దసరాకి గ్రాండ్‌గా రిలీజ్




రెబెల్ స్టార్ ప్రభాస్, క్రియేటివ్ ఫిల్మ్ మేకర్ హను రాఘవపూడి దర్శకత్వంలో చేస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఖిఫౌజీఖి. సక్సెస్ ఫుల్ పాన్‌ఇండియా బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో టి సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలై ఫస్ట్ లుక్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.దసరా పండుగ సంద ర్భంగా 'ఫౌజీ' గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.షూటింగ్ పూర్తయ్యే వరకు ఎలాంటి విరామం లేకుండా కంటిన్యూ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమా అత్యంత గ్రాండ్‌గా రూపుదిద్దుకుంటోంది.'ఫౌజీ' విజువల్ వండర్‌గా ఉండబోతోంది. ఎమోషన్, గ్రాండ్యూర్‌కి పేరుపొందిన దర్శకుడు హను రాఘవపూడి, ప్రభాస్‌ని ఇంతకు ముందు ఎప్పుడూ చూడని పవర్ ఫుల్ అవతార్‌లో చూపించబోతున్నారు.ప్రభాస్ సరసన హీరోయిన్‌గా ఇమాన్వీ నటిస్తోంది. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ లు మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై వరల్డ్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది.

## 'హార్ట్ బీట్ ఆఫ్ శబార' ఈవెంట్



దీక్షిత్ శెట్టి, క్రితికా సింగ్ ప్రధాన పాత్రల్లో ప్రేమ్ చంద్ కిలారు తెరకెక్కించిన చిత్రం 'శబార'. విక్రమ్ ఫిల్మ్ ఫ్రాటర్నిటీ బ్యానర్ మీద హర్షిత చదలవాడ, దుర్గా మంచు, రమాదేవి కిలారు నిర్మించిన ఈ మూవీకి సంబంధించిన ప్రపంచాన్ని 'హార్ట్ బీట్ ఆఫ్ శబార్థ ద్వారా పరిచయం చేశారు. మిథున్ ముకుందన్ ఈ మూవీకి సంగీతాన్ని అందించారు. అజయ్ అబ్రహాం జార్జ్ ఈ సినిమాకి కెమెరామెన్‌గా పని చేశారు. హార్ట్ బీట్ ఆఫ్ శబార అంటూ నిర్వహించిన కార్యక్రమంలో....దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ.. .. శబార కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నా గర్ల్ ఫ్రెండ్థ సినిమాకి మీడియా మంచి సపోర్ట్ ఇచ్చింది. ఇక ఇప్పుడు శబార్థకి కూడా అలానే సపోర్ట్ చేస్తారని ఆశిస్తు న్నాను. అందరికీ హార్ట్ బీట్ ఆఫ్ శబార్థ నచ్చి ఉంటుందని అనుకుంటున్నాను. అన్నారు... దర్శకుడు ప్రేమ్ చంద్ కిలారు మాట్లాడుతూ.. .. హార్ట్ బీట్ ఆఫ్ శబారకి మంచి రెస్పాన్స్‌ను ఇచ్చారు. చిత్రీకరణ ఇంకా పూర్తి కాలేదు. త్వరలోనే ఆడియెన్స్ ముందుకు వస్తాం. మా నాన్న నాకు దేవుడి కంటే ఎక్కువ. ఆ నాన్ననే ఎదురించి సినిమాను తీస్తున్నానంటే.. ఎలాంటి సినిమాని తీస్తుంటానో అర్థం చేసుకోండి. క్రితిక సింగ్ మాట్లాడుతూ.. .. 'ప్రేమ్ చంద్ గారు లేకపోతే' శబార్థ ఇంత గొప్పగా వచ్చేది కాదు. నన్ను నమ్మి ఇంత మంచి పాత్రను ఇచ్చిన ఆయనకు థాంక్స్. .మీషా నారంగ్ మాట్లాడుతూ.. .. 'శబార' కన్నుల పండుగగా ఉంటుంది. ఎన్నో అద్భుతమైన లొకేషన్లలో సినిమాని షూట్ చేశాం. ఎంతో కష్టపడిమూవీని తీశాం.

## కాలం మారింది సినిమా 53 సంవత్సరాలు పూర్తి



తారాగణం శోభన్ బాబు మరియు శారద ముఖ్యపాత్రలతో నిర్మించిన చిత్రానికి దర్శకులు కె విశ్వనాథ్ మరియు నిర్మాత వాసిరాజు ప్రకాశం. అల్లు రామలింగయ్య ఇందులో ఓ మంచి పాత్ర చేశాడు. ఆరోజుల్లో కుల మతాల మధ్య ఉన్న జరుగుతున్న గొడవలు నేపథ్యంలో ఓ మంచి మార్పుతో నిర్మించిన చిత్రం ఇది. మంచి సందేశాత్మక చిత్రం. ఈ చిత్రానికి మంచి అవార్డులు సాధించిన విషయం తెలిసిందే. దర్శకులు ప్రజల్లో మంచి చైతన్య కలిగే విధంగా చిత్రాన్ని నిర్మించటం మంచి శుభసూచకం. చిత్రం అవార్డులు సాధించాటమే కాకుండా ప్రజల్లో మంచి అభినందనలు పొందినది. ఈ చిత్రం నటుడు శోభన్ బాబుకు మంచి పేరుతో పాటు అవార్డు రావడం గొప్ప విషయం.

## ఫిబ్రవరి 6న ప్రపంచవ్యాప్తంగా 'శ్రీ చిదంబరం గారు' విడుదల



శ్రీమతి. చింతా వరలక్ష్మీ సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం శ్రీ చిదంబరం'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన ఈ చిత్రం నుంచి ఇటీవల టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌కు వచ్చిన అనూహ్య స్పందన గురించి తెలిసిందే. కాగా ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి గారు ఆలపించిన 'వెల్లేదారిలో' అనే ఓ పాట బ్యూటిఫుల్ పాటను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు, ప్రస్తుతం మెగా పవర్‌స్టార్‌తో పెద్ది అనే పాన్ ఇండియా చిత్రాన్ని డెరెక్ట్ చేస్తున్న బచ్చిబాబు సానా విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు అందజేశారు. ఫిబ్రవరి 6న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. . నిర్మాత మాట్లాడుతూ అంతా కొత్తవాళ్లతో తీసిన బ్యూటిఫుల్ సినిమా ఇది. చాలా మెచ్యూర్డ్ అండ్ ఇన్స్పిరేషన్ స్టోరీతో రాబోతున్న సినిమా ఇది. నేటి సమాజానికి ఎంతో అవసరమైన కథ ఇది. చాలా మంది యువత చిన్న చిన్న ప్రాబ్లమ్స్‌కే సూసైడ్ వరకు వెళ్లిపోతున్నారు. అలాంటి వారందరికి ఎంతో ఇన్స్పయిర్ అయ్యే కథ ఇది. మీలో లోపం మీకు బలం అవ్వాలి అనే చెప్పే కథ ఇది. తప్పకుండా ఈ సినిమా అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు.

### మహిళల జాతీయ కబడ్డీలో

# తెలంగాణ, హార్యానా విజయం

### ఆంధ్రా, బీహార్, గోవా ఓటమి



**న్యూఢిల్లీ:** 72వ మహిళల సీనియర్ జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్-2026లో ఇండియన్ రైల్వేస్, తెలంగాణ, రాజస్థాన్, గుజరాత్ విజయంతో ప్రత్యేకంగా నిలవగా, ఆంధ్ర, బీహార్, హార్యానా జట్లు ఓటమిపాలయ్యాయి. బాలయోగి స్టేడియంలో గురువారం జరిగిన పోటీల్లో ఇండియన్ రైల్వేస్ రెండు పెద్ద విజయాలతో పూల్ ఎ పై ఆధిపత్యం చెలాయించింది. రాజస్థాన్, తెలంగాణ పూల్ సి లో ఆకట్టుకోగా, గుజరాత్ ఒడిశాను ఓడించి కఠినమైన మ్యాచ్‌లో విజయం సాధించింది. రైల్వేస్ పూల్ ఎ లో ఆధిక్యంలో ఉంది. తొలుత జమ్మూ కాశ్మీర్‌ను 88-12 తేడాతో ఓడించి, ఆ తర్వాత ఢిల్లీపై 54-21 తేడాతో విజయం సాధించిన రైల్వేస్ జట్టు గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. పూల్ బిలో ఉత్తరప్రదేశ్ మిశ్రమ ఫలితాలను సాధించింది. తొలుత అస్సాంను 37-27తో ఓడించి, ఆ తర్వాత షెడ్యూల్‌లో హిమాచల్ ప్రదేశ్ చేతిలో 34-21తో ఓడిపోయింది. దీంతో ఈ విభాగం సమతుల్యంగా ఉండి, ఈ దశలో పాల్గొన్న మూడు జట్లకు అర్హత అవకాశాలు ఉన్నాయి. అలాగే పూల్ సి లో తెలంగాణ పుదుచ్చేరిని 50-16తో ఓడించి బలంగా ప్రారంభించింది. రాజస్థాన్ అదే ప్రత్యర్థులపై మరింత ముందుకు వెళ్లి 76-12 విజయాన్ని నమోదు చేసింది. పూల్ డి లో గోవా జార్ఖండ్‌పై 74-20 స్కోరుతో విజయం సాధించినప్పటికీ గోవా ఆ ఫామ్‌ను తదుపరి మ్యాచ్‌లో కొనసాగించలేకపోయింది. హార్యానా అదే గ్రూప్‌లో గోవాపై 52-26 తేడాతో విజయం సాధించి ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని పెంచుకుంది. పూల్ ఇ లో విదర్భపై 57-20 మహారాష్ట్ర, పూల్ ఎఫ్ లో పంజాబ్ బీహార్‌పై 39-31 గెలుపొందాయి. గుజరాత్ పూల్ జి లో ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో ఒడిశాను 29-26తో ఓడించింది. ఇక పూల్ హెచ్‌లో మధ్యప్రదేశ్ ఆంధ్రప్రదేశ్‌పై 48-23తో విజయం సాధించింది.

### ప్రపంచ స్నూకర్‌లో..

# సత్తా చాటిన ఇష్ప్రీత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ స్నూకర్ టూర్ ఈవెంట్ అయిన జర్మన్ మాస్టర్స్‌లో భారతదేశానికి చెందిన ఇష్ప్రీత్ చద్దా తన సత్తా చాటాడు. తనకన్నా ఉన్నత ర్యాంక్ పొందిన ఆటగాళ్లపై అతడు అద్భుత విజయాలు నమోదు చేశాడు. గురువారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ ర్యాంక్‌లో 65వ స్థానంలో ఉన్న ఇష్ప్రీత్ తన ప్రత్యర్థి నుండి గట్టి పోటీ ఎదుర్కొన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన క్రిస్ వాకెలిన్‌తో జరిగిన హోరా హోరీ పోటీలో 5-4 తేడాతో విజయంతో చద్దా ఈ టోర్నమెంట్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. ప్రపంచ 14వ ర్యాంకర్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత ఆటగాడు 1-3 తేడాతో వెనుకబడ్డాడు. కానీ తదుపరి రౌండ్‌కు చేరుకోవడానికి తిరిగి పుంజుకున్నాడు. తరువాత, అతను ప్రపంచ 20వ ర్యాంకర్ ఎలియట్ స్లెస్సర్‌తో తలపడ్డాడు. ఈ పోటీలో స్లెస్సర్ ను 5-3 తేడాతో ఓడించి మూడవ రౌండ్‌లోకి ఇష్ప్రీత్ ప్రవేశించాడు. తదుపరి ప్రీక్వార్టర్ ఫైనల్ పోరులో చద్దా ప్రపంచ 3వ ర్యాంకర్ నీల్ రాబర్ట్‌సన్ లేదా, ప్రపంచ 27వ ర్యాంకర్ పాంగ్ జుంక్సుతో తలపడతాడు. నిరాశపరిచే సీజన్ తర్వాత ప్రపంచ స్నూకర్ టూర్‌లో మనుగడ కోసం పోరాడుతున్న చద్దాకు ఈ విజయాలు కీలకమైన సమయంలో వచ్చాయి.

### థాయిలాండ్ మాస్టర్స్‌లో..

# అన్మోల్, కిరణ్, మిధున్ విజయం



**న్యూఢిల్లీ:** థాయిలాండ్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు చెందిన కిరణ్ జార్జ్, మిథున్ మంజునాథ్ విజయం నమోదు చేయగా, మహిళల సింగిల్స్‌లో అన్మోల్ ఖర్బ్ గెలుపొందగా, అనుపమ ఉపాధ్యాయ, తాన్య హేమంత్ ఓటమిపాలయ్యారు. ఏడో సీడ్ కిరణ్ జార్జ్ ఇండోనేషియాకు చెందిన షోలేహ్ ఐడిల్‌ను కేవలం 27 నిమిషాల్లోనే ఓడించాడు. జార్జ్ ప్రారంభం నుండే ర్యాలీలను నియంత్రిస్తూ ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా 21-15, 21-9 తేడాతో విజయాన్ని సాధించాడు. మరోవైపు, ప్రపంచ 60వ ర్యాంకర్ మిథున్ మంజునాథ్ మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో డెన్మార్క్‌కు చెందిన ఎనిమిదో సీడ్ మాగ్నస్ జోహన్నెసెన్‌ను ఓడించాడు. మంజునాథ్ మొదటి గేమ్‌ను సునాయాసంగా ఎదుర్కొని రెండవ గేమ్‌ను చేజార్చుకున్నాడు. కానీ దాదాపు గంటసేపు కోర్టులో ఆడిన తర్వాత 21-12, 9-21, 21-17 తేడాతో విజయాన్ని సాధించాడు. పురుషుల సింగిల్స్‌లో తరుణ్ మన్నెపల్లి 22-20, 21-17 తేడాతో థాయిలాండ్‌కు చెందిన కాంటాఫోన్ వాంగ్‌చరోయెన్‌ను ఓడించాడు. అయితే, ప్రారంభ రౌండ్‌లో పలువురు భారత షట్లర్లు ఓడిపోయారు. ప్రియాంషు రాజవత్ మూడు గేమ్‌లలో కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్ చేతిలో త్రుటిలో ఓడిపోగా, మన్రాజ్ సింగ్, ఎస్ శంకర్ ముత్తుసామి సుబ్రమణియన్ వరుసగా మూడు గేమ్‌ల పరాజయాలను చవిచూశారు. మహిళల సింగిల్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మహిళల డ్రాలో, రైజింగ్ ప్లేయర్ అన్మోల్ ఖర్బ్ 21-12, 21-12 తేడాతో హాంకాంగ్‌కు చెందిన లో సిన్ యాన్ హ్యాపీపై అద్భుతమైన విజయం సాధించింది. ఇక తస్నిమ్ మీర్, అనుపమ ఉపాధ్యాయ, తాన్య హేమంత్ ప్రారంభంలోనే నిష్క్రమించగా, శ్రీయాన్షి వాలిశెట్టి, ఇషారాణి బారువా ముందుకు సాగారు.



### ప్రో రెజ్లింగ్ లీగ్‌లో..

# అగ్ర స్థానంలో హార్యానా

### 6-3 తేడాతో యుపిపై విజయం

**న్యూఢిల్లీ:** ప్రో రెజ్లింగ్ లీగ్-2026 లీగ్ దశలో హార్యానా థండర్స్ జట్టు ఐదవ బౌట్‌లో విజయం సాధించి అగ్రస్థానానికి చేరుకుంది. ఉత్తరప్రదేశ్ డామినేటర్స్‌పై 6-3 తేడాతో హార్యానా విజయం సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 76 కిలోల మహిళల పోటీలో, కాజల్ ధోచాక్ 3-3తో ముగిసిన హోరాహోరీ పోరులో మాన్సి లాథర్‌ను ఓడించింది. పురుషుల బౌట్‌లో (57 కిలోలు) కూడా ఈ ఊపు కొనసాగింది. అంకుష్ చంద్రం, రాహుల్ దేస్వాల్ 4-4తో నిలిచారు. అంకుష్ స్కోరింగ్ హార్యానా ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. కిలోల మహిళల బౌట్‌లో (57) తప్స్య గహ్లోవత్ ద్వారా యుపిడామినేటర్లు ధీటుగా స్పందించారు. ప్రారంభ మ్యాచ్‌ల లో తప్స్య పవర్ మినిట్‌లో రెండు నిర్ణయాత్మక టేక్‌డౌన్‌లను సాధించి 10-3తో ఆధిక్యతతో గెలుపొంది లోటును తగ్గించింది. ఆ తర్వాత పురుషుల విభాగంలో (65) విశాల్ కాళి రామన్ తుముర్ ఓచిర్ తుల్గాపై పుష్‌అవుట్ ద్వారా 9-6 విజయాన్ని సాధించడంతో టై సమమైంది. మార్క్యూ మహిళల బౌట్‌లో (53) హార్యానా కెప్టెన్ యుయి సుసాకి ద్వారా తిరిగి ఆధిక్యంలోకి వచ్చింది. మాజీ ఒలింపిక్ ఛాంపియన్ బహుళ టర్న్‌అండ్‌ఎక్స్‌పోజర్ సీక్వెన్స్‌లను సద్వినియోగం చేసుకుని 8-0 ఆధిక్యాన్ని సాధించింది, ఆంటిమ్ పంఘల్ సుసాకిపై ప్రారంభ పీరియడ్‌లో చివరి దశలో పాయింట్లు సాధించిన మొదటి రెజ్లర్‌గా నిలిచింది. రెండవ పీరియడ్ 8-3 విజయాన్ని నమోదు చేసి హార్యానాను 3-2తో ముందంజలో ఉంచింది.

ఆట

# హాట్ టాపిక్‌గా బ్యాటింగ్ లైనప్

### టి20 వరల్డ్ కప్‌లో మెంటలెక్కించే టీమ్స్

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్ 2026 సమీపిస్తున్న వేళ ఈసారి పలు జట్లు పవర్ హిట్టర్లతోపాటు, స్టేబుల్ బ్యాట్స్‌మన్లతో బలమైన బ్యాటింగ్ లైనప్స్ సిద్ధం చేసుకున్నాయి. భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, పాకిస్థాన్ జట్లు బలమైన బ్యాటింగ్ లైనప్స్‌తో టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. భారత బ్యాటింగ్ యూనిట్ యువత, సీనియర్లతో బలంగా ఉంది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఆరంభంలో వేగంగా రన్స్‌చేయగల సత్తాఉండగా, సూర్య కుమార్ యాదవ్, తిలక్ వర్మ మిడిల్ ఓవర్లలో మ్యాచ్‌ను పూర్తిగా తిప్పగలరు. హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్‌గా కీలకంగా మారనుండగా, రింకూ సింగ్, శివమ్ దూబే డెత్ ఓవర్లలో భారీ షాట్లతో విరుచుకు పడే సామర్థ్యం ఉండగా, సంజూ శాంసన్ వికెట్ కీపర్‌గా స్థిరత్వాన్ని అందిస్తాడు. ఆస్ట్రేలియా బ్యాటింగ్ విభాగం పవర్ హౌస్‌లా ఉంది. ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ వేగంగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించగలిగి ఉండగా, మ్యాక్స్వెల్, టిమ్ డేవిడ్, మార్కస్ స్టోయినిస్ లాంటి పవర్ హిట్టర్లు చివరి ఓవర్లలో మ్యాచ్‌ను క్షణాల్లో ఫినిష్‌చేయగరు. కామెరాన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్ కూడా బ్యాటింగ్‌కు మరింత బలాన్ని అందించగలరు. ఆసీస్ జట్టులోని ప్రతిఒక్కరు డేంజరస్ బ్యాటర్లే. పటిష్ట బ్యాటింగ్‌లైనప్ ఆసీస్ కలిగి ఉంది. న్యూజిలాండ్ బ్యాటింగ్ యూనిట్ క్రమశిక్షణ, స్థిరత్వానికి మారుపేరు. ఫిన్ అలెన్, డెవన్ కాన్వే లాంటి ఓపెనర్లు వేగంగా రన్స్ చేస్తూ, స్కోర్ బోర్డును పరుగెత్తిస్తారు. డారిల్ మిచెల్, గ్లెన్‌ఫిలిప్స్, రచిన్‌రవీంద్ర మధ్య ఓవర్లలో జట్టును ఆదుకునే సత్తా ఉండగా, టీమ్ సీఫర్ట్, నిషామ్ ఫినిషర్లుగా కీలక పాత్ర పోషిస్తారు. దక్షిణాఫ్రికా బ్యాటింగ్ యూనిట్ యువ, సీనియర్ల అనుభవాన్ని కలిగి ఉంది. ఐడెన్ మార్క్రమ్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగలడు. డేవిడ్ మిల్లర్ లాంటి అనుభవజ్ఞుడు ఫినిషర్‌గా కీలకంగా ఉండగా, స్టబ్స్, బ్రెవిస్, రికెల్టన్ లాంటి యువ ఆటగాళ్లు స్పీడైన రన్స్ రాబట్టే సత్తా ఉన్నవారు. ఇక క్వింటన్ డికాక్ ఓపెనర్‌గా జట్టుకు భారీ ఆరంభాలు అందించే సత్తాఉంది. ఇంగ్లాండ్ బ్యాటింగ్ యూనిట్ పూర్తిగా దూకుడుగా ఉంటుంది. జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్, బెన్ డకెట్ లాంటి బ్యాట్స్‌మన్స్ పవర్‌ప్లేలోనే మ్యాచ్‌ను ప్రత్యర్థుల నుంచి దూరంచేయగలరు. హ్యారీ బ్రూక్, విల్ జాక్స్, సామ్ కరన్ లాంటి ఆటగాళ్లు మధ్య, చివరిఓవర్లలో కీలకంగా మారగలరు. టామ్ బాంటన్ మ్యాచ్‌ను క్షణాల్లో ముగించగడు. ఇంగ్లాండ్ జట్టు బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగి ఉంది. పాకిస్థాన్ బ్యాటింగ్ యూనిట్లో క్లాస్, టెక్నిక్ ఎక్కువగా కనిపిస్తుంది. బాబర్ ఆజమ్, ఫఖర్ జమాన్ లాంటి ఆటగాళ్లు పెద్ద ఇన్నింగ్స్ ఆడగల సామర్థ్యంతో ఉన్నారు. యువ ప్లేయర్స్ సైమ్ అయూబ్, సల్మాన్ ఆఘాలు ధాటిగా ఆడుతారు. నవాజ్, ఉస్మాన్ లాంటి ఆటగాళ్లు మిడిల్ ఆర్డర్లో కీలకంగా ఉంటారు. పవర్ హిట్టింగ్, లోతైన బ్యాటింగ్, మ్యాచ్ విన్నింగ్ సామర్థ్యం దృష్ట్యా ఆస్ట్రేలియా, భారత్, ఇంగ్లాండ్ జట్లు అత్యంత బలమైన బ్యాటింగ్ యూనిట్లుగా కనిపిస్తున్నాయి.



# ఈక్విటీలకు ఆర్థికసర్వే దన్ను

## లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ


వాణిజ్యం

**ముంబయి,జనవరి 29:** దేశీయ ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు గురువారం స్వల్పలాభాలతో ముగిసాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే ప్రభావం కూడా ఈక్విటీలపై ఉంది. అలాగే ఇంట్రాడేలో ఉన్న కనిష్టంనుంచి కోలుకున్నాయి. నెలవారీ ఎఫ్‌అండ్‌ఓ కాంట్రాక్టులు ముగుస్తుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ట్రేడింగ్‌చేసారు. ఆర్థికవృద్ధి 7.2శాతంవరకూ ఉంటుందన్న ఆర్థికసర్వే నివేదికలు మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు కూడా పెంచడం కలిసొచ్చింది. కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి ఒకటవ తేదీ ప్రవేశపెడుతున్న తరుణంలో మార్కెట్లు సత్వరమే రికవరీ అయినట్లు తెలుస్తోంది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 221.69 పాయింట్లుపెరిగి 82,566.37 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50సూచీ కూడా 76.15 పాయింట్లుపెరిగి 25,418.90 పాయింట్లవద్దకు చేరుకుంది. మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.26శాతం, నిఫ్టీ 1.48శాతంపెరిగింది. ఎల్ అండ్‌టి 3.66శాతం, యాక్సిస్‌బ్యాంకు 3.32 శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.2శాతం చొప్పున పెరిగాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.10 శాతం, పెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.19శాతం క్షీణించింది. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 1706 కంపెనీలు షేర్లుపెరిగితే 2533 షేర్లు క్షీణత ఎదుర్కొన్నాయి. 159 కంపెనీలు మాత్రం స్థిరంగాకొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 91.98 వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచ్లు ఫిబ్రవరి ఐదునాటికి 5.29శాతం క్షీణించి 1.74,650గా నిలిచింది. అమెరికా పదేళ్ల బాండ్లు రిటర్నులు 0.09శాతం పెరిగి 4.255గా నిలిచింది. కమోడిటీ మార్కెట్లపరంగా బ్రెంట్‌ముడిచమురు మార్చినెల సెటిల్‌మెంట్ అయింది 1.40సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 69.80 డాలర్లుగా నడించింది. నిఫ్టీలోమెటల్‌సూచీ 3.07శాతంపెరిగింది. హిందూస్థాన్‌కాపర్ 20శాతం, ఎల్‌అండ్‌టి 3.66శాతం, బాలు ఫోర్జ్ ఇండస్ట్రీస్ 10శాతం ఇక్లెర్క్స్ సేవలు 5.80శాతం చొప్పున పెరిగాయి. ఇక కెనరాబ్యాంక్ మాత్రం 4.75శాతం క్షీణించింది. ఎస్‌బిఐ కార్డ్స్ సేవలు 1.82శాతం క్షీణించింది.

హెరిటేజ్‌ఫుడ్స్ కూడా 8.60శాతం క్షీణించింది. గ్లాండ్‌ఫార్మా 6.75శాతం షేర్లు పెరిగినట్లు తేలింది. ఎస్‌కె ఆటోమోటివ్ కూడా 3.33శాతంపెరిగింది. గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డర్స్ కంపెనీ కూడా ట్రేడింగ్‌లో 2.52శాతం లాభ పడినట్లు గణాంకాలు చెపుతున్నాయి.



## 61% పెరిగిన వేదాంత నికరలాభాలు

**ముంబయి,జనవరి 29:** మైనింగ్ దిగ్గజ సంస్థ వేదాం త గురువారం 61శాతం నికరలాభాల్లో వృద్ధినమోదుచేసింది. డిసెంబరు చివరినాటికి మూడునెలలకుగాను రూ.5710 కోట్లు ఆర్జించినట్లు బిఎస్‌ఇకి నివేదించింది.ఏడాది క్రితం ఇదే కాలంలో రూ.3547 కోట్లు ఆర్జించింది కంపెనీ రాబడులు కూడా 36.9శాతం పెరిగి 23,369 కోట్లు ఆర్జించింది. అదే గత ఏడాది డిసెంబరు త్రైమాసికంలో 17,603 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ గతంలో ఎన్నడూలేనంతగా ఎబిడిటా మార్జిన్ పెంచుకుందని, రూ.15,171 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. వార్షిక వృద్ధి 34శాతం ఉందని త్రైమాసికం వారీగా 31శాతం ఉన్నట్లు వివరించింది. ఎబిడిటా మార్జిన్‌కూడా 629 బేసిస్‌పాయింట్లుపెంచుకుంది. అంటే 41శాతంపెరిగినట్లు వివరించింది. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ్ మిశ్రా మాట్లాడుతూ కంపెనీ ఎబిడిటా మార్జిన్ గతంలో ఎన్నడూలేనంతగా పెంచుకోగలిగామని వివరించారు. అల్యూమినియం విభాగంలో ఎబిడిటా మార్జిన్ టన్నుకు 1268 డాలర్లుపెరిగిందని, అల్యూమినా, అల్యూమినియం ఉత్పత్తికి ఎంతో మేలు చేసిందన్నారు. జింక్ ఇండియా కూడా త్రైమాసికంలో రూ.6064 కోట్లు ఎబిడిటాసాధించిందని తెలిపారు. ఇక వెండి వెలికితీత కూడా 44శాతం పెరిగి లాభదాయకతను పెంచిందని, ఇంజక్ ఇంటర్నేషనల్‌కూడా 28శాం వార్షిక ఉత్పత్తి వృద్ధిని నమోదు చేసిందని తెలిపింది.




## భారీగా పెరిగిన స్విగ్గీ నష్టాలు

### మూడోత్రైమాసికంలో

### రూ.1065 కోట్లు నష్టం

**ముంబయి,జనవరి 29:** ఆహార ఉత్పత్తుల పంపిణీ సంస్థ స్విగ్గీ తన మూడో త్రైమాసికంలెఓ రూ.1065 కోట్ల నష్టం చవిచూసింది. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ.799 కోట్ల నష్టం కంటే భారీగాపెరిగింది. కంపెనీ రాబడులు 53.9శాతంపెరిగి 6149 కోట్లుగా ఉన్నాయి. ఇదే గత ఏడాదిమూడో త్రైమాసికంలో 3993కోట్లనుంచి గణనీయంగాపెంచుకోగలిగింది. నెవారీ లావాదేవీలు సగటున 36.8శాతం పెరిగినట్లు వెల్లడించింది. మొత్తం 24.3 మిలియన్ లావాదేవీలు జరిగాయని, 5.9శాతం వృద్ధిని సాధించామన్నారు. బి2సి సర్దుబాటు రాబడులు ఎబిడిటా మార్జిన్ 16 బేసిస్‌పాయింట్లు క్షీణించింది. వార్షిక వృద్ధితో చూస్తే 3.5శాతంగా ఉంది. ఫుడ్ డెలివరీ విభాగంలో స్థూల ఆర్డర్లు 205.శాతంపెరిగిరూ.8959 కోట్లుగా ఉన్నాయని తెలిపింది.నెలవారీగా కస్టమర్లు 22శాతంపెరిగి 18.1 మిలియన్లకు చేరినట్లు వివరించిన సంస్థ ఇన్‌స్టామార్ట్‌లో 103.2 వాతం వృద్ధిని సాధించి 7938 కోట్ల విలువైన లావాదేవీలు నిర్వహించినట్లు తెలి పింది. 40శాతం వృద్ధితో 746 కోట్లుపెరి గిందని తెలిపింది మొత్తం 34 డార్క్ స్టోర్స్ ఈ త్రైమాసికంలోప్రారంభించామని, మొత్తం 1136 డార్క్‌స్టోర్స్ నిచేస్తున్నట్లు దీనివల్ల మార్జిన్‌కూడా 2.5వాతం మెరుగుపడిందన్నారు.స్విగ్గీషేర్లు 1.1శాతం పెరిగి రూ. 327.40లుగా బిఎస్‌ఇలో ట్రేడ్ అయ్యాయి.

# దేశంలో డీమాట్ ఖాతాలు 12 కోట్లు





**న్యూఢిల్లీ,జనవరి 29:** భారత క్యాపిటల్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం కొత్త రికార్డులు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరలో డిసెంబరు వరకు కేవలం 9 నెలల కాలంలోనే దేశవ్యాప్తంగా ఏకంగా 2.35 కోట్ల కొత్త డీమ్యాట్ ఖాతాలు తెరుచుకున్నాయి. గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26 ఈ కీలక గణాంకాలను వెల్లడించింది. ఆర్థిక విషయాలపై ప్రజల్లో అవగాహన పెరగడం, మార్కెట్లపై నమ్మకం ఇనుమడించడమే ఇందుకు ప్రధాన కారణమని సర్వే పేర్కొంది. 2025 సెప్టెంబర్ నాటికే దేశంలో మొత్తం ప్రత్యేక డీమ్యాట్ మదుపర్ల సంఖ్య 12 కోట్లు దాటింది. వీరిలో దాదాపు నాలుగో వంతు మహిళలు ఉన్నారు. పెట్టుబడులు కేవలం పెద్ద నగరాలకే పరిమితం కావడం లేదు. డిసెంబర్ నాటికి మ్యూచువల్ ఫండ్లలో ఉన్న 5.9 కోట్ల మంది మదుపర్లలో 3.5 కోట్ల మంది టైర్‌వన్, టైర్2యేతర నగరాలు, పట్టణాల నుంచే ఉండటం ఈ మార్పునకు నిదర్శనం. ప్రజలు తమ పొదుపును సంప్రదాయ మార్గాల నుంచి ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్ల వైపు మళ్లిస్తున్నారని సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ సిప్‌ల ద్వారా పెట్టుబడులు భారీగా పెరిగాయి. 2017లో నెలకు సగటున రూ. 4,000 కోట్లుగా ఉన్న సిప్ పెట్టుబడులు, ఈ ఆర్థిక సంవత్సరంలో నెలకు రూ. 28,000 కోట్లకు పైగా పెరిగాయి. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి ఉన్నప్పటికీ, బలమైన దేశీయ మదుపర్ల మద్దతు, ప్రభుత్వ విధానాలతో భారత ఈక్విటీ మార్కెట్లు నిలకడగా రాణించాయి. ఈ కాలంలో నిఫ్టీ 11.1 శాతం, సెన్సెక్స్ 10.1 శాతం చొప్పున లాభపడ్డాయి. గతేడాదితో పోలిస్తే ఐపీఓల సంఖ్య 20 శాతం పెరగ్గా, ఎస్ఎంఈ విభాగంలో 217 కంపెనీలు రూ. 9,600 కోట్లకు పైగా నిధులు సమీకరించాయని సర్వే వివరించింది.

## క్షీణించిన టాటామోటార్స్ నికరలాభం



**ముంబయి,జనవరి 29:** టాటామోటార్స్ మూడో త్రైమాసిక నికరలాభాలు గణనీయంగా తగ్గాయి. రూ.705 కోట్లు ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన 1355 కోట్ల నికరలాభంతో పోలిస్తే 48శాతం క్షీణించింది. టాటామోటార్స్ ఇపుడు కేవలం వాణిజ్య వాహనాల విభాగానికి మాత్రమే పరిమితం అయింది. ప్యాసింజర్ వాహన బిజినెస్‌ను గత అక్టోబరులో నే విడదీయడంతో ఇపుడు కమర్షియల్ వాహన సెగ్మెంట్‌కే పరిమితం అయింది. రాబడులు 16శాతం పెరిగి 21,847 కోట్లుగా ఉన్నాయి. నిర్వహణ మార్జిన్లు 12.60శాతం మెరుగుపడినట్లు సంస్థ వెల్లడించింది. అదే గత ఏడాది మూడో త్రైమాసికంలో 12.07శాతం మాత్రమే వృద్ధిని నమోదుచేసింది. జిఎస్టీ హేతుబద్ధీకరణ, పండుగల సీజన్‌లో కొంతమేర కలిసొచ్చిందని ఎండి సిఇఒ గిరీష్ వాఘ్ తెలిపారు. ప్రస్తుతం భావితరం ట్రక్కులు 17 రకాలు విడుదల చేసామని, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటి అధునాతన ఫీచర్లతో ఈ ట్రక్కులుఉన్నట్లు తెలిపారు. వాణిజ్య వాహనాల హోల్‌సేల్ బిజినెస్ పటిష్టమైన వృద్ధి ఉందని, 20శాతం పెరిగి వార్షిక వృద్ధితో 1,16,800 యూనిట్లు విక్రయించినట్లు తెలిపింది. దేశీయంగా కూడా 18శాతం పెరిగాయని, ఎగుమతులు 70శాతంపెరిగినట్లు కంపెనీ వివరించింది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 30 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 12.5శాతంగా ఉంది. డీమెర్జర్ స్టాంప్‌డ్యూటీ రూ.902 కోట్లు, అనుకోనివిధంగా వచ్చిన తక్షణ వ్యయం 1,643కోట్లు, కొత్త లేబర్‌కోడ్లకు 603 కోట్లు, ఇక వివిధ ఆస్తుల స్వాధీనం ప్రక్రియకోసం మరో 82 కోట్లు వ్యయం జరిగిందని, నికరలాభాలపై ప్రభావంచూపించినట్లు తెలిపారు.

## యేడాది మొత్తం ఈక్విటీల్లో ఎఫ్ఐఐల విత్‌డ్రాలే ఎక్కువ



**న్యూఢిల్లీ,జనవరి 29:** విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు, విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు భారత ఈక్విటీ మార్కెట్లనుంచి ఎక్కువశాతం విత్‌డ్రాలకే ప్రాధాన్యతనిచ్చినట్లు ఆర్థికసర్వేలో వెల్లడి అయింది. ఈ ఆర్థికసంవత్సరంలో ఎఫ్‌పిఐలు రూ.16,500 కోట్లు విత్‌డ్రాచేసినట్లు తేలింది. అయితే ఎఫ్‌పిఐలపరంగా ఈక్విటీలనుంచి తరలిపోయినా డెట్‌రంగంలో పెరిగినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ డిసెంబరు మాసంలో ఎఫ్‌పిఐలు ఎక్కువగా భారతీయ ఈక్విటీలనుంచి తరలివెళ్లినట్లు తెలుస్తోంది. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. గ్లోబల్ రిస్క్ పెరగడం, అమెరికా బాండ్ల రాబడులు పెరగడం, వాణిజ్యం, విధివిధానాల్లో అనిశ్చితి, రూపాయి క్షీణత వంటివి కారణం అయినట్లు తెలుస్తోంది. పదేళ్ల భారత్, యుఎస్ ప్రభుత్వ బాండ్ల రాబడులు 165 బేసిస్‌పాయింట్లు తగ్గాయి. ఆ తర్వాత 250 బేసిస్‌పాయింట్లకు పెరిగాయి. డిసెంబరులో భారతీయ రాబడులు పెరిగితే అమెరికా డాలర్ క్షీణించింది. విదేశీ ఇన్వెస్టర్లు విత్‌డ్రాలు పెంచితే దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెంచారు. మూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలు నికరంగా ఎక్కువ స్థాయిలో కొనుగోళ్లుజరిపాయి. దీనివల్ల ఎఫ్‌పిఐల విక్రయ నష్టాలనున భర్తీచేసినట్లయింది. రెండోత్రైమాసికంలో ఎన్ఎస్ఇలో లిస్ట్ అయిన ఈక్విటీల విలువల్లో 18.3 శాతం దేశీయ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు ఉన్నట్లు తేలింది. అలాగే 16.7శాతం ఎఫ్ఐఐల వాటాలున్నట్లు తేలింది.దేశీయంగా మూచువల్‌ఫండ్స్ నిర్వహణ ఆస్తులు ఎఫ్‌పిఐల పరంగాచూస్తే 81.4 లక్షల కోట్లుగాఉన్నాయి.మార్చి 2025 నాటికి 10.4 శాతంపెరిగాయి. దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడుల పరంగా కీలకంగా కొనసాగారు. మూచువల్ ఫండ్స్, బీమా కంపెనీల్లోనే ఎక్కువ పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్ల విత్‌డ్రాల సమయంలో దేశీయ ఇన్వెస్టర్లు పెట్టు బడులు పెంచినట్లు తేలింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.